


తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త




epaper.vaartha.com WWW.VAARTHA.COM రాజమహేంద్రవరం : fb.com/vaartha Digital

Published from Rajahmundry, Vijayawada, Hyderabad, Visakhapatnam, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam


16-10-2025 గురువారం సంపుటి: 31 సంచిక: 255 పేజీలు: 8+4 వెల: 6.50



సత్యమేవ జయతే



## సూపర్ GST సూపర్ సేవింగ్స్



GST కార్డ్: మీరు ఎంత ఆదా చేశారో తెలుసుకోండి

GST 2.0 సంస్కరణల ఉత్సవ్ కార్యక్రమం మరియు అభివృద్ధి కార్యక్రమాల కోసం కర్నూలు జిల్లా, ఆంధ్రప్రదేశ్‌కు విచ్చేస్తున్న..

గౌ॥ భారత ప్రధాని

## శ్రీ నరేంద్ర మోదీ గారికి

గౌ॥ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి

## శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు

## మరియు ఆంధ్ర రాష్ట్ర ప్రజల సహృదయ సుస్వాగతం!

16 అక్టోబర్ 2025, సాయంత్రం 4 గంటలకు రాగమయూరి గ్రీన్ హిల్స్‌లో

## సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ బహిరంగ సభ

### ప్రధాని పాల్గొనే కార్యక్రమాలు

గౌరవ ప్రధాని శ్రీ నరేంద్ర మోదీ గారిచే రూ.13,429 కోట్లు విలువైన ప్రాజెక్టుల
శంకుస్థాపన I ప్రారంభోత్సవాలు I జాతికి అంకితం

### శంకుస్థాపనలు

- కర్నూలులో రూ.2,886 కోట్ల విద్యుత్ ప్రాజెక్టులు
- కర్నూలు జిల్లా, ఓర్వకల్లులో రూ.2,786 కోట్ల పారిశ్రామిక కేంద్రం
- కడప జిల్లా, కొప్పర్తిలో రూ.2,136 కోట్ల పారిశ్రామిక కేంద్రం
- రూ.677 కోట్లతో చేపడుతున్న రైల్వే ప్రాజెక్టులు
- రూ.964 కోట్లతో చేపడుతున్న సబ్బవరం-షీలా నగర్ రోడ్డు

### ప్రారంభోత్సవాలు

- రూ.1,142 కోట్లతో చేపట్టిన 6 రహదారి ప్రాజెక్టులు
- కృష్ణాజిల్లా, నిమ్మలూరులో రూ.362 కోట్లతో చేపట్టిన రక్షణ పరికరాల ఉత్పత్తి ప్రాజెక్టు
- రూ.200 కోట్లతో చిత్తూరులో చేపట్టిన ఇండేన్ బాట్లింగ్ ప్లాంట్

### జాతికి అంకితం

- రూ.546 కోట్లతో చేపట్టి పూర్తిచేసిన రైల్వే ప్రాజెక్టులు
- రూ.1,730 కోట్లతో నిర్మించిన 422 కి.మీ.ల శ్రీకాకుళం-అంగుల్ సహజ వాయు పైప్‌లైన్

జారీచేసిన వారు: సంచాలకులు, సమాచార, పౌర సంబంధాల శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

జీఎస్టీ లాభాలకు ధన్యవాదాలు - ప్రధాని, ముఖ్యమంత్రి కృషికి అభినందనలు



బుధవారం శ్రీశైలంలో భద్రతా ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు



శ్రీశైలంలోని బహిరంగ సభ ప్రాంతంలో టిడిపి, జనసేన, బిజెపి పతాకాలు



ముస్తాబైన ప్రధాని మోడీ బహిరంగసభ వేదిక

# బెంగళూరులో గుంతల రోడ్లు ట్రాఫిక్ జామ్

## ఆస్తిపన్ను కట్టేదిలేదంటూ ప్రజల ఆగ్రహం

**బెంగళూరు, అక్టోబర్ 15:** భారీ వర్షాలు, నిర్వహణ లోపాలతో కర్ణాటక రాజధాని బెంగళూరులో గుంతల మయమైన రోడ్లపై సర్వత్రా చర్చ జరుగుతోంది. నిత్యం ట్రాఫిక్ జామ్‌లు, గుంతలు నిండిన రోడ్ల మీద ప్రయాణంలో ప్రజల నుంచి తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. అధ్వాన్నంగా మారిన రహదారులు, మౌలిక సదుపాయాలపై నగరవాసులు ప్రభుత్వంపై దుమ్మెత్తిపోస్తున్నారు. గుంతల రోడ్లతో విసిగిపోయిన స్థానికులు కర్ణాటక సర్కార్‌పై విమర్శలు చేస్తున్నారు. ఇకపై తాము ఆస్తి పనులు చెల్లించేది లేదంటూ తెగేసి చెబుతున్నారు. ప్రజలబెదిరింపుల నేపథ్యంలో ఈ సమస్యపై కర్ణాటక డిప్యూటీ సిఎం డికె శివకుమార్ స్పందించారు. రోడ్లపై గుంతలు పూడ్చే పనులు వేగంగా జరుగుతున్నట్లు తెలిపారు. అంతేకాదు నగరంలో ట్రాఫిక్‌సమస్యను సరిచేసేందుకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని చెప్పారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా ఆయన పోస్ట్ చేశారు. బెంగళూరు నగరంలో ట్రాఫిక్ సజావుగా సాగేలా ప్రాధాన్యత ఇస్తున్నాం. నగరంలోని వివిధ ప్రాంతాల్లో గుంతలు పడిన రోడ్లను తారుతో పూడ్చే పనులు వేగంగా జరుగుతున్నాయి అని ఎక్స్ పోస్టులో డికె రాసుకొచ్చారు. గుంతల రోడ్లు, చెత్తకుప్పలు దర్శనమిస్తున్న బెంగళూరు దుస్థితి గురించి తీవ్ర చర్చ నడుస్తోంది. బెంగళూరును సందర్శించిన ఓ విదేశీ అతిథి తనకు ఎదురైన ప్రశ్నను బయోకాన్ వ్యవస్థాపకురాలు కిరణ్ మజుందార్ షా నెటిజన్లతో పంచుకున్నారు. బెంగళూరు రోడ్లు మాత్రమే కాదు వీధుల్లో పేరుకున్న చెత్తను గురించి చైనానుంచివచ్చిన ఆ సందర్శకురాలు వేసిన ప్రశ్నను భారతీయుల దృష్టికి తీసుకువస్తున్నట్లు తెలిపారు.

# యూనిఫాంతో షూ వేసుకురాలేదని విద్యార్థినికి పనిష్మెంట్

## అవమానభారంతో విద్యార్థిని అనుమానాస్పద మృతి

**రాంచీ, అక్టోబరు 15:** చెప్పులు వేసుకుని స్కూల్‌కు వచ్చిన విద్యార్థిని చెంపపై ప్రిన్సిపాల్ కొట్టింది. నాటి నుంచి మానసికంగా కుంగిపోయిన ఆ బాలిక ఆసుపత్రిలోచికిత్స పొందుతూ మరణించింది. జార్ఖండ్‌లోని గర్వా జిల్లాలో ఈ సంఘటన జరిగింది. బార్‌గఢ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని స్కూల్‌లో దివ్య కుమారి 12వ తరగతి చదువుతున్నది. సెప్టెంబర్ 15న ఆ విద్యార్థిని బూట్లకుబదులుగా చెప్పులు ధరించి స్కూలుకు వచ్చింది. అసెంబ్లీకి అలాగే హాజరైంది. డ్రెస్ కోడ్ పాటించని విద్యార్థిని దివ్య కుమారిని, ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ ద్రౌపది మింజ్ అందరి ముందు తిట్టింది. అంతేగాక ఆమె చెంపపై కొట్టింది. దీంతో కుటుంబ సభ్యులు డాల్టన్‌గంజ్‌లోని ఆసుపత్రిలో దివ్యకు ప్రాథమిక చికిత్స అందించారు. ఆ తర్వాత రాంచీలోని రిమ్స్‌కు ఆమెను రిఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతున్న దివ్య అక్టోబర్ 14న మరణించింది.

# ప్రధాని మోడీ రాక నేడే

>> పీఠంలో కొలువైన భ్రమరాంబిక దేవిని ప్రధాని మోడీ దర్శించుకుంటారు. కర్నూలు, నంద్యాల జిల్లాల్లో ప్రధాని పర్యటన సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేసింది. భారీ బహిరంగ సభను నిర్వహించనుంది. 2024 ఎన్నికల తర్వాత అటు కేంద్రంలో, ఇటు రాష్ట్రంలో కూటమి నేతృత్వంలో డబుల్ ఇంజిన్ సర్కార్ ఏర్పడినతర్వాత ఎపిలో ప్రధాని విశాఖ, అమరావతి ప్రాంతాల్లో పర్యటించారు. గురువారం రాయలసీమ ప్రాంతంలో ప్రధాని పర్యటన జరగనుంది.

**సభకు భారీ ఏర్పాట్లు**

జిఎస్‌టి 2.0 నిర్ణయంపై రాష్ట్ర ప్రభుత్వం దసరా పండుగ నుంచి భారీ ఎత్తున రాష్ట్ర వ్యాప్తంగా ప్రచార కార్యక్రమం చేపట్టింది. రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగం మొత్తం ఈ ప్రచారంలో భాగమైంది. యోగా డే సందర్భంగా ప్రభుత్వం ఏ స్థాయిలో ప్రచారం చేపట్టిందో... ఇప్పుడు సూపర్ జిఎస్‌టి సూపర్ సేవింగ్స్ ప్రచార కార్యక్రమాన్ని అంతే ప్రతిష్టాత్మకంగా తీసుకుంది రాష్ట్ర ప్రభుత్వం. మండలాల వారీగా, జిల్లాల వారీగా జరుగుతున్న కార్యక్రమాల పర్యవేక్షణకు.. మరింతగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రత్యేకంగా ఓ డ్యాష్ బోర్డు ఏర్పాటు చేసుకుని మరీ జిఎస్‌టి సంస్కరణలపై ప్రచారాన్ని రాష్ట్ర ప్రభుత్వం, కూటమికిచెందిన మూడు పార్టీలు చేపట్టాయి. ప్రస్తుతానికి 90 వేలకుపైగా ఈవెంట్లను రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించారు. సూపర్ జిఎస్‌టి సూపర్ సేవింగ్స్ కార్యక్రమం సూపర్ సక్సెస్ అయిన క్రమంలో కర్నూలులో ప్రధాని హాజరు కానున్న భారీ బహిరంగ సభను అంతే సక్సెస్ చేసేలా రాష్ట్ర ప్రభుత్వం పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేసింది. వివిధ శాఖల సమన్వయంతో ఎక్కడా ఎలాంటి లోటుపాట్లు లేకుండా.. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటోంది రాష్ట్ర ప్రభుత్వం. గత 15 రోజుల నుంచి వివిధ శాఖలకు చెందిన ఉన్నతాధికారులు నిరంతరం కర్నూలు సభను మానిటర్ చేస్తున్నారు.

సభకు వచ్చే వారికి భోజన సౌకర్యం మొదులుకుని... పార్కింగ్, సభలో సీటింగ్ ఏర్పాట్లు, మంచినీటి సరఫరా, తిరిగి వెళ్లేటప్పుడు కూడా ఎలాంటి ఇబ్బంది లేకుండా... అసౌకర్యం కలగకుండా రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగం భారీ ఎత్తున ఏర్పాట్లు చేసింది. ఇక ఉమ్మడి కర్నూలు జిల్లాల నుంచి భారీ ఎత్తున ప్రజలు ఈ సభకువస్తారని అంచనా. లక్షలాది సంఖ్యలో ప్రజలు వచ్చే అవకాశం ఉన్నందున దానికి తగ్గ ఏర్పాట్లు, బందోబస్తు చేపట్టారు. సభకు వచ్చే వారికి ప్రయాణ సౌకర్యం కల్పించారు. అలాగే భారీ బందోబస్తు చేశారు. సుమారు 1800 మంది బలగాలతో ప్రధాని సభకు బందోబస్తు పెడుతున్నారు. ఇక ట్రాఫిక్ జాంలు కాకుండా అన్ని రకాల జాగ్రత్తలు తీసుకున్నారు. కర్నూలు, నంద్యాల జిల్లాల్లో కొన్ని ప్రాంతాల్లో ట్రాఫిక్ డైవర్షన్లు పెట్టారు.

**ముఖ్యమంత్రి మానిటరింగ్... మంత్రుల మకాం**

ఇక ప్రధాని పర్యటనను సూపర్ సక్సెస్ చేసేందుకు సిఎం ప్రత్యేక దృష్టి సారించారు. ప్రధాని పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూనేఉన్నారు. అలాగే జిఎస్‌టి సంస్కరణలపై క్షేత్ర స్థాయిలో జరుగుతున్న ప్రచారానికి సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ ఉన్నారు. సభకు సంబంధించిన ఏర్పాట్లతో పాటు శ్రీశైల క్షేత్రాన్ని ప్రధాని సందర్శిస్తుండటంతో ఆ దేవాలయంలో ఏర్పాట్లను.. ప్రధాని దృష్టికి తీసుకురావాల్సిన అంశాలపై అధికారులతో ముఖ్యమంత్రి, డిప్యూటీ సిఎం ఎప్పటికప్పుడుచర్చిస్తూనే ఉన్నారు. ఇక కర్నూలు జిల్లాలో మంత్రులు దాదాపు వారంరోజులనుంచి మకాంవేశారు. సభ ఏర్పాట్లపై దగ్గరుండి పర్యవేక్షించారు. శాఖల వారీగా బాధ్యతలు పంచుకుంటూ, సమిష్టిగాసభకు సంబంధించిన ఏర్పాట్లపై సమీక్షి ంచుకుంటూ వారం రోజుల నుంచి కర్నూలులోనే ఉన్నారు మంత్రులు.

**రూ. 13,429 కోట్ల విలువైన అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించనున్న ప్రధాని**

కర్నూలు, నంద్యాల జిల్లాలో ప్రధాని పర్యటన సందర్భంగా ప్రధాని నరేంద్ర మోడీ భారీ ఎత్తున ప్రారంభోత్సవాలు, శంకుస్థాపన కార్యక్రమాలను చేపట్టనున్నారు. మొత్తంగా రూ.13,429 కోట్ల మేర అభివృద్ధి పనులకు మోడీ శ్రీకారం చుట్టనున్నారు. వీటిల్లో కొన్ని శంకుస్థాపనలు, కొన్ని ప్రారంభోత్సవాలు ఉండగా.. ఓ రెండు ప్రాజెక్టులను జాతికి అంకితం చేస్తున్నారు ప్రధాని. రూ.9449 కోట్ల విలువైన పనులకు శంకుస్థాపనలు చేస్తుండగా... రూ.1704 కోట్ల విలువైన ప్రాజెక్టులను మోడీ ప్రారంభించనున్నారు. ఇక రూ.2276 కోట్ల విలువైన ప్రాజెక్టులను జాతికి అంకితం చేస్తున్నారు.

**అభివృద్ధి కార్యక్రమాల వివరాలివి:**

- విద్యుత్ ట్రాన్స్ మిషన్ వ్యవస్థకు శంకుస్థాపన-రూ. 2886కోట్లు
- ఓర్వకల్లు- కొప్పర్తి పారిశ్రామిక కారిడార్ శంకుస్థాపన రూ. 4922 కోట్లు
- కొత్త వలస- విజయనగరం మధ్య 4వ లైన్ శంకుస్థాపన రూ.493 కోట్లు
- పెందుర్తి - సింహాచలం నార్త్ మధ్య రైల్ ఫ్లైఓవర్ లైన్ శంకుస్థాపన రూ.184 కోటు
- సబ్బవరం- షీలానగర్ జాతీయ రహదారి శంకుస్థాపన రూ.964 కోట్లు
- రేణిగుంట-కడప-మదనపల్లె రోడ్డు ప్రారంభం రూ. 82 కోట్లు
- కడప-నెల్లూరు చునియంపల్లి రోడ్లు ప్రారంభం రూ. 286 కోట్లు
- కనిగిరి బైపాస్ రోడ్ ప్రారంభం రూ.70 కోట్లు
- గుడివాడ-నూజెండ్ల వద్ద 4లేన్ల రోడ్డు ఓవర్ బ్రిడ్జి ప్రారంభం రూ.98 కోట్లు
- కళ్యాణదుర్గం- రాయదుర్గం- మొలకలమూరు రోడ్డు ప్రారంభం రూ.13 కోట్లు
- పీలేరు నుండి కలసూర్ సెక్షన్ వరకు నాలుగు లేన్ల రోడ్ ప్రారంభం రూ.593 కోట్లు
- నిమ్మకూరులోని తీనిలిలో అడ్వాన్స్‌డ్ నైట్ విజన్ ప్రారంభం రూ.362 కోట్లు
- చిత్తూరులోని ఇండేన్ బాట్లింగ్ ప్లాంట్ ప్రారంభం రూ. 200 కోట్లు
- కొత్తవలస -కొరాపుట్ రైల్వే డబ్లింగ్ పనులను జాతికి అంకితం రూ. 546 కోట్లు
- శ్రీకాకుళం అంగుల్ నాచురల్ గ్యాస్ పైప్‌లైన్ జాతికి అంకితం రూ.1730 కోట్లు

**ప్రధాని పర్యటన ఇలా:**

ఢిల్లీ నుంచి నేరుగా కర్నూలు ఎయిర్ పోర్టుకు ప్రధాని చేరుకుని అక్కడి నుంచి శ్రీశైల దేవస్థానానికి చేరుకుంటారు. భ్రమరాంబ మల్లికార్జున స్వామి వార్లకు ప్రధాని ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అనంతరం శ్రీశైలంలోని శివాజీ స్ఫూర్తి కేంద్రాన్ని సందర్శిస్తారు. అనంతరం ప్రధానమంత్రి మధ్యాహ్నం 2:30 గంటల సమయంలో కర్నూలు సభకు చేరుకుని సభలో పాల్గొంటారు. అనంతరం ప్రధాని హెలీకాప్టర్ ద్వారా కర్నూలు ఎయిర్ పోర్టుకు చేరుకుని.. ఢిల్లీకి తిరుగుపయనం అవుతారు.

# చిత్తడి నేలల్లో టూరిజం కారిడార్

>> రాష్ట్రాల కంటే మనం ముందున్నాం. రాష్ట్ర పరిధిలో ఒకేసారి 16 చిత్తడి నేలలకు టెక్నికల్, గ్రీవెన్స్ కమిటీ ఆమోదం లభించింది. వీటిని అధికారికంగా గుర్తిస్తూ నోటిపై చేయబోతున్నాం. దక్షి ణ భారత దేశ చరిత్రలో ఇంత పెద్ద ఎత్తున ఒకేసారి చిత్తడి నేలలకు గుర్తింపు ఇచ్చి చరిత్ర సృష్టించబోతున్నాం. అందులో సోంపేట, తవిటి మండలాల పరిధిలో 5 వేల ఎకరాల్లో విస్తరించి ఉన్న పెద్ద బీల, చిన బీల, తుంపర, చిత్తడి నేలలను ఒక కారిడార్‌గా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. 2018లో పోరాట యాత్ర సందర్భంగా సోంపేట ప్రాంతంలో చిత్తడి నేలలను పరిశీలించాను. పర్యవేక్షణ లేక పేద బీల, చిన బీల ప్రాంతం ఆక్రమణలకు గురైన విషయం స్థానికులు నా దృష్టికి తీసుకువచ్చారు. అధికారంలోకి వస్తే ప్రకృతి ప్రసాదితమైన ఆ చిత్తడి నేలలకు రక్షణ కల్పించడంతోపాటు అభివృద్ధి చేయాలని భావించాము. అటవీ, పర్యావరణ శాఖ మంత్రిగా సోంపేట చిత్తడి నేలలకు అధికారిక గుర్తింపు తీసుకువచ్చే చర్యల్లో భాగస్వామి కావడం ఆనందంగా ఉంది. పెద బీల, చిన బీల, తుంపర కలిపి వేలాది ఎకరాల్లో విస్తరించి ఉన్న చిత్తడి నేలల గుర్తింపు ప్రక్రియ పూర్తయిన అనంతరం ఆ ప్రాంతంలో పర్యాటక అభివృద్ధికి ప్రణాళికలు రూపొందిస్తాం. ఎకో టూరిజం అభివృద్ధి చేయడం ద్వారా పర్యావరణ పరిరక్షణతో పాటు స్థానికులకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయి. అనంతపురం జిల్లా పరిధిలోని వీరాపురం, రాజమండ్రి సమీపంలోని పుణ్యక్షేత్రంలో విస్తరించి ఉన్న చిత్తడి నేలలు అరుదైన పక్షి జాతులకు నెలవుగా ఉన్నాయి. ఈ ప్రాంతాల్లో ప్రత్యేక పక్షుల సంరక్షణ కేంద్రాలు ఏర్పాటు చేసి పర్యాటకులను ఆకర్షించే విధంగా చర్యలు తీసుకుంటాం. రాష్ట్రంలోనే అతిపెద్ది చిత్తడినేలగా రాంసర్(అంతర్జాతీయ) గుర్తింపు పొందిన కొల్లేరు లాంటి సరస్సుల పరిరక్షణపై ప్రత్యేకంగా దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. కొల్లేరు చిత్తడి నేల పరిరక్షణ కోసం అటవీశాఖ వన్యప్రాణి విభాగం ఆధ్వర్యంలో కొల్లేరు లేక్ మేనేజ్మెంట్ అథారిటీ ఏర్పాటు కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించాను. రాష్ట్రవ్యాప్తంగా గుర్తింపు పొందిన మిగిలిన చిత్తడి నేలలకు కూడా అంతర్జాతీయ గుర్తింపు లభించేందుకు కృషి చేయాల్లి అని చెప్పారు. నాలుగు గ్రేడుల పంచాయతీల విధానం కచ్చితంగా గ్రామీణ ప్రజలకు మేలు చేస్తుందని డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ తెలిపారు.. రూర్బన్ పంచాయతీలు గుర్తించినవాటిలో పట్టణ స్థాయి మౌలిక సదుపాయాలను కల్పిస్తాము. ప్రజలకు మెరుగైన సేవలు అందించాలనే లక్ష్యంతోనే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారి నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం పని చేస్తోంది. స్థానిక సంస్థల పాలనలో పారదర్శకత తీసుకువచ్చేలా సంస్కరణలు తీసుకువచ్చాము. వీటిని క్షేత్ర స్థాయిలో అమలు చేయడంలో సిబ్బంది పాత్ర కీలకం" అన్నారు. పంచాయతీలను నాలుగు గ్రేడులుగా వర్గీకరించడం ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించే వెసులుబాటు కలుగుతుందని అసోసియేషన్ ప్రతినిధులు చెప్పారు. 10 వేల మంది ఉద్యోగులకు పదోన్నతులు కల్పన చేపట్టడంతో అందరూ సంతోషంగా ఉన్నామని, మరింత ఉత్తేజంతో విధులు చేపడతామని వివరించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రతినిధులు విజ్ఞప్తి చేసిన పలు అంశాలపై ఉప ముఖ్యమంత్రి స్పందించి... వాటిపై పరిశీలన చేసి తగిన నిర్ణయం తీసుకుంటామన్నారు. ఎపి పంచాయతీ వ్యవస్థలో సంస్కరణలు చేపట్టి నాలుగు గ్రేడులుగా పంచాయతీలను వర్గీకరించడం శుభ పరిణామమని ఎపి పంచాయతీ సెక్రెటరీస్ అసోసియేషన్ తెలిపింది. ఈ రోజు సాయంత్రం మంగళగిరిలోని క్యాంపు కార్యాలయంలో అసోసియేషన్ ప్రతినిధులు ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి పవన్ కల్యాణ్‌తో సమావేశమయ్యారు. పంచాయతీ పరిపాలన వ్యవస్థలో పునర్వ్యవస్థీకరణ చేపట్టినందుకు కృతజ్ఞతలు తెలియచేశారు.

# రాష్ట్రంలో అద్భుతాలు

>> కృత్రిమ మేధస్సును (ఏఐ)ని స్వీకరించాలి, పాఠ్యాంశాలను పునర్వ్యవస్థీకరించాలి. మన యువతను కొత్త అవకాశాలకు సిద్ధం చేయాలి. గతంలో ఐటీ విప్లవం వల్ల భారత్ లాభపడింది. ఐటీ విప్లవం హైదరాబాద్, బెంగళూరు వంటి నగరాల రూపురేఖలు మార్చింది. ఇప్పుడు కృత్రిమ మేధస్సు (ఏఐ)తో కొత్తతరం నగరాలు అభివృద్ధి చెందబోతున్నాయి. అందుకే విద్యకు అంతటి ప్రాధాన్యమైన పాత్ర ఉంది. గౌరవ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈ విషయన్ని గ్రహించారు. అందుకే విద్య, ఐటీని ఒకే మంత్రిత్వ శాఖ కిందకు తెచ్చి, ఆ బాధ్యతలను నాకు అప్పగించారు. ఈ రెండు రంగాల్లో క్షేత్రస్థాయి అత్యుత్తమ ఫలితాలను తేవడమే నా లక్ష్యం. ఆంధ్రప్రదేశ్‌లో మరో ముఖ్యమైన శాఖ రియల్ టైం గవర్నెన్స్ (ఆర్టీజీ). దీనిద్వారా కృత్రిమ మేధస్సు ఆధారిత పద్ధతులను అమలుచేయడం ద్వారా రైతులు, కూలీలు వంటి వర్గాల జీవన ప్రమాణాలను మెరుగుపరచడానికి వినియోగిస్తున్నాం. తద్వారా సమా జంలో వెనుకబడిన వర్గాల వారి ఆదాయం పెంచడమే లక్ష్యం మని అన్నారు. గ్రేటర్ విశాఖ ఎకనమిక్ కారిడార్ ను 1ట్రిలియన్ డాలర్ ఎకానమీ చేయాలన్నదే మా లక్ష్యం. ఇందుకోసం ప్రత్యేక అధికారులను నియమించి, ఇంటిగ్రేటెడ్ ప్రణాళికలు (ఎయిర్ పోర్టు, రైల్వే, రహదారులు) రూపొందిస్తున్నాం. హైదరాబాద్ అభివృద్ధికి 30ఏళ్లు పడితే, పదేళ్లలోనే విశాఖను అదేతరహాలో అభివృద్ధి చేయాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నాం. విశాఖ,అమరావతి, రాయలసీమ ఎకనమిక్ కారిడార్ లను ప్రపంచస్థాయి అత్యుత్తమ ప్రమాణాలతో అభివృద్ధి చేయాలని నిర్ణయించాం.స్పీడ్ ఆఫ్ డూయింగ్ లో ఎపి నెం.1గా నిలబడుతుంది. ఎంఓయులను పట్టించుకోకుండా నేరుగా ఎగ్జిక్యూషన్ కే వెళ్తున్నాం. ఆర్సెలర్ మిట్టల్ తో ఇప్పటికీ ఎంఓయు లేదు, నవంబర్ లో భూమి పూజ చేస్తున్నాం. చాలామంది దావోస్ వెళ్లి ఏంచేశారని అడిగారు. దావోస్ లో గూగుల్ క్లౌడ్ సిఇఓను సిఎంకలిశారు. నేను ముంబాయి వెళ్లినపుడు టిసిఎస్ ఛైర్మన్ చంద్రశేఖరన్‌తో పలు ప్రాజెక్టుల పురోగతిపై చర్చించాను. పెట్టుబడుల కోసం క్రియాశీలకంగా ముందుకెళ్తున్నామన్నారు.

# ఎపి పర్యటనపై ప్రధాని మోడీ తెలుగులో ట్వీట్

**విజయవాడ,అక్టోబరు 15,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ పర్యటనపై ప్రధాని నరేంద్ర మోడీ "ఎక్స్" వేదికగా తెలుగులో ట్వీట్ చేసారు.రేపు, అక్టోబర్ 16న నేను ఏపీలో ఉంటా.. శ్రీశైలంలోని శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవస్థానంలో ప్రార్థనలు చేస్తా.. కర్నూలులో 13,400 కోట్లకు పైగా విలువైన అభివృద్ధి పనుల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాల్లో పాల్గొంటా.. ఈ పనులు విద్యుత్, రైల్వేలు, పెట్రోలియం, రక్షణ, పరిశ్రమలతోపాటు మరిన్ని రంగాలను సంబంధించినవి అంటూ ప్రధాని మోడీ ట్వీట్ చేసారు.

# విశాఖ ఉక్కుప్లాంట్‌కు ఊరట

## షేర్లుగా విద్యుత్తు బకాయిలు మారుస్తూ ఉత్తర్వులు

**విజయవాడ,అక్టోబరు 15,ప్రభాతవార్తప్రతినిధి:** విశాఖ ఉక్కు ప్లాంటుకు ఊరట లభించింది. ప్లాంట్‌కు సంబంధించి ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది.వైజాగ్ స్టీల్స్ చెల్లించాల్సిన రూ.2400 కోట్ల విద్యుత్ బకాయిలు షేర్లుగా మార్పు చేసింది.ఇందుకు సంబంధించి ఉక్కు మంత్రిత్వశాఖ ప్రతిపాదన చేసింది.ఇందుకు ఏపీ ప్రభుత్వ సుముఖతను వ్యక్తం చేసింది. మొత్తం 7 శాతం బకాయిలను షేర్ కేపిటల్‌గా మార్చేందుకు నిర్ణయం తీసింది.ఈ మేరకు పరిశ్రమల శాఖ ఉత్తర్వులు జారీ చేసింది.

## వారం - వర్జ్యం

16-10-2025, గురువారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
ఆశ్వయుజ మాసం, దక్షిణాయణం
శరదృతువు, కృష్ణపక్షం
దశమి ఉ.10.38
ఆశ్లేష మ.12.45
వర్జ్యం : రా.1.22-3.03
దు.ఉ.9.56-10.43, 2) మ.2.39-3.26
శుభసమయం: ఉ.8.15-9.00
రాహుకాలం - మ.1.30-3.00

## వార్తాఫలం

**మేషం :** పనులు నిదానంగా పూర్తి చేస్తారు. కోర్టు కేసులు ఓ కొలిక్కి వస్తాయి.

**వృషభం:** దూరప్రాంత ప్రయాణాలలో నూతన వ్యక్తులతో పరిచయాలు ఏర్పడతాయి.

**మిథునం:** సంఘ సేవా కార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటారు.

**కర్కాటకం :** సన్నిహితులతో కలిసి విందు, వినోదాలలో పాల్గొంటారు.

**సింహం:** బాధ్యతలు సమర్థవంతంగా పూర్తి చేస్తారు. ఆర్థిక పరిస్థితి అనుకూలం.

**కన్య :** సంతానం కోసం అధికంగా ఖర్చు చేస్తారు. నూతన ప్రయతాలు కలిసివస్తాయి.

**తుల :** బంధు మిత్రులను కలిసి ఆనందంగా గడుపుతారు. స్థలాలు కొనుగోలు.

**వృశ్చికం:** నూతన పెట్టుబడులకు తగిన లాభాలు పొందుతారు.

**ధనుస్సు:** సంఘంలో గౌరవ ప్రతిష్టలు పెరుగుతాయి. వ్యాపారాలు అభివృద్ధి చెందుతాయి.

**మకరం:** కొత్త కార్యక్రమాలు సకాలంలో పూర్తి చేయటానికి విఫల యత్నం చేశారు.

**కుంభం:** ఆరోగ్య విషయంలో మెలుకువ అవసరం. చర్చాగోష్టులలో పాల్గొంటారు.

**మీనం :** పుస్తక పఠనం యందు ఆసక్తి కలిగియుంటారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# బాలసరస్వతీ దేవి ఇక లేరు

>> తెలుగు వారికి సుపరిచితం. సినిమాలలో తొలి నేపథ్య గాయనిగానూ ఆమె ఎంతో పేరు తెచ్చుకున్నారు.తెలుగు, తమిళం, కన్నడ, హిందీతో సహా పలు భాషల్లో ఇప్పటివరకు 2000కు పైగా పాటలు ఆలపించి లలిత సంగీత సామ్రాజ్ఞిగా పేరు పొందింది బాల సరస్వతి దేవి. స్వప్నసుందరి, పిచ్చిపుల్లయ్య, పెళ్ళిసందడి, శాంతి, షావుకారు, దేవదాసు, లైలా మజ్ను, భాగ్యలక్ష్మి ్మ, మంచి మనసుకు మంచి రోజులు తదితర చిత్రాల్లో ఘంటసాల, ఏ.ఎం.రాజా, సౌందర్‌రాజన్, పిఠాపురం నాగేశ్వరరావు, జిక్కి, ఏపి కోమల లాంటి వారితో కలిసి ఆమె పాటలు పాడారు.రావు బాల సరస్వతి అసలు పేరు సరస్వతి. తల్లి తండ్రుల పేర్లు విశాలాక్షి , కావేటి పార్థసారధి. ఆమె తండ్రి గాయకులు, ప్రధానంగా వీణ, సితారు వాయించేవారు. చెన్నైలో కొంత కాలం ఉండి అనంతరం గుంటూరుకి మారారు. ఆలకూరు సుబ్బయ్య వద్ద బాల సరస్వతి 1939లో కర్ణాటక సంగీతం మూడు సంవత్సరాలు అభ్యసించారు. ఆపైన బాల సరస్వతిని ఆమె తండ్రి ముంబై తీసుకెళ్లి, హిందుస్తానీ సంగీత ప్రముఖులైన ఖేల్కర్, సినీ సంగీత దర్శకులు వసంత్ దేశాయ్ వద్ద అభ్యాసం చేయించారు. కాగా రావు బాలసరస్వతి దేవి మరణం పట్ల సినీ,రాజకీయ ప్రముఖులు, సంగీత అభిమానులు తీవ్ర సంతాపం వ్యక్తం చేస్తున్నారు. తెలుగు సినీ చరిత్రలో ఒక అద్భుతమైన అధ్యాయం ముగిసినట్లైందని పేర్కొన్నారు.

# ఇక క్షేత్రస్థాయి తనిఖీలు

>> మరింతగా పెరుగుతుంది. ఈ అవకాశాలను రాష్ట్రం అందిపుచ్చుకోవాలి. దీని కోసం రాష్ట్రాన్ని, అమరావతి సహా వివిధ ప్రాంతాలను సిద్ధం చేస్తున్నాం. క్వాంటం వ్యాలీ, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ ఇక విప్లవాత్మక అంశాలుగా మారబోతున్నాయి. నాణ్యమైన ఉత్పత్తులను తయారు చేసి అంతర్జాతీయ ప్రమాణాలు సాధించటంలో మన పరిశ్రమలు మెరుగైన ఫలితాలు సాధించాలి. ప్రభుత్వం, పరిశ్రమలు, పరిశోధనలు, ఎకో సిస్టం ఉంటేనే అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో ఉత్పత్తులు అందించగలం. దీంట్లో భాగంగానే అమరావతి నగరం క్వాంటం కంప్యూటింగ్ హబ్‌గా అభివృద్ధి చెందుతుంది. క్వాంటం కంప్యూటింగ్ ద్వారా రియల్ టైమ్ డేటాను విశ్లేషించి క్షేత్రస్థాయిలో అమలు చేస్తాం" అని చంద్రబాబు చెప్పారు. ప్రతి నియోజకవర్గంలో ఒక ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు చేయడమే లక్ష్యమన్నారు. విశాఖలో డేటాసెంటర్ గూగుల్‌తో ఎపి ఒప్పందం చేసుకున్నాం, ప్రపంచంలోనే ఈ నగరం అతి ఎఐ హబ్‌గా మారుతుంది.ఒక వైపు సందప సృష్టిస్తూనే.. పేదల అభివృద్ధికి కృషి చేస్తున్నాం. పి4 కింద పేదరికాన్ని రూపుమాపేందుకు ప్రయత్నాలు చేస్తున్నాం. ఓవైపు సంపద సృష్టి.. మరోవైపు పేదల జీవన ప్రమాణాల్ని మెరుగుపర్చేందుకు కృషి చేస్తున్నాం. వెల్తీ, హెల్తీ, హ్యాపీ సొసైటీగా ఎపిని మారుస్తాం. ప్రజల జీవన ప్రమాణాలను పెంచటమే లక్ష్యం. డేటా లేక్ ద్వారా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సమాచారం, పౌరసేవలు ఇలా అన్నిటినీ అనుసంధానం చేశాం. ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం డిజినెర్వ్ సెంటర్ ప్రాజెక్టులోనూ టాటాతో కలిసి పనిచేస్తున్నాం. ప్రస్తుతం కుప్పంలో అమలు అవుతోంది. దీనికి సంజీవని అని పేరు పెట్టాం. సంజీవని ద్వారా ప్రపంచంలో ఉన్న వైద్య చికిత్సల టెక్నాలజీని ఒక చోటకు తెచ్చి రాష్ట్రంలోని అందరి ఆరోగ్యాన్ని పరిరక్షించాలన్నది మా లక్ష్యమని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో ట్రాఫిక్ చలానాల పేరిట వాహనదారులను ఇబ్బందులు పెట్టవద్దని సిఎం సూచించారు.

రాష్ట్రంలోని కొన్ని అంశాలను రాజకీయంగా ఉపయోగించుకుని నేరాలు చేసేందుకు కొందరు ప్రయత్నాలు చేస్తున్నారని.. ఈ తరహా వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సిఎం సూచించారు. పిపిపి విధానంలో మెడికల్ కళాశాలలు నిర్మిస్తుంటే ..ప్రైవేటు పరం చేస్తున్నారంటూ దుష్ప్రచారం చేస్తున్నారని సిఎం ఆక్షేపించారు. పిపిపి ద్వారా వచ్చే మెడికల్ కాలేజీల్లో పేద విద్యార్థులకు అదనంగా మరిన్ని సీట్లు అందుబాటులోకి రావటంతో పాటు పేదలకు నాణ్యమైన ఉచిత వైద్యం కూడా లభిస్తుందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. అంబేద్కర్ విగ్రహానికి నిప్పు పెట్టి ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత పెంచేందుకు కూడా కొందరు కుట్రలు చేశారని.. సకాలంలో సాంకేతికత వినియోగించి వారి బండారం బయట పెట్టామన్నారు. ఇప్పుడు నకిలీ మద్యం తయారు చేసి తిరిగి ప్రభుత్వంపై బురద చల్లే ప్రయత్నం చేస్తున్నారని ముఖ్యమంత్రి అన్నారు. ఈ సమీక్షకు సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి, ఐటీ, ఆర్టిజిఎస్, ఎక్సైజ్, భూగర్భ జల వనరుల శాఖ అధికారులు హాజరయ్యారు.

# గోవా మాజీ సిఎం రవినాయక్ కన్నుమూత

**పనాజి, అక్టోబరు 15:** గోవా రాజకీయాల్లో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి, మాజీ సీఎం రవి నాయక్ ఆకస్మికంగా కన్నుమూశారు. ఆయన గుండెపోటుతో తుదిశ్వాస విడిచినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. నాలుగు దశాబ్దాలుగా గోవా రాజకీయాల్లో కీలక పాత్ర పోషించిన రవి నాయక్ మృతితో రాష్ట్రంలో విషాద ఛాయలు అలముకున్నాయి. రవి నాయక్ మరణం పట్ల ప్రధాని నరేంద్ర మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. గోవా మంత్రి రవి నాయక్‌జీ మరణవార్త నన్ను కలచివేసింది. అనుభవజ్ఞుడైన పరిపాలనాదక్షుడిగా, గోవా అభివృద్ధికి పాటుపడిన అంకితభావం గల ప్రజాసేవకుడిగా ఆయన చిరకాలం గుర్తుండిపోతారు. ముఖ్యంగా అణగారిన వర్గాల సాధికారత కోసం ఆయన ఎంతో తపన పడ్డారు. ఈ విషాద సమయంలో ఆయన కుటుంబ సభ్యులకు, మద్దతుదారులకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నానని ప్రధాని మోదీ 'ఎక్స్' వేదికగా నివాళులర్పించారు.

గోవా సీఎం ప్రమోద్ సావంత్ కూడా రవి నాయక్ మృతిపై సంతాపం ప్రకటించారు. మా సీనియర్ నేత, కేబినెట్ మంత్రి రవి నాయక్ మరణం తీవ్రంగా బాధించింది. ముఖ్యమంత్రిగా, మంత్రిగా అనేక కీలక శాఖల్లో ఆయన దశాబ్దాల పాటు అందించిన సేవలు రాష్ట్రంపై చెరగని ముద్ర వేశాయి. ఆయన నాయకత్వం, వినయం, ప్రజా సంక్షేమానికి చేసిన కృషి ఎప్పటికీ గుర్తుండిపోతాయని పేర్కొన్నారు. రవి నాయక్ తన రాజకీయ ప్రస్థానాన్ని 1980లలో మహారాష్ట్రవాది గోమంతక్ పార్టీ (ఎంజీపీ)తో ప్రారంభించారు. ఆ తర్వాత కాంగ్రెస్‌లో చేరి కీలక నేతగా ఎదిగారు. ఆయన రెండుసార్లు గోవా ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వర్తించారు. 1991లో, ఆ తర్వాత 1994లో సీఎంగా పనిచేశారు. 1998 నుంచి 1999 వరకు లోక్‌సభ సభ్యుడిగా కూడా సేవలందించారు. 2022 గోవా అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఆయన బీజేపీలో చేరారు. ప్రమోద్ సావంత్ నేతృత్వంలోని ప్రభుత్వంలో వ్యవసాయ శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. క్షేత్రస్థాయిలో ప్రజలతో బలమైన సంబంధాలు కలిగిన నేతగా, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన వ్యక్తిగా ఆయనకు మంచి పేరుంది.

# మన్యంలో మళ్లీ రగులుతున్న పోలవరం

## నిర్వాసితులకు పూర్తి స్థాయిలో న్యాయం చేయాలంటూ ఆందోళన

**చింతూరు అక్టోబర్ 10 ప్రభాతవార్త:** మన్యంలో మళ్లీ పోలవరం రగులుతుంది.పోలవరం బ్యాక్ వాటర్‌తో ఈ ఏడాది పంటలు పండే పరిస్థితి కూడా లేకుండా పోయింది.నాలుగు నెలల పాటు రహదారులు నీటమునిగి ప్రజలు అవస్థలు పడ్డారు.వ్యవసాయం చేయాల్సిన సమయంలో చేయాటనికి వాతావరణం అనుకూలించక,పోలవరం బ్యాక్ వాటర్‌తో పంటభూములు నీటమునిగి వ్యవసాయం దాదాపు కనుమరుగు అయ్యే పరిస్థితి.దాంతో రోజు వారి కూలీలకు కూలి దొరకని పరిస్థితి.కాస్తో కూస్తో ఆర్థికంగా ఉన్న కుటుంబాలు గ్రామాలను వదిలి వేరే ప్రాంతాలకు తరలిపోతున్నాయి.సామాన్యులు, మధ్య తరగతి కుటుంబాలు పోలవరం పరిహారం కోసం ఎదురుచూస్తు కాలం వెళ్ళ దీస్తున్నారు.బుధవారం చింతూరు ఐటిడిఎలో జిల్లా కలెక్టర్ గ్రీవెన్సె నిర్వహిస్తున్న సమయంలో కడుపు మండిన ముంపు గ్రామాల ప్రజలు తమ సమస్యను జిల్లా కలెక్టర్ ఎయస్ దినేష్‌కుమార్,చింతూరు ఐటిడిఎ పివో శుభం నోక్వాల్‌కు తెలియజేయటానికి తరలివచ్చిన సుమారు 2వేల మంది చింతూరులో భారీ ర్యాలీ నిర్వహించారు. ఐటిడిఎ ముందు బైటాయించారు.ఐటిడిఎ కార్యాలయం గెట్లను మూసేసిన పోలీసులు ఆందోళకారులు ఎవరు లోపలి రాకుండా గెట్ల వద్ద అడ్డుకున్నారు.బుధవారం ఎండ తీవ్రత కూడా ఎక్కువగా ఉండటంతో జిల్లా కలెక్టర్ బయటకు రావాలని నినాదాలు చేసిన ఆందోళకారులు గెట్లను నెట్టివేసి గ్రీవెన్స్ సెల్ లోపలికి ప్రవేశించే ప్రయత్నం చేశారు.ఐటిడిఎ కార్యాలయం లోపలి గేట్లు మూసివేన పోలీసులు ఆందోళకారులను నిలువరించారు.విషయం జిల్లా కలెక్టర్ దృష్టికి వెళ్ళటంతో బయటకు వచ్చిన ఆయన ఆందోళకారులతో మాట్లాడి వారి సమస్యలు విన్నారు.బాధితులు తమకు పోలవరం పరిహారం త్వరగా ఇచ్చి గ్రామాలను ఖాళీ చేయించి తమకు పునరావాసం కల్పించాలని,ఈ ఏడాది వేసిన పంటలు వరదలు, బ్యాక్ వాటర్ కారణంగా కుళ్ళిపోయాయని,తమకు పంట నష్ట పరిహారం ఇప్పించాలని డిమాండ్ చేశారు.ఇంకా లోతట్టు ప్రాంతాల్లో వరద నీరు ఉందని ,వాణిజ్య పంటలు వేసుకునే కాలం కూడా వెళ్ళిపోయిందని,ఈ ఏడాది తమకు పంటలు పండే అవకాశం లేదని,తమ భాధను అర్థం చేసుకోని తమకు న్యాయం చేయాలని కలెక్టర్‌కు వివరించారు.దాంతో స్పందించిన కలెక్టర్ పోలవరం ప్రాజెక్టు ఉన్నతాధికారు లతో మాట్లాడి మొదటి దశగా 41.15కాంటూరు ఉన్నవాటిని పర్వేలు పూర్తి చేసి న్యాయం చేయటానికి ప్రయత్నం చేస్తామని హామి ఇచ్చారు.

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

రాజమహేంద్రవరం : fb.com/vaartha Digital

Published from Rajahmundry, Vijayawada, Hyderabad, Visakhapatnam, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

16-10-2025 గురువారం సంపుటి: 31 సంచిక: 255 పేజీలు: 8 వెల: 6.50


గోవా మాజీ సింఎం రవినాయక్ కన్నుమూత 2లో

పోర్టులు, రైల్వే ద్వారా సంపద సృష్టి: సిఎం చంద్రబాబు 6లో

# ఇక క్షేత్రస్థాయి తనిఖీలు



గురువారం జరిగిన ఆర్టిజిఎస్, గవర్నెన్స్‌పై సమీక్షలో సిఎం చంద్రబాబు

## ప్రభుత్వ పథకాల అమలుతీరును స్వయంగా పరిశీలిస్తా

## ప్రజలు మెచ్చేలా సుపరిపాలన అందిస్తున్నాం

## వన్ గవర్నమెంట్-వన్ సిటిజన్ విధానం అమలు

## ఆర్టీజిఎస్, గవర్నెన్స్‌పై సమీక్షలో సిఎం చంద్రబాబు

**విజయవాడ ,అక్టోబరు15, ప్రభాతవార్తప్రతినిధి:** ప్రభుత్వం అమలు చేస్తోన్న పథకాలు, కార్యక్రమాల అమలు తీరు తెలుసుకునేందుకు నవంబరు నెల నుంచి క్షేత్రస్థాయిలో పర్యటిస్తానని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ప్రతీ పౌరుడికీ సంక్షేమ ఫలాలు ఎలా అందుతున్నాయో అనే అంశాన్ని తనిఖీ చేస్తానని సిఎం అన్నారు. బుధవారం సచివాలయంలోని ఆర్టిజిఎస్ కేంద్రంలో ప్రభుత్వ సేవల్లో సంతృప్త స్థాయి సహా రియల్ టైమ్ గవర్నెన్స్ పనితీరుపై ముఖ్యమంత్రి అధికారులతో సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో ప్రజలు మెచ్చేలా సుపరిపాలన అందిస్తున్నామని.. పాలనలో సుస్థిర విధానాలను అమలు చేస్తామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. గతనెల 22వ తేదీ నుంచి నిర్వహిస్తున్న సూపర్ జిఎస్టీ సూపర్ సేవింగ్స్ కార్యక్రమంలో భాగంగా జిఎస్టీ 2.0 సంస్కరణలతో ప్రజలకు కలిగిన ప్రయోజనాలు, లబ్ధి తదితర అంశాలపై ప్రజల నుంచి సేకరించిన ఫీడ్ బ్యాక్ వివరాలను సిఎం పరిశీలించారు. నిత్యావసరాలు, ఇతర ఉత్పత్తులపై పన్నులు తగ్గిన అంశంపై గిరిజన ప్రాంతాల్లో మరింత అవగాహన కల్పించాలని సిఎం సూచించారు. దీపావళి పండుగ తర్వాత కూడా సూపర్ జిఎస్టీ ద్వారా పన్నుల తగ్గింపు, తద్వారా ధరలు తగ్గిన అంశాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని పేర్కొన్నారు. జిఎస్టీ 2.0 సంస్కరణల వల్ల కలిగే లబ్ధిని స్లైడ్స్ ద్వారా సినిమా థియేటర్లలో ప్రదర్శించాలని సిఎం సూచించారు. వివిధ శాఖలు అందించే ప్రభుత్వ సేవలపై టెక్నాలజీ డేటా ఆడిటింగ్ ద్వారా సంతృప్త స్థాయిని అంచనా వేస్తామని సిఎం స్పష్టం చేశారు. క్షేత్రస్థాయిలో వాస్తవాలకు అధికారులు ఇచ్చే సమాచారానికి పొంతన ఉండాలని సిఎం అన్నారు. సామాన్యుడికి మెరుగైన సేవలు అందించటమే లక్ష్యంగా పనిచేస్తున్నట్టు ముఖ్యమంత్రి వెల్లడించారు. వన్ గవర్నమెంట్ వన్ సిటిజన్ అన్న విధానంతో సమర్ధవంతంగా ప్రజలకు సేవలందిస్తామని అన్నారు.

దీనిపై నవంబరు మొదటి వారంలో మంత్రులు, కార్యదర్శులు, కలెక్టర్ల పనితీరును మదింపు చేస్తామని సిఎం అన్నారు. ఇన్సిడెంట్ మేనేజ్మెంట్ సిస్టం ద్వారా వేర్వేరు ఘటనల్ని సమన్వయంతో పర్యవేక్షించటంతో పాటు త్వరితగతిన బాధితులకు స్వాంతన కలిగించేలా చర్యలుతీసుకోవాలని సూచించారు. సంపద సృష్టి జరగాలంటే ఆర్థిక వృద్ధి అవసరం. గత 10 యేళ్లలో 11వ ఆర్థిక వ్యవస్థ నుంచి నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించాం. త్వరలో మూడో అతిపెద్ద ఆర్థికవ్యవస్థగా అవతరించ బోతున్నాం. అప్పుడు సంపద >>2


బుధవారం శ్రీశైలం ప్రాంతంలో భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న పోలీసు ఉన్నతాధికారులు

# ప్రధాని మోడీ రాక నేడే

- కర్నూలు, నంద్యాల జిల్లాల్లో పర్యటన
- మల్లన దర్శనం, ప్రత్యేక పూజలు
- పిఎం టూర్ ప్రాంతాల్లో భారీ భద్రత
- ఏర్పాట్లు పర్యవేక్షించిన మంత్రులు, డిజిపి
- పలు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు



**విజయవాడ, కర్నూలు, శ్రీశైలం, అక్టోబరు 15 ప్రభాతవార్త ప్రతినిధి:** జిఎస్‌టి సంస్కరణలతో ప్రజలకు ధరల భారాన్ని తగ్గిస్తూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున ప్రచారం చేపడు తోంది. జిఎస్‌టి సంస్కరణల నిర్ణయాన్ని స్వాగతిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ప్రచార కార్యక్రమాన్ని పండుగలా జరుపుతోంది. దసరా నుంచి దీపావళివరకు సూపర్ జిఎస్‌టి సూపర్ సేవింగ్స్ పేరుతో ఈ ప్రచారాన్ని రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తోంది. ఈవేడుకల్లో పాల్గొనేం దుకు గురువారం ప్రధాని నరేంద్ర మోడీ రాష్ట్రానికి రానున్నారు. కర్నూలు జిల్లా ఓర్వకల్లు మండలం నన్నూరు చెక్ పోస్టు సమీపంలో జరిగే బహిరంగ సభలో ప్రధాని పాల్గొననున్నారు. అలాగే సభకు వచ్చే ముందు శ్రీశైలం దివ్యక్షేత్రానికి వెళ్లి జ్యోతిర్లింగ మూర్తి శివుణ్ణి, శక్తి >>2



# 2030 కామన్వెల్త్ క్రీడలు అహ్మదాబాద్‌లో..

## నవంబరు 26న అధికారిక ప్రకటన

గ్లాస్గో,(యుకె), అక్టోబరు 15: కామన్వెల్త్‌క్రీడలు 2030లో భారత్‌లోని అహ్మదాబాద్‌లో నిర్వహించాలని క్రీడల ఎగ్జిక్యూటివ్ బోర్డు నిర్ణయించింది. అయితే ఇదే క్రీడలు 2030లో నిర్వహించేందుకు నైజీరియాలోని అబూజాలో నిర్వహిస్తామని పోటీపడుతున్న సంగతి తెలిసిందే. అయితే అహ్మదాబాద్‌లో అయితే అన్నివిధాలా సౌకర్యవంతంగా ఉంటుందని కామన్వెల్త్ ఎగ్జిక్యూటివ్ బోర్డు నిర్ణయించింది. గ్లాస్గోలో జరగనున్న వచ్చేనెల 26వ తేదీ సర్వసభ్యసమావేశంలో అధికారికంగా ప్రకటన వెలువడుతుంది. మొట్టమొదటిసారిగా ఈక్రీడలు 1930లో కెనడాలోని హ్యామిల్టన్‌లో జరిగాయి. 2010లో న్యూఢిల్లీలో ఈక్రీడల నిర్వహణ తర్వాత తాజాగా 20 ఏళ్లతర్వాత మళ్లీ భారత్‌లో జరుగుతున్నాయి. అలాగే 2036 ఒలింపిక్స్ నుకూడా అహ్మదాబాద్‌లోనే నిర్వహించాలని భారత్ భావిస్తోంది. భారత్,నైజీరియాలు రెండూ కూడా కామన్వెల్త్ 2030 క్రీడలు నిర్వహించేందుకు సంసిద్ధత వ్యక్తంచేయడంపట్ల ఎగ్జిక్యూటివ్‌బోర్డు హర్షం ప్రకటించింది.

# భారత్‌లో వెండికి తీవ్ర కొరత

## పారిశ్రామిక వినియోగం పెరగడమే కారణం!

**న్యూఢిల్లీ, అక్టోబరు 15:** భారత్ మార్కెట్‌లో వెండికి తీవ్ర కొరత ఏర్పడింది.పారిశ్రామిక యూనిట్లలో వినియోగం పెరగడం, పండుగల సీజన్ కావడంతో ఆర్డర్లు భారీగా రావడం వంటివాటికితోడు అంతర్జాతీయంగా కూడా సరఫరా కొరతవల్ల వెండికి ఏర్పడిన భారీ గిరాకీ అనుకోకుండాధరలను అమాంతం పెంచేసింది. ఇన్వెస్టర్ల డిమాండ్ భారీగా పరగడంతో కిలో వెండి బుధవారం ఎంసిఎక్స్‌స్పాట్ మార్కెట్‌లో కిలో ఒక్కంటికి రూ.1,75,364గా ట్రేడ్ అయింది. అలాగే డిసెంబరునాటికి ఎంసిఎక్స్ వెండి ఫ్యూచర్స్ కూడా 1,62,150గా ఉన్నాయి మార్కెట్‌దరకంటే 13,214 తక్కువగానే నమోదుకావడం గమనార్హం. భారత్‌లోని అనేక నగరాల్లో ముఖ్యంగా పారిశ్రామిక యూనిట్లు అత్యధికంగా ఉన్న నగరాల్లో వెండి గిరాకీ భారీగా ఉంటుంది. స్పాట్, ఫ్యూచర్ మార్కెట్‌దరలమధ్య 8శాతం తేడా కనిపిస్తోంది.



## నాటి మేటి గాయని రావు బాలసరస్వతీ దేవి

# ఇక లేరు

### తెలుగు, తమిళం, కన్నడం, హిందీ సహా పలు భాషల్లో నేపథ్యగాయనిగా ప్రసిద్ధి

**హైదరాబాద్, అక్టోబరు 15,ప్రభాతవార్త:** తెలుగు సినీ సంగీతప్రపంచంలో తీవ్ర విషాదం చోటు చేసుకుంది.తెలుగు చిత్రసీమ తొలి తరం నేపథ్య గాయనిగా ప్రసిద్ధి చెందిన రావు బాలసరస్వతిదేవి (97) బుధవారం ఉదయం హైదరా బాద్‌లో కన్నుమూశారు. హైదరాబాద్ మణి కొండలోని స్వగృహంలో బుధవారం ఉదయం 8 గంటలకు తుదిశ్వాస విడినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. 1928 ఆగస్ట్ 29నజన్మించినబాలసరస్వతి గొంతు ఆకాశవాణి సంగీత కార్యక్రమాలతో >>2

# సోంపేట చిత్తడి నేలల్లో టూరిజం కారిడార్



## ఒకేసారి 16 చిత్తడి నేలల గుర్తింపు గర్వకారణం

## వీరాపురం పుణ్యక్షేత్రంలో ప్రత్యేక పక్షి సంరక్షణ కేంద్రాలు

### కొల్లేరు లేక్ మేనేజ్‌మెంట్ అథారిటీకి ప్రతిపాదనలు: డి.సిఎం పవన్

**విజయవాడ,అక్టోబరు 15,ప్రభాతవార్తప్రతినిధి:** చిత్తడి నేలల సంరక్షణ భావితరాల భవిష్యత్తుకు అవసరమని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, అటవీ పర్యావరణ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. పర్యావరణ పరిరక్షణ, భూగర్భ జలాల పెరుగుదల, పర్యాటక అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున చిత్తడి నేలల గుర్తింపు ప్రక్రియకు శ్రీకారం చుట్టామన్నారు., ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా 16 చిత్తడి నేలలను గుర్తించి, వాటి పరిరక్షణకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. దక్షిణ భారతదేశ చరిత్రలో ఒకేసారి ఇంత పెద్ద ఎత్తున చిత్తడి నేలలకు గుర్తించిన రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ చరిత్ర సృష్టించబోతోందని తెలిపారు. అందులో సోంపేట, తవిటి మండలాల పరిధిలో వేలాది ఎకరాల్లో విస్తరించి వున్న మూడు చిత్తడి నేలలను అనుసంధానిస్తూ భారీ పర్యాటక ప్రాజెక్టుకు రూపకల్పన చేయనున్నట్టు తెలిపారు. కొల్లేరు మాదిరిగా మరిన్ని చిత్తడి నేలలకు రాంసర్ గుర్తింపు దక్కేలా అటవీ శాఖ వన్యప్రాణి విభాగం ఆధ్వర్యంలో చర్యలు చేపడతామని చెప్పారు.మంగళగిరిలోని క్యాంపు కార్యాలయంలో పవన్ కళ్యాణ్ అధ్యక్షతన స్టేట్ వెట్ ల్యాండ్ అథారిటీ సమావేశం జరిగింది. సుప్రీంకోర్టు ఆదేశాలకు అనుగుణంగా చిత్తడి నేలల భౌగోళిక సరిహద్దుల గుర్తింపు, అభివృద్ధి తదితర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ "సుప్రీం కోర్టు ఆదేశాలకు లోబడి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న చిత్తడినేలల భౌగోళిక గుర్తింపు ప్రక్రియను వేగవంతం చేయాలి. రాష్ట్రవ్యాప్తంగా 23,450 చిత్తడి నేలలు ఉన్నాయి. అందులో 99.3 శాతం నేలలకు డిజిటల్ సరిహద్దుల గుర్తింపు ప్రక్రియ పూర్తయ్యింది. వీటికి ఈ నెల 28 లోపు భౌతిక సరిహద్దుల గుర్తింపు ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉంది. అందుకోసం అటవీ శాఖ, రెవెన్యూ, సర్వే విభాగాల అధికారులు సమన్వయంతో పని చేసి ఆ ప్రక్రియను నిర్ణీత గడువులోపు పూర్తి చేయాలన్నారు. పోరాటయాత్రలో సోంపేట చిత్తడి నేలలను పరిశీలించానన్నారు. చిత్తడినేలల గుర్తింపు, అభివృద్ధి ప్రక్రియలో అన్ని >>2

# మన్యంలో మళ్లీ రగులుతున్న పోలవరం 2లో

## పరకామణి చోరీ కేసు

# రికార్డులు హైకోర్టుకు

### రేపు సమర్పించనున్న సిఐడి అధికారులు, ఇక సూత్రధారులు బట్టబయలు!

**తిరుమల,అక్టోబరు 15ప్రభాతవార్తప్రతినిధి:** శ్రీవారి భక్తులు ఎంతో భక్తివిశ్వాసాలతో శ్రీవేంకటేశ్వరస్వామికి సమర్పించే కానుకల లెక్కింపు పరకామణి నుండి విదేశీ కరెన్సీని చోరీచేసినఘటనలో సిఐడిఅధికారులు హైకోర్టుకు సమర్పించనున్న రికార్డులు కీలకంకానున్నాయి. ఈ కేసుకు సంబంధించిన రికార్డులను సిఐడి డిజి రవిశంకర్ అయ్యన్నార్ తిరుమల వన్‌టౌన్ పోలీసుస్టేషన్ నుండి స్వాధీనం చేసుకున్న విషయంతెలిసిందే. హైకోర్టు ధర్మాసనం ఆదేశాలతో స్వయంగా సిఐడి డిజి రవిశంకర్ అయ్యన్నార్ తిరుమలకు చేరుకుని మంగళవారం టిటిడి పరకామణి భవనం,లోపల కరెన్సీనోట్లు, నాణేల లెక్కింపు ప్రక్రియ,భద్రత అంశాలపై గమనించారు. ఈ కేసుపై తిరుమల పోలీసు,విజిలెన్స్ అధికారులతో చర్చించారు. విచారణ చేపట్టారు. అయితే స్వాధీనం చేసుకున్న రికార్డులను రెండురోజుల్లో హైకోర్టుకు అప్పగిస్తామని డిజి అయ్యన్నార్ తెలిపారు. 2023 మార్చినెలలోని పరకామణిలో చోరీ కేసు వివరాలను తిరుమల పోలీసుల నుండి స్వాధీనం చేసుకున్న అయ్యన్నార్ తదుపరి కోర్టుకు సమర్పిస్తే సూత్రధారులెవరనేది తేల్చేయనుంది. ఇప్పుడు ఆ రికార్డుల్లోని కీలక ఆధారాలపై తదుపరి ఏం జరగనుందనే ఉత్కంఠ టిటిడిలో నెలకొంది.2023 మార్చిలో జరిగిన ఈ చోరీ కేసు విచారణ, పూర్తిస్థాయి దర్యాప్తు చట్టపరంగానే సాగించారా!లేక ఏదేని అక్రమాలు చోటుచేసుకున్నాయా అనేది ఇప్పుడు హైకోర్టు ధర్మాసనం వెలువడించే నిర్ణయంపై ఆధారపడనుంది. సిఐడి డిజి ప్రత్యేక బృందం రికార్డులు హైకోర్టుకు సమర్పించిన తరువాత ఏం జరగనుందినేది టిటిడిలో,పోలీసుశాఖలో ఉత్కంఠనెలకొంది.

# మావోయిస్టులకు మరో ఎదురు దెబ్బ

## 70 మంది అనుచరులతో లొంగుబాటలో ఆశన్న

### జగ్దేవ్‌పూర్‌కు రెండు బస్సుల్లో చేరుకున్న బృందం

**హైదరాబాద్, అక్టోబరు 15, ప్రభాతవార్త:** ఆపరేషన్ కగార్‌తో కకావికలం అవుతున్న మావోయిస్టు పార్టీకి మరో ఎదురు దెబ్బ తగిలింది. పార్టీ కేంద్రకమిటీ సభ్యుడు, మహారాష్ట్ర అధిపతి మల్లోజుల వేణుగోపాల్ రావు అలియాస్ భూపతి 62 మంది అనుచరులతో మహారాష్ట్ర సిఎం దేవేంద్ర పడ్న వీస్ సమక్షంలో ఆయుధాలతో బుధవారం నాడు లొంగిపోగా ఆయన బాటలోనే మరో సీనియర్ నేత కేంద్ర కమిటీ సభ్యుడు తక్కళ్లపల్లి వాసుదేవ రావు అలియాస్ ఆశన్న 70 మంది అనుచరులతో ఆయుధాలతో గురువారం నాడు చత్తీస్‌ఘడ్ సిఎం విష్ణదేవ్ సాయ్ ఎదుట లొంగి పోనున్నారు. ఇం దుకు సంబంధించి ఛత్తీస్‌ఘడ్‌లోని జగ్దల్‌పూర్‌లో ఏర్పాట్లు పూర్తయ్యాయి. కాగా ఆశన్న బృందం రెండు బస్సుల్లో ఆయుధాలతో బుధవారం సాయంత్రం జగ్దల్‌పూర్‌కు చేరుకుంది.

## డబుల్ ఇంజిన్ బుల్లెట్ రైలుతో

# రాష్ట్రంలో అద్భుతాలు


బుధవారం మీడియాతో మాట్లాడుతున్న మంత్రి లోకేష్

- సమష్టి కృషివల్లే రాష్ట్రానికి గూగుల్ రాక
- ఉత్తరాంధ్రకు భారీ పెట్టుబడులు
- పేద విద్యార్థుల మేలుకే పిపిపి విధానం
- మీడియాతో మంత్రి లోకేష్

**విజయవాడ,అక్టోబరు 15, ప్రభాత వార్త ప్రతినిధి:** చరిత్ర సృష్టించాలన్నా, దాన్ని తిరగరాయాలన్నా చంద్రబాబుతోనే సాధ్యమని మంత్రి నారా లోకేశ్ అన్నారు. దేశంలోనే అతిపెద్ద ఎఫ్‌డీఐ సాధించామని తెలిపారు. 15 బిలియన్ డాలర్ల భారీ పెట్టుబడులతో గూగుల్ ఎఐ హబ్ ఏర్పాటు చేయబోతుందని వెల్లడించారు. అమరావతిలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో మైక్రోసాఫ్ట్ హైదరాబాద్ రూపురేఖలు మార్చిందని, ఇప్పుడు గూగుల్ పెట్టుబడులతో విశాఖ రూపురేఖలు మారబోతున్నాయని మంత్రి నారా లోకేష్ అన్నారు. 'కేవలం డేటా సెంటర్ మాత్రమే కాదు. ఎఐకి సంబంధించిన అనేక కంపెనీలు విశాఖకు వస్తున్నాయి. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ కింద రాష్ట్రానికి పరిశ్రమలు తరలివస్తున్నాయి. గూగుల్ పెట్టుబడితో లక్షమందికి పైగా ఉపాధి అవకాశాలు కలగనున్నాయి. సెప్టెంబర్ 2024లోగూగుల్ ప్రతినిథులు విశాఖ వచ్చినప్పుడు వారితో సమావేశమయ్యాను.వారికి డేటా సెంటర్ స్థలాన్ని చూపించాం. ఇది జరిగిన నెల రోజుల్లో యూఎస్ వెళ్లి గూగుల్ క్లౌడ్ నాయకత్వాన్ని కలిశా.నవంబర్‌లో గూగుల్ ప్రతినిథులు సిఎంను కలిశారు. ఇదే అంశంపై ప్రధాని నరేంద్ర మోడీ,కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్‌తో చంద్రబాబు అనేకసార్లు భేటీ అయ్యారు. అనేక చర్చల తర్వాత ఇంత పెద్ద పెట్టుబడి సాధ్యమైంది. భారీ పెట్టుబడులపై అన్ని చోట్లా చర్చలు జరుగుతున్నాయి.విశాఖపట్నంలో ఏర్పాటుకానున్న ఏఐ హబ్ కేవలం భారతదేశానికి, ఆంధ్రప్రదేశ్‌కు సేవలు అందించడం మాత్రమే కాదు... ప్రపంచ వేదికపై భారత్ కీలకపాత్ర పోషించేలా చేస్తుంది, అందుకే యావత్ కేంద్ర, రాష్ట్ర నాయకత్వం ఈ ప్రాజెక్టు కోసం సమష్టిగా కలసి పనిచేసిందని రాష్ట్ర మంత్రి లోకేష్ అన్నారు. అంతర్జాతీయంగా అధునాతన సాంకేతికతలోవస్తున్న మార్పులకు అనుగుణంగా మన యువత నైపుణ్యం పెంచుకోవాలి, >>2

## మద్యం కొనాలంటే..

# క్యుఆర్ కోడ్ తప్పనిసరి!

**విజయవాడ,అక్టోబరు 15,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో నకిలీమద్యం నివారణకు రాష్ట్రప్రభుత్వం మరిన్ని చర్యలు చేపట్టింది. మద్యం దుకాణాలు, బార్లలో నిజమైన, నాణ్యమైన మద్యం అమ్మకాలు జరిగేలా ప్రత్యేక చర్యలు ప్రభుత్వం చేపట్టింది నకిలీ మద్యం నివారణకు పలు నిబంధనలను ఎక్సైజ్ శాఖ అమల్లోకి తీసుకొచ్చింది. ఇకపై ప్రతి మద్యం బాటిల్‌ను క్యూర్ ఆర్ కోడ్ ద్వారా స్కానింగ్ చేశాకే దుకాణం, బార్ యజమానులు అమ్మాలని నిబంధన విధించింది. ఈ మేరకు ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా ఉత్తర్వులు జారీ చేశారు. ఎపి ఎక్సైజ్ సురక్షా యాప్ ద్వారా మద్యం బాటిల్‌పై ఉన్న క్యూఆర్‌కోడ్‌ను తప్పనిసరిగా స్కాన్ చేయాలని నిబంధనల్లో పేర్కొంది. ప్రతి దుకాణం, బార్‌ల వద్ద ప్రత్యేకంగా బోర్డులు ప్రదర్శించాలని ఆదేశాలు జారీ చేసింది. 'ఇక్కడ విక్రయించే మద్యం క్యూఆర్ కోడ్ స్కానింగ్ ద్వారా నిజమైనది, నాణ్యమైనదని ధృవీకరించాం' అని బోర్డులు పెట్టాలని నిబంధనల్లో తెలిపింది.వినియోగదారులకు విక్రయించే ముందు, అమ్ముతున్న ప్రతి మద్యం బాటిల్ ప్రామాణికతను ధృవీకరించాలని నిబంధన విధించింది ప్రభుత్వం. మద్యం బాటిల్‌పై సీల్, క్యాప్, హోలోగ్రామ్ స్థితి, ప్రామాణికతను తనిఖీ చేయాలని నిబంధనల్లో పేర్కొంది. ప్రతిదుకాణం, బార్‌లో 'డైలీ లిక్కర్ జెన్యునైనెస్ వెరిఫికేషన్ రిజిస్టర్' అమలు చేయాలని ఆదేశించింది. క్యుఆర్ కోడ్ తనిఖీ చేసిన సమయం, స్టాంప్, స్టేటస్ ఫలితాలను రిజిస్టర్‌లో నమోదు చేయాలని ఆదేశించింది. ఎక్సైజ్ సిబ్బంది ప్రతి రోజూ మద్యం దుకాణం, బార్లలోర్యాండం విధానంలో తనిఖీలు చేయాలని, తనిఖీల వివరాలను దుకాణంలోని రిజిస్టర్లో నమోదు చేసి ఎక్సైజ్ అధికారి రోజూ సంతకంచేయాలని పేర్కొంది. బ్యాచ్ వెరిఫికేషన్ సర్టిఫికెట్‌పై లైసెన్స్‌దారు సంతకం చేయాలని నిబంధనల్లో పేర్కొంది. సర్టిఫికెట్‌ను డైలీ లిక్కర్ జెన్యూన్‌నెస్ వెరిఫికేషన్ రిజిస్టర్‌లో నమోదు చేయాలని.. నకిలీమద్యం కనుక్కుంటే ఎక్సైజ్ అధికారులకు ఫిర్యాదు చేయాలని ఆదేశాలు జారీ చేసింది.

వార్త

శారీరక సామర్థ్యం ద్వారా మనకు బలం రాదు, అణచిపెట్టలేనంతటి ఆత్మబలం ద్వారానే అది లభిస్తుంది.

-మహాత్మాగాంధీ

# కనకం ఇక గగనమే!

ఒక కిలో బంగారం మనం వద్ద ఉంటే 2030 నాటికి విలువతో రోల్స్ రాయిస్ కారు కొన చ్చు. 2040లో ఒక ప్రైవేట్ విమానమే కొన వచ్చు. ప్రముఖ వ్యాపారవేత్త సియట్, ఆర్పీజీ గ్రూప్ ఛైర్మన్ హర్ష గోయెంకా వివరించిన పసిడి పలుకులు ఇవి. రోజురోజుకీ పెరుగుతున్న బంగారం ధర విషయం లో వస్తున్న అంచనాలివి. ఇంట్లో బోలెడంత డబ్బు మూలుగుతూ, ఎడాపెడా చేతినిండా సంపాదిస్తున్న 'నియో రిచెస్' కయితే ఈ వ్యాఖ్యలు ఎంతో ఆనందంగా చెవిన తాకుతాయి. వారు జాగ్రత్తపరు లు కనుక వారికి అదృష్టం పట్టినట్లే!. తాజా పరిస్థితుల్లో బంగారం మీద పెట్టే పెట్టుబడులకు మంచి భద్రత ఉందన్న మాట ఎవరూ కాదనలేనిది. బంగారం పెరుగుతుందో పెరగదో, ఒక వేళ తగ్గుతుందా,ఎలాంటి పరిస్థితుల్లో తగ్గుతుంది, ఎప్పుడు జాగ్రత్త పడాలి, ఎలా జాగ్రత్త పడాలి? అన్న అంశాలపై పూర్తి అంచనా ,విశ్లేషణలు అవసరం. అప్పుడే బంగారం లాంటి నిర్ణయాలు తీసుకోవచ్చు. వీటిపై ఎవరూ ఏమీ చెప్పలేకపోతున్నారు. మార్కెట్ విశ్లేషకుల సమీక్షల ప్రాతిపదికగా బంగారం పెరుగుతుం దనో, తగ్గుతుందనో ఊహించడ మంటే అదొక లాటరీ భావనే. కొందరైతే సోషల్ మీడియాలో వస్తున్న కొన్ని విశ్లేషణలు గమనిస్తే కిలో బంగారం ఖరీదు బాగా తగ్గుతుంది. కనుక అంతవరకు ఆగితే ఒళ్లంతా బంగారమేనని విశ్లేషిస్తున్నారు. ఒకవేళ తగ్గితే ఆడవారికి ఊరటే. మరో పక్కన ఆకాశం పైకెగురుతున్న ధర నేలచూపులు చూసే అవకాశమే ఉండదని నిట్టూరుస్తున్నారు. అందుకోలేని ధరల గురించి చెప్పు కుని బాధపడాల్సిందే! ప్రధానంగా దుబాయ్ వంటి అరబ్ దేశాలలో, భారతదేశంలో మహిళలు బంగారాన్ని ఆభ రణాలుగా చేయించుకుని ధరించేందుకు మోజు పడ తారు. అలా బంగారాన్ని దాచుకున్న వాళ్ళకి ఇప్పుడు ఇంటి నిండా సంపదే! ఎందుకంటే కాస్త బంగారం ఉన్నా ప్రత్యామ్నాయ పెట్టుబడులకు ఉపయోగపడుతు న్నాయి. వాటిపై బ్యాంకు రుణాలిస్తున్నాయి. మానవారి అవసరాలు తీరుతున్నాయి. ఏదైనా వ్యాపారాల్లో పెట్టుబడి పెట్టాలన్నా వారిని బంగారమే నిలబడుతోంది. బంగారం మీదవచ్చే రుణ పరపతి కూడా ముఖ్యమే! సామాన్యులకు దూరమవుతున్న బంగారం సంపన్నులకు చేరువవుతోందని చెప్పలేం. ఇప్పుడు కనీవినీ ఎరుగని రీతిలో పసిడి ధరలు రికార్డుల్ని తిరగ రాస్తోంది. దేశీయ మార్కెట్లో బంగారం ధర చుక్కలు తాకుతోంది. అంతర్జాతీయ పరిణామాలు, పండగ, పెళ్లిళ్ల సీజన్ కలిసొచ్చి పసిడి దూసుకెళ్తోంది. బుధవారం నాడు హైదరాబాద్లో రూ.1.30 లక్షలు దాటింది. మంగళవారం ఒక్కరోజే తులం రేటు దాదాపు రూ.3వేలు ఎగబాకింది. ఫలితంగా తులం బంగారం రూ.1.30 లక్షలు దాటి సరికొత్త రికార్డు సృష్టించింది. ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ ప్రకారం 99.3 శాతం స్వచ్ఛత కల 30 వేల ఎనిమిది వందల చేరింది మరోవైపు వెండి ధర కూడా 1లక్షా 55వేలు తగ్గింది పండుగ సీజన్ సందర్భంగా జువెలరీలు రిటైలర్ నుంచి డిమాండ్ పెరగడంతో ఈ పెరుగుదలకు కారణం అని చెప్తున్నారు. మార్కెట్ వర్గాల అంచనా ప్రకారం హైదరాబాద్ బులియన్ మార్కెట్లో తులం బంగారం ధర రూ. 2,720 పెరిగి మునుపెన్నడూ లేనివిధంగా 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,30,830కి ఎగబాకింది. 22 క్యారెట్ల 10గ్రాముల బంగారం ధర రూ.1,21,150 గా ఉంది. ఇక హైదరాబాద్లో కిలో వెండి ఒక్కరోజులోనే రూ.3వేలు పెరిగి రూ.1,86,200కి చేరింది. ఏడాది క్రితం ఇదే రోజున 78వేలు ఉన్న 10 గ్రాముల బంగారం రేటు తాజాగా రూ.1.3 లక్షలకు చేరింది.2022లో పోలిస్తే మొత్తం పెరుగుదల 140 శాతానికి చేరుకుంది. ధనత్రయోదశి రోజున బంగారం, వెండి కొనుగోళ్లు శుభప్రద మని దేశ ప్రజల విశ్వాసం. అయితే మార్కెట్లో ఇప్పుడున్న పరిస్థితుల దృష్ట్యా ఆనాటికి రేట్లు ఇంకా పెరిగిపోవచ్చన్న అంచనాలున్నాయి. ఇదే జరిగితే 24 క్యారెట్ గోల్డ్ 10గ్రాములు రూ.1లక్షా 50వేలు దాటిపోవచ్చునన్నది బులియన్ వర్గాల అంచనా. అటు వెడి ధర కూడా భారీగా పెరుగుతోంది. హైదరాబాద్ మార్కెట్లో కిలో వెండి ధర రూ.1,85,763గా ఉంది. అంతర్జా తీయ విపణిలోనూ పసిడి ధర విపరీతంగా పెరుగుతోంది. ఔన్సు ధర 4.115 డాలర్లుగా ఉంది. ఔన్సు వెండి ధర 51డాలర్లు దాటింది. అమెరికా షట్డౌన్ ఎత్తివేతపై అని శ్చితి, యూఎస్ చైనా వాణిజ్య ఉద్రిక్తతలు వంటి పరిణా మాలతో బంగారంలో పెట్టుబడులకు మదుపర్లు మొగ్గు చూపుతున్నారు. ఈ క్రమంలోనే గోల్డ్ వెండికి గిరాకీ విపరీతంగా ఉంటోంది. సెప్టెంబరులో గోల్డ్ ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్ల (గోల్డ్ ఈటీఎఫ్)లో నిధుల ప్రవాహం పెరిగింది. ఆగస్టులో వీటిలోకి రూ. 2,190 కోట్ల పెట్టుబడులు రాగా, సెప్టెంబరులో ఈ మొత్తం నాలుగింతలై రూ. 8.363 కోట్లకు చేరింది. మరోవైపు, ధనత్రయోదశితో పాటు రాబోయే పెళ్లిళ్ల సీజన్ నేపథ్యంలో దేశీయ మార్కెట్లో పసిడికి మరింత డిమాండ్ ఉంటుందని మార్కెట్ సిద్ధమవుతోంది. భౌతిక రాజకీయ ఆర్థిక అనిశ్చిత పరిస్థితుల కారణంతో ఈ ఏడాది ఇంతవరకు బంగారం ధర 67 శాతం పెరిగింది. మార్కెట్ అనిశ్చితులు ఇలాగే ఉంటే బంగారం మోజు తగ్గించుకోవడమే శ్రేయస్కరం. ఒకప్పుడు షేర్మార్కెట్ మీద ఇలాంటి అంచనాలతో జనం పెట్టుబడిపెట్టేవారు. బంగారాన్ని ఆ ఇంటి ఇల్లాలు ఆభరణంగా దాచుకుంటే సరే.ఎప్పటికీ దాని మన్నిక మారాదు. కాని పెట్టుబడుల కని బంగారం కొంటే ఒకవేళ కొన్ని విశ్లేషణలకు లోబడి ఏమాత్రం ధర తగ్గినా మనిషి దిగాలుపడతాడు.

విజయం వల్ల లాభాలు ఆశించేవారు ఆ విజయాన్ని పొందేందుకు తిప్పలు పడక తప్పదు.



డబ్ల్యు ఎమర్సన్

నౌకకు అండగా నిల్చే నీళ్లే ఒక్కోసారి నౌకను తలకిందులు కూడా చేయగలవు.



తిరుక్కురళ్

# ఆహార భద్రతతోనే దేశ సంక్షేమం

**కేవలం కడుపు నింపే ఆహారంపై కాకుండా, సమతుల్యమైన, విభిన్నమైన ఆహార ప్రాధాన్యతకు దృష్టి సారించాలి. ఇందులో పండ్లు, కూరగాయలు, చిక్కుళ్ళు,పాలఉత్పత్తులు చేర్చబడాలి. ముఖ్య మైన విటమిన్లు, మినరల్స్‌తో ఆహార పదార్థాలను సుసంపన్నం చేయడం ద్వారా లోపాలను నిర్మూలించవచ్చు. పోషకమైన ఆహారం అందరికీ అందుబాటులోకి రావాలంటే వ్యవసాయ ఉత్పాదకతను పెంచాలి, పేదరికం, అసమానతలను లక్షిత జోక్యాలతో తగ్గించాలి. పోషకాహారానికి సంబంధించిన అవగాహన, విద్యను విస్తరించడం చాలాకీలకం. అలాగే సరైన ఆహార నాణ్య తను నిర్ధారించడం, ఆహార వ్యర్థాలను తగ్గించడం, వివిధ ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయాన్ని మెరుగుపరచడం వంటివి ఈ సంక్లిష్ట సమస్యను పరిష్క రించడానికి అత్యవ సరం. ప్రొటీన్లు అధికంగా ఉండే సోయాబీన్స్, కాయధాన్యాలు, మాంసం, గుడ్లు, పాల ఉత్పత్తులు మొదలైన ఆహార ఉత్పత్తులను అందరికీ అందుబాటులోకి తీసుకు రావడం ద్వారా పోషకాహార లోపాన్ని సమర్థవంతంగా నియంత్రించవచ్చు.**

డి.మోహన్‌రావు

గాలి, నీరు తర్వాత మానవ మనుగడకు అత్యంత ఆవశ్యకమైన మూడవ వనరు ఆహారం. ప్రతి పౌరుడికి వైవిధ్యమైన పోషకారం అందుబాటులో ఉంచడం, సరైన పోషణ, ఆర్థిక స్థోమత, ఆహార భద్రత కల్పించవలసిన బాధ్యత ప్రతి దేశంపై ఉంది. ప్రపంచవ్యాప్తంగా జనాభాకు సరిపడా ఆహారం ఉత్పత్తి అవుతున్నప్పటికీ, ఆకలి కేకలు మాత్రం ఆగడం లేదు. ప్రజలు ఆరోగ్యకరమైన ఆహారాన్ని కొనుగోలు చేయలేక, తక్కువ ఖరీదైన, అనారోగ్యకరమైన ఆహారాలపై ఆధారపడుతున్నారు. ఈ పరిస్థితికి అనేక అంశాలు దోహదపడుతున్నప్పటికీ, వాతావరణ అననుకూలత, సంఘర్షణలు, ఆర్థిక మాంద్యం, అసమానతలు, ఆహార వ్యర్థం వంటివి ప్రధానంగా పరిగణించవచ్చు ఐక్యరాజ్యసమితి విడుదల చేసిన 'ప్రపంచ ఆహార పోషకాహార స్థితి సోఫీ 2025' నివేదిక ప్రకారం, 2024లో ప్రపంచ జనాభాలో 8.2 శాతం అంటే దాదాపు 67.3 కోట్ల మంది దీర్ఘకాలిక ఆకలితో సతమతమవుతున్నారు. 2030 నాటికి ఈ సంఖ్య 51.2 కోట్లకు తగ్గవచ్చని అంచనా. ఇందులో 60 శాతం మంది ఆఫ్రికాలో కేంద్రీకృతం కావచ్చు అని నివేదిక పేర్కొంది. ప్రపంచవ్యాప్తంగా 280 కోట్లకు పైగా ప్రజలు ఆరోగ్యకరమైన ఆహారాన్ని పొందలేని స్థితిలో ఉన్నారు. ఈ పరిస్థితి పోషకాహార లోపానికి ప్రధాన కారణంగా పరిణమించింది. ప్రతీ ఒక్కరూ సరిపడా ఆహారం తీసుకునే హక్కును మానవ హక్కుగా గుర్తించారు. ఈ సందర్భంగా, వ్యవసాయ ఆహార ఉత్పత్తిని వృద్ధి చేయడం, అందరికీ ఆహార భద్రత కల్పించడం, పోషకాహార లోపాన్ని తగ్గించడం, దానివల్ల సంభవించే మరణాలను నివారించడం, ఆహార వ్యర్థాన్ని కనిష్ఠం చేయడం వంటి లక్ష్యాలను చేరుకోవడానికి ప్రతి దేశం కృషి చేయాలి. ఈ దిశగా ప్రభుత్వేతర ప్రయత్నాలకు కూడా ప్రోత్సాహం అందించాలి. సోఫీ నివేదిక తెలిపిన దాని ప్రకారం మన దేశంలో 17.20 కోట్ల మంది పోషకాహార లోపంతో బాధపడుతున్నారు. 2006లో 24.3 కోట్ల మందితో పోలిస్తే ఇది మెరుగుదల అయినప్పటికీ,మనదేశం ఇప్పటికీ ప్రపంచ వ్యాప్తంగా 48వ స్థానంలో, ఆసియాలో 7వ స్థానంలో ఉంది. సుమారు 42.9మంది ప్రజలు ఆరోగ్యకరమైన ఆహారాన్ని పొందలేకపోతున్నారు. ఆహార ధరలు, కొనుగోలు శక్తి మధ్య ఉండే అంతరం పెరగడమే దీనికి కారణం, ఇది దీర్ఘకాలిక ఆహార అభద్రతను సూచిస్తోంది. పోషకాహార లోపం ఇతర లక్షణాలను పరిశీలిస్తే, 18.7 శాతం మంది అంటే సుమారు 2.1 కోట్ల మంది పిల్లలు తక్కువ బరువుతో ఉన్నారు. అలాగే సుమారు 3.74 కోట్ల మంది పిల్లలు వయస్సుకు తగ్గ ఎత్తు లేకపోవడం దీర్ఘకాలిక పోషకాహార లోపానికి నిదర్శనం. 15-49 ఏళ్ల మహిళల్లో 53.7శాతం అంటే సుమారు 20.3కోట్ల మందికి రక్తహీనత పీడిస్తోంది. ఈ విషయంలో మనదేశం ప్రపంచంలోనే నాల్గవ స్థానంలో ఉంది.ఒకవైపు పోషకాహార లోపం తీవ్రంగా ఉండగా, మరో వైపు అధిక పోషకాహారం సమస్య కూడా పెరుగుతోంది. అధిక బరువు ఉన్న పిల్లలు 42 లక్షల మంది ఉన్నారు. గత దశాబ్దంలో స్థూలకాయం ఉన్న పెద్దల సంఖ్య రెట్టింపు అయి, ఇప్పుడు 7.14 కోట్లకు చేరుకుంది. వయస్సుకు తగ్గ ఎత్తు లేకపోవడం వలన మానసిక అభివృద్ధి కుంటుపడి, విద్యా విషయక పనితీరు తగ్గుతుంది. మరోవైపు, ఎత్తుకు



తగ్గ బరువు లేకపోవడం రోగనిరోధక శక్తిని బలహీనపరిచి, వ్యాధుల తీవ్రతను పెంచుతుంది. ఇక అధిక బరువు వలన హృదయ సంబంధ వ్యాధులు, మధుమేహం, క్యాన్సర్లు వచ్చే ప్రమాదం ఎక్కువవుతుంది. సరసమైన, ఆరోగ్యకరమైన ఆహారాల అందుబాటు లోపం దేశం అంతటా విస్తరించి ఉంది. దేశజనాభాలో 60శాతం పైగా వ్యవసాయం పై ఆధారపడి జీవిస్తున్నారు. వ్యవసాయ ఉత్పాదకత తగ్గడం, జనాభా పెరుగుదల వలన వ్యవసాయ భూములు తగ్గిపోవడం వంటి సవాళ్లను ఈ రంగం ఎదుర్కొంటోంది. అభివృద్ధి చెందుతున్న దేశాలలో 70 శాతం కంటే ఎక్కువ మంది పల్లెల్లో నివసిస్తున్నారు. అయినా అనేక కారణాల వల్ల వ్యవసాయం కుంటుపడింది. ఆఫ్రికాలోని కొన్ని దేశాలలో కరవు నిత్యం తాండవిస్తూనే ఉంది. ఆసియాలో దాదాపు 60 శాతం జనాభా పోషకాహార లోపంతో బాధపడుతున్నారు.అదే ఆఫ్రికాలో ఆ శాతం 75 దాటింది. ఆర్థిక సమస్యల కారణంగా దేశంలోని అనేక కుటుంబాలలో, ముఖ్యంగా పిల్లలకు, పోషకాహారం అందుబాటులో ఉండటం లేదు. పోషకాహార లోపం, ఆహార అభద్రత ముఖ్యంగా గ్రామీణ, గిరిజన ప్రాంతాలలో కేంద్రీకృతమై ఉన్నాయి. పోషకాహార వైరుధ్యానికి మూల కారణాలను పరిశీలిస్తే దేశం ఆహార ఉత్పత్తిలో ముందంజలో ఉన్నప్పటికీ, మెజారిటీ ప్రజలు పోషక విలువలున్న పండ్లు, కూరగాయలు, పప్పులు, పాల ఉత్పత్తులు వంటి ఆరోగ్యకరమైన ఆహారాన్ని కొనుగోలు చేయలేకపోవడమే మనదేశంలో పోషకాహార వైరుధ్యాన్ని సూచిస్తోంది. పేదరికం కారణంగా కోట్ల మంది ప్రజలు కేవలం అధిక క్యాలరీలున్న బియ్యం, గోధుమల వంటి ప్రధాన ఆహారధాన్యాలపై మాత్రమే ఆధారపడక తప్పడం లేదు. దీనివల్ల వారికి తగినన్ని విట మిన్లు, ఖనిజాలు అందక 'దాగిఉన్న ఆకలి'అనే సమస్య ప్రబలుతోంది.ముఖ్యంగా లింగ అసమానత వలన,కుటుంబంలో మహిళలు,బాలికలకు ఆహారపంపిణీలో వివక్ష ఏర్పడి వారి ఆరోగ్యం దెబ్బతింటోంది. మరోవైపు, అపరిశుభ్రత, సరియైన పారిశుధ్య లోపంవల్ల ప్రజలు తరచుగా వ్యాధుల బారినపడుతూ, తీసుకునే ఆహారంలోని పోషకా లను శరీరం సరిగా గ్రహించలేకపోతోంది.ఆహారం, పోషక భద్రతకు సంబంధించిన పథకాలు మనదేశంలో అత్యంత కీలకమైనవి. వాటిలో ప్రధానమైనవిపరిశీలిస్తే జాతీయ ఆహార భద్రతాచట్టం ప్రధానమైంది. దీనికింద పేదవారికి చౌకదుకాణాల ద్వారా చాలా తక్కువ ధరకే ఆహార ధాన్యాలను అందిస్తున్నారు. పీఎం పోషణ్ పథకం బడికెళ్ళే పిల్లలందరికీ ఉచితంగా వేడి భోజనం అందిస్తోంది. పోషణ్ అభియాన్ అనేది పిల్లలు, గర్భిణీ స్త్రీలు, పాలిచ్చే తల్లులలో పోషకాహార లోపాన్నితగ్గించడానికి దృష్టి సారించిన జాతీయ మిషన్. మనదేశం ఎదుర్కొంటున్న పోషకాహార వైరుధ్యాన్ని పరిష్కరించడానికి సమగ్రమైన, బహుళ అంచెల వ్యూహాలు తప్పనిసరి. కేవలం కడుపు నింపే ఆహారంపై కాకుండా, సమతుల్యమైన, విభిన్నమైన ఆహార ప్రాధాన్యతకు దృష్టి సారించాలి. ఇందులో పండ్లు, కూరగాయలు,చిక్కుళ్ళు,పాలఉత్పత్తులు చేర్చబడాలి. ముఖ్యమైన విటమిన్లు, మినరల్స్‌తో ఆహార పదార్థాలను సుసంపన్నం చేయడం ద్వారా లోపాలను నిర్మూలించవచ్చు. పోషకమైన ఆహారం అందరికీ అందుబాటులోకి రావాలంటే వ్యవసాయ ఉత్పాదకతను పెంచాలి, పేదరికం, అసమానతలను లక్షిత జోక్యాలతో తగ్గించాలి. పోషకాహారానికి సంబంధించి న అవగాహన, విద్యను విస్తరించడం చాలాకీలకం. అలాగే సరైన ఆహార నాణ్య తను నిర్ధారించడం, ఆహార వ్యర్థాలను తగ్గించడం, వివిధ ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయాన్ని మెరుగుపరచడం వంటివి ఈ సంక్లిష్ట సమస్యను పరిష్కరించడానికి అత్యవ సరం. ప్రొటీన్లు అధికంగా ఉండే సోయాబీన్స్, కాయధా న్యాలు, మాంసం, గుడ్లు, పాల ఉత్పత్తులు మొదలైన ఆహార ఉత్పత్తులను అందరికీ అందుబాటులోకి తీసుకురావడం ద్వారా పోషకాహార లోపాన్ని సమర్థవంతంగా నియంత్రించవచ్చు. •

# నైపుణ్యలేమితో యువత ఇబ్బందులు!

బి.మధుసూదన్ రెడ్డి

పదిహేను నుంచి ఇరవైనాలుగేళ్ల ఏండ్ల వయస్సు కలిగిన ప్రపంచ యువత చదువులు, కొలువులు లేదా నైపుణ్యాభివృద్ధి శిక్షణల్లో తప్పనిసరిగా నిమగ్నం కావాలి. దానికి విరుద్ధంగా చదువులు, కొలువులు లేదా నైపుణ్య శిక్షణలు లేకుండా నేటి యువశక్తి నిర్వీర్యం కావడం ప్రపంచ మానవాళికే శాపంగా మారే ప్రమాదం ఉందని ఐఎల్ఓ అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. గత నాలుగు ఏండ్లుగా ప్రపంచ కార్మిక మార్కెట్లో యువత భాగస్వామ్యం పెరగడంతో పాటు రానున్న రెండేళ్ళలో కూడా మరింత పెరిగే అవకాశాలు ఉన్నాయని అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. గ్లోబల్ ఎంప్లాయిమెంట్ ట్రెండ్స్ నివేదిక ప్రకారం ప్రపంచ వ్యాప్తంగా కోవిడ్ అనంతరం 15 -24 ఏండ్ల యువత చదువు, కొలువు లేదా శిక్షణల్లో ఏదీ చేయకుండా ఖాళీగా ఉంటూ నేడు పెద్ద ప్రపంచ సమస్యగా మారుతున్నదని విశ్లేషిస్తున్నారు.ఎలాంటి ప్రయోజనకరమైన పనులకు దూరంగా నిష్క్రియాత్మకంగా తిరుగుతున్న యువతను "నాట్ ఇన్ ఎంప్లాయిమెంట్, ఎడ్యుకేషన్ ఆర్ ట్రైనింగ్, ఎన్ఈఈటీ (ఉద్యోగం, చదువు లేదా శిక్షణల్లో లేనివారు)" వర్గంగా భావించి అధ్యయనం చేశారు. 2023లో 13 శాతంగా నమోదైన నిరుద్యోగ రేటుతో 64.9 మిలియన్ల యువత ఉండగా 2019లో 13.8 శాతంగా గమనించబడింది. 2024లో నిరుద్యోగ రేటు 12.8 శాతానికి తగ్గవచ్చని అంచనా వేస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా అరబ్ స్టేట్స్, తూర్పు ఆసియా, ఆగ్నేయ ఆసియా, పసిఫిక్ ప్రాంత దేశాల నిరుద్యోగ రేటు 2019తో పోల్చితే 2023లో అధికంగా కనిపించడం విచారకరం. అభివృద్ధి చెందుతున్న దేశాల్లో గౌరవప్రదమైన ఉద్యోగాల కొరతతో నీట్ విభాగంలో యువత కొట్టుమిట్టాడుతున్నట్లు తెలుస్తున్నది.2023లో ప్రతి ఐదుగురిలో ఒక్కరు, అనగా దాదాపు 20 శాతం వరకు ప్రపంచ యువత నీట్ స్థాయిలో ఉన్నట్లు తెలుతున్నది. మహిళల్లో దాదాపు 33.33 శాతం వరకు, అనగా ప్రతిముగ్గురిలో ఒక్క మహిళ నీట్ దుస్థిలో ఉన్నట్లువిధితం అవుతున్నది. నీట్ కెటగిరీలో జింబాబ్వే యువత 32.2 శాతం, భారత్ 23.5 శాతం, నైజీరియా 13.9 శాతం, యూకే 12.8 శాతం, ఫ్రాన్స్ 11.8 శాతం, యూఎస్ 11.2 శాతం, జర్మనీ 7.5శాతం, చైనా 5.9 శాతం యువత ఉన్నట్లు గణాంకాలు వివరిస్తున్నాయి. గౌరవ ప్రదమైన, అర్హతకు తగిన ఉద్యోగ ఉపాధులు లేక ప్రపంచ యువత అయోమయం, నిరాశానిస్పృహల్లో మగ్గుతున్నారని ఐఎస్ఓ నివేదిక వెల్లడిస్తున్నది. యువకులతో పోల్చితే యువతులు ఉద్యోగ సాధనలో వెనుకబడి ఉండడం (2023లో మాత్రం యువకుల నిరుద్యోగ రేటు 12.9శాతం, యువతులకు 13 శాతం) గమనించారు. ప్రపంచవ్యాప్తంగా నీట్ యువతలో యువతులకు 28.1 శాతం, యువకులకు 13.1శాతం నిరుద్యోగ రేటు నమోదు అయ్యింది.2024లో ప్రపంచ నిరుద్యోగ రేటు కొంతపెరగ వచ్చనే అంచనాలు మన కలవరానికి కారణం అవుతున్నాయి. అధిగమిస్తూ నేటి ప్రపంచ యువత తమ నైపుణ్యాలు పెంచుకుంటూ, ఉన్నత విద్యను అభ్యసిస్తూ ఆకర్షణీయ ఉద్యోగాల్లో స్థిరపడడానికి ప్రణాళికలు అమలు పరుచుకోవాలని, ప్రభుత్వాలు కూడా ఈ దిశగా పటిష్ట అడుగులు వేయాలని సూచిస్తున్నారు. 2023-24 వివరాల ప్రకారం 15 ఏండ్లు దాటిన యువత లేబర్‌ఫోర్స్ పార్టిసిపేషన్ రేటు 60.1 శాతంగా నమోదు కావడం గమనించాల్సిన అంశం. అధిక ఆదాయం కలిగిన అభివృద్ధి చెందిన దేశాల్లో 17 శాతం యువత తాత్కాలిక ఉద్యోగాల్లో ఉండగా, 76 శాతం యువత శాశ్వత ఉద్యోగాల్లో స్థిరపడ్డట్లు తెలుస్తున్నది. మధ్య ఆదాయ దేశాల్లో 17శాతం స్వయం ఉపాధుల్లో, 22 శాతం తాత్కాలిక ఉద్యోగాల్లో, 57శాతం శాశ్వత ఉద్యోగాల్లో పని చేస్తున్నట్లు తేలింది. రానున్న ఈ సంక్షోభాన్ని గుర్తించి నేటి యువతను సన్మార్గంలోకి తీసుకువచ్చి, ప్రపంచ మానవాళి అభివృద్ధికి దోహదపడే విధంగా మలుచుకోవడానికి అన్నివర్గాలు సమిష్టి కృషిచేయాలి.యువతలో నైపుణ్యం పెంపొందించే చదువులు అందుబాటులో ఉండాలి. •

# అమ్మతనానికి అనేక సవాళ్లు!

యేచన్ చంద్ర శేఖర్

సృష్టిలో ప్రతి ప్రాణికీ జన్మప్రదాత అమ్మ. ప్రసవ వేదన పడేది అమ్మ. ప్రాణ ప్రతిష్ఠ పోసేది అమ్మ. ప్రతి స్త్రీ జీవితంలో మాతృత్వం అనేది ఒక దివ్య మధురానుభూతి. పెళ్ళైన ప్రతి జంట కాలానుగుణంగా తల్లిదండ్రులు కావాలని కలలు కనడం సర్వసాధారణం. అయితే, మారిన జీవనశైలి, ఉరుకులు పరుగుల పోటీ జీవితంలో మానసిక ఒత్తిడి, పర్యావరణ కాలుష్యం లాంటి కారణాలతో కొంత మంది జంటల ఈ కల అంత సులభంగా సాకారం కావడం లేదు. ఇటీవలి కాలంలో వంధ్యత్వ శాతంలో పెరుగుదల, గర్భధారణను ఆలస్యం చేస్తున్న జంటల సంఖ్య పెరుగుదల, పెరుగుతున్న అవగాహన కారణంగా ఇన్ విట్రో ఫెర్టిలైజేషన్ (ఐవిఎఫ్) ఇతర సహాయక పునరుత్పత్తి సాంకేతికతలకు (ఏఆర్‌టి) డిమాండ్ పెరుగుతోంది. కాగా, భారతదేశంలో వంధ్యత్వ సమస్యతో బాధపడుతున్న జంటల కోసం ఇన్‌విట్రో ఫెర్టిలైజేషన్ (ఐవిఎఫ్) అత్యంత ప్రజాదరణ పొందిన అధునాతన వంధ్యత్వ చికిత్స. భారతదేశంలో ప్రధానంగా ప్రైవేట్ రంగం ద్వారా వంధ్యత్వ చికిత్సలు అందుబాటులో ఉన్నప్పటికీ సామాన్యులకు వాటి లభ్యత గణనీయంగా తగ్గిపోతోంది. అధిక ఖర్చులు, ప్రభుత్వ రంగ సేవల కొరత, పట్టణ, గ్రామీణ మౌలిక సదుపాయాల మధ్య విస్తృత అంతరం దీనికి ప్రధాన కారణం. ఈ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఇటీవలి కాలంలో ప్రభుత్వ చొరవతో మారుతున్న నిబంధనలు, ప్రజలలో పెరుగుతున్న అవగాహనతో పరిస్థితిలో కొంత ఆశావహ మార్పు గోచరిస్తున్నప్పటికీ ముఖ్యమైన అడ్డంకులు అలాగే అపరిష్కృతంగా కొనసాగుతున్నాయి. ఇటీవలి గణాంకాల ప్రకారం, భారతదేశంలోని దదాపు 27.5 మిలియన్ల వంధ్య జంటలలో ఒక శాతం ఐవిఎఫ్ సహా సహాయక పునరుత్పత్తి సాంకేతికతను (అసిస్టెడ్ రిప్రొడక్టివ్ టెక్నాలజీ) ఆశ్రయిస్తారు. 2025లో భారతీయ ఐవిఎఫ్ మార్కెట్ వేగంగా వృద్ధి చెందుతుండగా, దేశవ్యాప్తంగా 2,500 కంటే ఎక్కువ సంతానోత్పత్తి కేంద్రాలు మెట్రో నగరాలలో (ఢిల్లీఎన్‌సిఆర్, ముంబై, అహ్మదాబాద్, చెన్నై, కోల్‌కతా, హైదరాబాద్, బెంగళూరు పూణే) కేంద్రీకృతమై ఉన్నాయి. ఇన్‌విట్రో ఫెర్టిలైజేషన్ (ఐవిఎఫ్) అనుసరించే చాలా మంది మహిళలలో గర్భధారణ విజయవంతం అయ్యేందుకు సాధారణంగా రెండు నుండి మూడు చక్రాలు (సైకిల్స్) అవసరం అవుతుంది. అయితే స్త్రీ వయస్సు, రోగ నిర్ధారణ, ఆరోగ్యపరిస్థితి వంటి అంశాలు చక్రాల సంఖ్యను గణనీయంగా ప్రభావితం చేస్తాయి. సగటున, ప్రతి ఐవిఎఫ్ చక్రం చికిత్సకు దాదాపు రూ.70,000 నుండి రూ.1,25,000 వరకు ఖర్చవుతుంది. కాగా ఈ మొత్తం ఆసుపత్రి నుండి ఆసుపత్రికి మారుతూ ఉంటుంది. భారతదేశంలో ప్రపంచస్థాయి సంరక్షణ,అధిక విజయ రేటును అందించే అనేక అగ్రశ్రేణి ఐవిఎఫ్ కేంద్రాలు గల ఉత్తమ



నగరాల్లో ఢిల్లీ ఒకటిగా నిలుస్తుంది. భారతదేశంలోని2022 సరోగసీ (నియంత్రణ)చట్టం దోపిడీని నిరోధించడమే లక్ష్యంగా పెట్టుకున్నప్పటికీ, సంతానోత్పత్తి లేక నిరాశానిస్పృహలకు గురైన జంటలు,దుర్బల మహిళలను దోపిడీ చేసే అక్రమ శిశువుల అక్రమ రవాణా పథకాలు దేశంలో అప్పుడప్పుడూ బయటపడుతూనే ఉన్నాయి. ఐవిఎఫ్,సరోగసీ (అద్దె గర్భం) ముసుగులో పనిచేసే నేరపూరిత నెట్‌వర్క్‌లు తప్పుడు పత్రాలను సృష్టించి పెద్దమొత్తంలో డబ్బుకు అక్రమ రవాణా చేయబడిన శిశువులను విక్రయిస్తాయి. భారతదేశంలో పుట్టబోయే బిడ్డకు సరోగెట్ తల్లితో జన్యుపరమైన సంబంధం లేకుండా తల్లిదండ్రుల గుడ్డు, వీర్య కణాలను ఉపయోగించి ప్రయోగశాలలో పిండాన్ని తయారు చేసి తర్వాత ఆ పిండాన్ని సరోగెట్ తల్లి గర్భంలో ప్రవేశ పెట్టే గెస్టేషనల్ సరోగసీ", సరోగెట్ తల్లి గుడ్డును తండ్రి వీర్యకణంతో ఫలదీకరణం చేసే ట్రెడిషనల్ సరోగసీ" పద్ధతుల ద్వారా తల్లిదండ్రులయ్యే అవకాశం ఉంది. అయితే, ట్రెడిషనల్ సరోగసీ పద్ధతిలో సరోగెట్ తల్లికి పుట్టే బిడ్డతో జన్యుపరమైన సంబంధం ఉండడంతో న్యాయపరమైన చిక్కులు ఉండే అవకాశం ఉంది. కాబట్టి ఈ విషయంలో ముందుగానే న్యాయపరమైన జాగ్రత్తలు తీసుకోవడం తప్పనిసరి. సరోగసీ (నియంత్రణ) చట్టం, 2021 వాణిజ్య సరోగసీని నిషేధించేందుకు, నైతిక ప్రమాణాలను స్థాపించడానికి మహిళలను ఆర్థిక దోపిడీ నుండి రక్షించడానికి రూపొందించబడింది. భారతదేశంలో వాణిజ్య సరోగసీ ప్రక్రియను నిషేధించినందున, ఇప్పుడు అది అక్రమ మార్గంలో దుర్వినియోగం అవుతోంది. సంతానం లేని భారతీయ జంటలకు పరోపకార ఏర్పాట్లకు పరిమితం చేయాల్సిన ఈ చట్టం, దోపిడీని తొలగించడానికి బదులుగా దుర్బల మహిళలకు మరింత ప్రమాదకరంగా పరిణమించింది.పారదర్శక నియంత్రణ లేకపోవడం వలన ప్రధానంగా స్వల్పాదాయ నేపథ్యం నమోదుకాని దాతల ద్వారా మహిళలు ఐవిఎఫ్ దుర్వినియోగానికి గురవుతుంటారు. తమ ఆర్థిక అవసరాలను తీర్చుకునేందుకు మహిళలు తమ అండాలను అమ్ముకునేలా మధ్యవర్తులు వారిని ప్రలోభపెట్టి బలవంతం చేస్తారు. పని పూర్తయినతరువాత కొందరు మధ్యవర్తులు క్లినిక్‌లుసదరు మహిళలకు ఎంతో కొంత ముట్టచెప్పి ఒప్పందం కుదుర్చుకున్న మొత్తాన్ని చెల్లించకుండా దాట వేస్తారు. గర్భధారణ విజయావకాశాలను పెంచడానికి, కొన్ని క్లినిక్‌లు బహుళ పిండ బదలీలను నిర్వహించడం,హార్మోన్ చికిత్సల దుష్ప్రభావాలను పూర్తిగా వివరించకపోవడం వలన పిండదాతలు అనారోగ్యానికి గురయ్యే ప్రమాదం ఉంటుంది. సరైన పరిహారం లభించని పిండదాతలు తరచుగా ఐవిఎఫ్ ప్రక్రియానంతరం ఉత్పన్నమయ్యే సమస్యలకు అవసరమైన తదుపరి సంరక్షణను భరించలేరు. సికింద్రాబాద్‌లోని యూనివర్సల్ సృష్టి ఫెర్టిలిటీ సెంటర్ ద్వారా సరోగసీ ప్రక్రియ ద్వారా బిడ్డను పొందిన జంట అనుమానం వచ్చి డిఎన్‌ఏ పరీక్ష నిర్వహించగా, వారికి అందించబడిన బిడ్డతో వారికి జీవసంబంధమైన సంబంధం లేదని తేలింది. విషయాన్ని వారు జూలై 2025లో పోలీసులకు ఫిర్యాదు చేయగా, పోలీసుల విస్తృత దర్యాప్తులో అది బహుళ సంవత్సరాల రాకెట్టును బహిర్గతం చేసింది. పోలీసుల ప్రకారం, క్లినిక్ యజమాని ఐవిఎఫ్ బదులు సరోగసీకి జంటను ఒప్పించి, సరోగసీ నిర్వహించకుండానే రూ.35 లక్షలు వసూలు చేశారు.వాస్తవానికి, సరోగసీ ప్రక్రియలను నిర్వహించకుండానే తరచుగా పేదకుటుంబాల నుండి ఏజెంట్లద్వారా నవజాత శిశువులను కొనుగోలు చేసి సంతానం లేని జంటలకు లక్షాల్లో విక్రయించింది. •

# ప్రజావాక్కు



### సమాజం ఆలోచించాల్సిన సమయం

హర్యానాలో ఐపీఎస్ అధికారి ఆత్మహత్య ఘటన మనసును కలిచివేసింది. ఒక ఉన్నతాధికారి ఇంతటి పరిస్థితుల్లో జీవితం ముగించుకోవడం మన సమాజం, ప్రభుత్వ వ్యవస్థల పనిచేసే స్థితిపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. ఇది పరిపాలనా వ్యవస్థలో ఉన్నఒత్తిళ్లు,రాజకీయ జోక్యాలు, అన్యాయాల వల్ల ఏర్పడిన దుస్థితిని ప్రతిబింబిస్తుంది. ఈ ఘటనపై తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పందన సమయోచితంగా అనిపించింది. ఆయన హర్యానా ప్రభుత్వ వైఖరిని విమర్శిస్తూ, బాధిత కుటుంబానికి తెలంగాణ ప్రభుత్వం మద్దతుగా నిలవడం మానవతాదృక్పథాన్ని సూచిస్తోంది.ఇలాంటి సందర్భాల్లో ప్రభుత్వాలు కేవలం పరామర్శలు కాకుండా,వ్యవస్థలో మార్పు తీసుకురావడానికి కృషి చేయాలి. ఇది సమాజం మొత్తం ఆత్మ పరిశీలన చేయాల్సిన సమయం.

- తిప్పర్తి శ్రీనివాస్, చొప్పదండి

### గురుకుల విద్యార్థులకు సౌకర్యాలు కల్పించాలి

రాష్ట్ర గిరిజన శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న గురుకుల డిగ్రీ కళాశాలలో డిగ్రీ మేను, మెస్ హాల్ చిన్న తరగతి విద్యార్థులతో కాకుండా వేర్వేరుగా ఉండాలి. హైస్కూల్, ఇంటర్ మీడియట్, డిగ్రీ వేరు వేరుగా ఉండాలి. ఈ డీగ్రీ కళాశాలలుసాంక్షన్ ఒక చోట తరగతులు మరో చోట జరగడం వలన సాంకేతిక సమస్యలు వస్తున్నాయి. సిబ్బంది విభజనచేసి డిగ్రీమేను,మెస్ తరగతులుసాంక్షన్ అయినా సొంత స్థలంలో ఉండేవిధంగా ప్రభుత్వం కృషి చేయాలి. రాష్ట్ర గిరిజన గురుకుల డిగ్రీసెక్రటరీ తగిన చొరవ తీసుకొని పేదగిరిజన విద్యార్థులకు న్యాయం చేయాలి.

- రాపాక రవీందర్, జనగాం

### మూగ జీవులపై ప్రేమ చూపండి

మూగ జీవులను రక్షించండి అంటూ గోలపెడుతున్న ఈ మానవతావాదులు, ఈ జంతు ప్రేమికులకు ఆ వీధి కుక్కల విహారం వల్ల ఎంత మంది పసిపిల్లల ప్రణాలకు హానికరం వస్తోందో, ఎంతమంది రేబిస్ వాత పడి బాధ పడుతున్నారో కనబడుట లేదా. ఇటువంటి సమయంలో సుప్రీం కోర్ట్ వారి వాత కొంతవరకూ ఎంతో సమంజసం. జంతు జాలంపై మక్కువ చూపేవారిని ఒక డాగ్స్ క్లబ్‌గా ఏర్పడి చక్కగా చూసుకోమంటే ఒక్కడు మళ్ళీ కనపడడు.

- జి. సీతారామయ్య, హైదరాబాద్

### ఇవేస్ట్ సంక్షోభం

ప్రస్తుతం మన దేశం ఎదుర్కొంటున్న అత్యంత ఘోరమైన ప్రమాదం ఇవేస్ట్‌సంక్షోభం. సాంకేతిక విప్లవం మన జీవితాన్ని సులభతరం చేసినా, అదే విప్లవం ఇప్పుడు మన ఆరోగ్యాన్ని, పర్యావరణాన్ని ముప్పు పొంచే స్థితికి తెచ్చింది. స్మార్ట్‌ఫోన్‌లు, టీవీలు, ల్యాప్‌టాప్‌లు వంటి పరికరాల తక్కువ జీవితకాలం, నిరంతర సాంకేతిక నవీకరణలతో వీటన్నీ వేగంగా ఎలక్ట్రానిక్ వ్యర్థాలుగా మారుతున్నాయి.తాజా గణాంకాల ప్రకారం, చైనా, అమెరికా తరువాత భారతదేశం ప్రపంచంలో మూడవ స్థానంలో ఉంది. సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అంచనా ప్రకారం 2024-25 నాటికి ఇవేస్ట్ ఉత్పత్తి దాదాపు 14 లక్షలమెట్రిక్ టన్నులకు చేరింది. వీటిలో సుమారు 70 మాత్రమే అధికారికంగా రీసైకిల్ అవుతుండగా, మిగతా వ్యర్థాలు అసంఘటిత రంగంలోప్రమాదకరంగా కాల్చబడుతున్నాయి.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### ప్రజల కోసం పోరాటం

వెనిజులా సామాజిక కార్యకర్త మారియాకు నోబెల్ శాంతి బహుమతి లభించడం ప్రజాస్వామిక వాదులందరి విజయం అయితే తన చారిత్రక ఆనవాళ్లను తన వారసత్వపు విలువల నుండి పాఠాలునేర్చిన మారియా వెనిజులాలో ప్రభుత్వం అనుసరిస్తున్న నియంతృత్వ వైఖరికి వ్యతిరేకంగా పోరాటం చేస్తూ ప్రజాస్వామిక పవనాలు స్వేచ్ఛగా వీచే విధంగా పోరాటం చేస్తున్నారు.ఆమెఒక్కరి ఆధిపత్యంమాత్రమే చెల్లుబాటు కావాలె అని కోరుకోలేదు. ఆమె సమూహ అధికారాన్ని కోరుకున్నారు. వెనిజులాలో ఆమె వాళ్ళ ప్రజల మధ్యనే ఉండి ప్రజాస్వామిక సామ్యవాదం సాధించే దిశగా పోరాటం చేస్తున్నారు.

-భారత అవినాష్, జనగామ

### అన్నిటికి అమెరికానే ఆధారమా?

మన దేశంలో విద్య నుండి ఉద్యోగం వ్యాపారం అన్నీ రంగాలు అమెరికా పై ఆధారపడుతున్నాయి. మన దేశంలో చదివి విదేశంలోఉద్యోగం.మన దేశంలో గ్రాడ్యుయేట్ అమెరికాలో ఉన్నత విద్య.అమెరికాలో వరుడితోనే వివాహం.ఇలాప్రతిదీ అమెరికాపై ఆధార పడుతున్నాం. వ్యాపార ఎగుమతులు దిగుమతులకు కూడా ఆ దేశంపైనే విపరీతంగా ఆధార పడిన మనం ఇప్పుడు తగిన మూల్యం చెల్లించుకోకతప్పదు అనే పరిస్థితిలోఉన్నాం. కావునా ఇకనైనా అమెరికా పై అతిగా ఆధార పడవద్దు. ప్రపంచంలో అనేక దేశాలున్నాయి అని గ్రహించాలి.

- పి.సాయినాథ్, కర్నూలు

మన వి ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)



# 48 గంటల కాల్పుల విరమణకు పాక్ తాలిబన్ల అంగీకారం

## అఫ్ఘాన్ బోర్డర్‌లో తెగబడిన పాకిస్థాన్ దళాలు

### తెల్లవారుజామున భీకరదాడులు

**పెషావర్, అక్టోబరు 15:** ఆఫ్ఘన్‌పాక్ సరిహద్దుల్లో జరుగుతున్న దాడులకు తాత్కాలిక విరామం లభించింది. రెండు వైపులా అటు పాక్ దళాలు ఇటు ఆఫ్ఘన్ తాలిబన్ పాలకులు కూడా 48 గంటలపాటు కాల్పుల విరమణకు అంగీకరించారు. బుధవారంసాయంత్రం 5.30 గంటలనుంచి ఈ ఒప్పందం అమలులోకి వస్తుందని పాక్ సర్కార్‌ప్రకటించింది. తాజాగా జరిగిన దాడుల్లో ఒకరిపైకి ఒకరు తీవ్రస్థాయిలో కాల్పులుజరపడంతో డజనుకుపైగా పౌరులు,అదే సంఖ్యలో ఆర్మీ దళాల సభ్యులు చనిపోయారు. మొత్తం ఈ వారాంతంలోనే 50 మందివరకూ చనిపోయినట్లు తేలింది. దీనితో అటు పాక్ సైన్యం, ఇటు తాలిబన్లు ఇరువురు కూడా చర్చలపరంగా స్వల్ప విరామానికి అంగీకరించారు. రెండువైపులా కూడా చర్చల ద్వారానే సానుకూల పరిష్కారానికి మొగు చూపించడంవల్లనే ఈ అవగాహనకు రావడం జరిగిందని పాక్ విదేశాంగశాఖ ప్రక టించింది. 2600 కిలోమీటర్ల సరిహద్దు పొడవునా ఇక రానున్న రోజుల్లో కాల్పులు హింసను నివారించేందుకే ఈ విరమణ అవగాహనకు రావడంజరిగిందని, వెంటనే చర్చలు ప్రారంభించి సానుకూల పరిష్కారం కనుగొనాలన్నదే పాక్ అభిమతమని వెల్లడిం చింది. కాబూల్‌లో 2021లో తాలిబన్ల పాలన చేపట్టినప్పటినుంచి పాక్ సరిహద్దుల్లో ఎడతెగని కాల్పులు జరుగుతూనే ఉన్న సంగతి తెలిసిందే. ఇదిలా ఉంటే ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రావిన్స్‌లోని కుర్రం సెక్టార్‌లో ఈ తెల్లవారుజామున ఇరు దేశాల సైనికుల మధ్య తీవ్రస్థాయిలో కాల్పులు చోటు చేసుకున్నాయి. ఈ దాడుల్లో ఆఫ్ఘన్ సైన్యానికి చెందిన పలు ట్యాంకులు, సైనిక పోస్టులు ధ్వంసమైనట్లు పాకిస్థాన్ వెల్లడించింది. పాక్ భద్రతా వర్గాల సమాచారం ప్రకారం ఆఫ్ఘన్ తాలిబన్ దళాలు, తెహ్రీక్‌ఇతాలిబన్ పాకిస్థాన్ (టీటీపీ) ఉగ్రవాదులు కలిసి తమ సైనిక పోస్టులపై ఎలాంటి రెచ్చగొట్టే చర్యలు లేకుండా కాల్పులకు తెగబడ్డారని పాకిస్థాన్ ఆరోపించింది. దీంతో పాక్ జరిపిన ఎదురుదాడుల్లో ఆఫ్ఘన్ సైనిక పోస్టులు తీవ్రంగా దెబ్బ తిన్నాయని, ఒక ట్యాంకు మంటల్లో కాలిపోయిందని, దీంతో తాలిబన్ సైనికులు తమ స్థావరాల నుంచి పారిపోయారని పాక్ మీడియా పేర్కొంది. మరో ఆఫ్ఘన్ పోస్టును, ట్యాంకును కూడా నాశనం చేసినట్లు తరువాత వెల్లడించింది. ఆఫ్ఘనిస్థాన్‌లోని ఖోస్త్ ప్రావిన్స్ డిప్యూటీ పోలీస్ ప్రతినిధి తాహిర్ అహ్రార్ ఈ ఘర్షణలను ధ్రువీకరించినప్పటికీ, పూర్తి వివరాలు వెల్లడించలేదు. ఈ వారంలో ఇరు దేశాల మధ్య కాల్పులు జరగడం ఇది రెండోసారి. గత శనివారం నుంచి ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు తీవ్రస్థాయికి చేరాయి. ఆ ఘర్షణల్లో తమ సైనికులు 23 మంది మరణించారని, ప్రతిగా 200 మందికి పైగా తాలిబన్, అనుబంధ ఉగ్రవాదులను హతమార్చామని పాకిస్థాన్ ప్రకటించింది. అయితే, తమ భూభాగంపై పాక్ దాడులకు ప్రతీకారంగా 58 మంది పాక్ సైనికులను చంపినట్లు కాబూల్ తెలిపింది. సౌదీ అరేబియా, ఖతార్ దేశాలు జోక్యం చేసుకున్నప్పటికీ ఉద్రిక్తతలు చల్లారలేదు. దీంతో ఇరు దేశాల మధ్య అన్ని సరిహద్దు క్రాసింగ్‌లను ఇప్పటికే మూసివేశారు. తమ దేశంలో దాడులకు పాల్పడుతున్న టీటీపీకి ఆఫ్ఘనిస్థాన్ ఆశ్రయం కల్పిస్తోందని పాకిస్థాన్ ఆరోపణలను కాబూల్ ఖండిస్తూ వస్తోంది.

# బీహార్‌లో పార్టీల సిగపట్లు

- మహాకూటమిలో కొలిక్కిరాని సీట్ల సర్దుబాటు - 57మందితో జెడియు తొలి జాబితా విడుదల - బిజెపి రెండో జాబితాలో సింగర్ మైథిలికి చోటు
- ఎల్‌జెపి నాలుగు స్థానాలకు అభ్యర్థుల ప్రకటన - రాఘోపూర్‌లో తేజస్వి యాదవ్ నామినేషన్, పోటీ చేయట్లేదు: ప్రశాంత్ కిశోర్ స్పష్టీకరణ
- నేటి నుంచి నితీశ్ కుమార్ ప్రచారం షురూ - నమో యాప్ ద్వారా పార్టీ శ్రేణులతో మోడీ భేటీ

**పాట్నా, అక్టోబరు 15:** బీహార్ అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి పార్టీల మధ్య సీట్ల సర్దుబాబు ఇంకా కొలిక్కిరాలేదు. ఎన్‌డిఎలో సర్దుబాటు కుదిరినా, కేటాయించిన సీట్లపై ఇటు చిరాగ్ పాశ్వాన్, అటు జితిన్ మాంఝీ అసంతృప్తితో ఉన్నారు. తాజాగా తాము కోరుతున్న స్థానాలలో జెడియు అభ్యర్థుల పేర్లు ప్రకటనపై చిరాగ్ పాశ్వాన్ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నితీశ్ తీరును తూర్పారపడుతున్నారు. ఈ విషయమై అమిత్ షాతోనే తేల్చుకుంటానని చిరాగా పాశ్వాన్ ప్రకటించారు. సీట్ల సర్దుబాటుపై రాష్ట్రీయ లోక్ మోర్చా(ఆర్‌ఎల్‌పి) చీఫ్, రాజ్యసభ సభ్యుడు ఉపేంద్ర కుశ్వాహా తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. మరోవైపు మహాఘట్ బంధన్‌లో సీట్ల సర్దుబాబు కుదరలేదు. కాంగ్రెస్ అగ్రనేతలతో జరిపిన చర్చలు ఫలప్రదం కాలేదు. దీంతో ఢిల్లీ నుంచి హుటాహుటిన పాట్నాకు చేరుకుని రాఘోపూర్‌లో ఆర్‌జెడి తరఫున తేజస్వి యాదవ్ నామినేషన్ దాఖలు చేశారు. ఆర్‌జెడి అధ్యక్షుడు లాలూప్రసాద్ యాదవ్, మాజీ ముఖ్యమంత్రి రబ్రీదేవి తదితరులు తేజస్వి వెంట ఉన్నారు. మహాకూటమి సీట్ల సర్దుబాటుపై నేడు మరోమారు సమాలోచనలు జరుపనున్నారు. టికెట్లపై నేతల మధ్య వాదోపవాదనలు, నిరసనల మధ్య బుధవారంనాడు జెడియు 57 మంది అభ్యర్థులతో తొలి జాబితాను విడుదల చేసింది. మంత్రులు విజయ్‌కుమార్ చౌదరి, శర్వాన్ కుమార్, మదన్ సాహ్ని తదితరుల పేర్లు జాబితాలో ఉన్నాయి. నలుగురికి తప్ప మిగిలిన సిట్టింగ్‌లందరికీ జెడియు టికెట్లు కేటాయించింది. ఇందులో చిరాగ్ పాశ్వాన్ నేతృత్వంలోని లోక్‌జనశక్తి పార్టీ కోరుతున్న స్థానాలున్నాయి. దీనిపై జెడియు- ఎల్‌జెపి నేతల మధ్య మాటల యుద్ధం చెలరేగింది. ఇక టికెట్ల కేటాయింపులో తనకు ప్రాధాన్యత ఇవ్వడం లేదని ఎంపి అజయ్ మండల్ మంగళవారం పార్టీకి రాజీనామా చేశారు. ఎమ్మెల్యే గోపాల్ మండల్ సిఎం నితీశ్ నివాసం ఎదుట నిరసన దీక్ష చేపట్టారు. ఇదిలా ఉండగా, బిజెపి 12 మంది సభ్యులతో రెండో విడత జాబితా విడుదల చేయగా, ప్రముఖ సింగర్ మైథిలీ ఠాగూర్ పేరుంది. ఆమె అలీనగర్ నుంచి బరిలో దిగనున్నారు. ఐపిఎస్ ఆఫీసర్ ఆనంద్ మిశ్రా బుక్సర్ నుంచి పోటీచేస్తున్నారు. కేంద్ర మంత్రి చిరాగ్ పాశ్వాన్ నేతృత్వంలోని ఎల్‌జెపి (ఆర్‌వి) బుధవారంనాడు 4 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది. ఎన్‌డిఎ భాగస్వామి అయిన ఎల్‌జెపికి 29 స్థానాల్లో పోటీ చేయనుంది. వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ జన్ సురాజ్ పార్టీని నెలకొల్పి, బీహార్‌లోని 243 అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థులను నిలబెడుతున్నారు. ఇప్పటికే రెండు విడతల జాబితా విడుదల చేశారు. అయితే, ఈ ఎన్నికల్లో తాను పోటీ చేయట్లేదని ప్రశాంత్ కిశోర్ స్పష్టం చేశారు. పార్టీ అభ్యర్థుల విజయం కోసం రాష్ట్రమంతా ప్రచారం చేయాల్సి ఉన్నందున తాను ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు. ఆర్‌జెడి అగ్రనేత తేజస్వి యాదవ్ పోటీ చేస్తున్న రాఘోపూర్ నుంచి ప్రశాంత్ కిశోర్ పోటీ చేస్తారని రాజకీయ వర్గాల్లో విస్తృతంగా ప్రచారం సాగింది. పీకే ప్రకటనతో ఆ అంశానికి తెరపడింది. ఇక ఏఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నేతృత్వంలో మంగవారంనాడు జరిగిన కేంద్ర ఎన్నికల కమిటీ (సిఇసి) సమావేశంలో 18 మంది అభ్యర్థులను ఖరారు చేయగా, మిగిలిన స్థానాలకు సంబంధించి అభ్యర్థుల ఎంపికపై సబ్ కమిటీని వేసింది. నామినేషన్లకు ఈనెల 17 ఆఖరి తేదీ కావడంతో అన్ని పార్టీలు అభ్యర్థుల ఎంపికపై కసరత్తు చేస్తున్నాయి. ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ గురువారం నుంచి ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టనున్నారు. అటు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ బుధవారం సాయంత్రం నమో యాప్ ద్వారా పార్టీ శ్రేణులతో సమావేశమయ్యారు.



'ఐక్య ఎన్‌డిఎ, ఐక్య బీహార్, మరోమారు సుస్థిర ప్రభుత్వం' నినాదంతో ప్రజల్లోకి వెళ్లాలని పిలుపునిచ్చారు. బూత్ స్థాయి కార్యకర్తలు తమ ప్రాంతాల్లోని ప్రతి కుటుంబాన్ని కలవాలని, ప్రభుత్వం అందించే వివిధ సంక్షేమ, అభివృద్ధి పథకాలు, కార్యక్రమాలు, ప్రయోజనాల గురించి తెలియజేశాయలని ప్రధాని మోడీ విజ్ఞప్తి చేశారు. ప్రతి బూత్ బలంగా ఉన్నప్పుడే పార్టీ గెలుస్తుందనే అంశాన్ని గుర్తుంచుకోవాలన్నారు.



## కేరళలో కన్నుమూసిన కెన్యా మాజీ ప్రధాని ఒడింగా

**ఎర్నాకుళం, అక్టోబరు 15:** కెన్యా మాజీ ప్రధాని రైలా ఒడింగ కేరళలో కన్నుమూశారు. ఎర్నాకుళం జిల్లాలోని కూత్తకూళంలో ఉన్న ఆయుర్వేదిక కంటి ఆస్పత్రిలో ఆయన చికిత్స పొందుతున్నారు. క్యాంపస్‌లో మార్నింగ్ వాక్ చేస్తున్న సమయంలో ఆయనకు గుండెపోటు వచ్చింది. ఆయన వయసు 80 ఏళ్లు. ఇవాళ ఉదయం 9 గంటలకు ఆయన తుదిశ్వాస విడిచినట్లు శ్రీధరీయం ఆయుర్వేదిక్ ఐ హాస్పిటల్ అండ్ రీసర్చ్ సెంటర్ పేర్కొన్నది. గత అయిదు రోజుల నుంచి ఆయన ఆ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆయనతో పాటు ఆయన కుమార్తె, పర్సనల్ డాక్టర్ ఉన్నారు. కెన్యా రాజకీయాల్లో రైలా ఒడింగాకు ప్రత్యేక గుర్తింపు ఉన్నది. ఆయన 2008 నుంచి 2013 వరకు ప్రధానిగా పనిచేశారు. ఆయుర్వేదిక కంటి ఆస్పత్రిలో గతంలో ఆయన కుమార్తె చికిత్స తీసుకున్నది. ఆమె కంటిచూపు మెరుగైన నేపథ్యంలో అదే ఆస్పత్రిలో మాజీ ప్రధాని ఒడింగా కూడా చికిత్స తీసుకుంటున్నారు. మాజీ ప్రధాని రైలా ఒడింగా మృతి సమాచారాన్ని ఫారినర్స్ రీజినల్ రిజిస్ట్రేషన్(ఎఫ్ఆర్ఆర్ఓ) ఆఫీసుకు తెలియజేశారు. అయిదుసార్లు ఆయన దేశాధ్యక్ష పదవి కోసం పోటీపడ్డారు. కానీ ఒక్కసారి కూడా నెగ్గలేదు. 1945 జనవరి 7వ తేదీన పుట్టిన రైలా ఒడింగా కెన్యా రాజకీయాల్లో ఒక గొప్ప నాయకుడిగా పేరు ప్రఖ్యాతలు సంపాదించారు. కెన్యాలో ప్రజాస్వామ్య అనుకూల ఉద్యమకారుడిగా ఆయన 8 ఏళ్ల పాటు జైలుకు వెళ్లారు. 1992లో కెన్యా పార్లమెంట్‌లోకి అడుగుపెట్టిన రైలా ఒడింగా 2007 అధ్యక్ష ఎన్నికల తర్వాత చెలరేగిన హింసను చల్లార్చడానికి 2008 ఫిబ్రవరిలో కుదిరిన అధికార భాగస్వామ్య ఒప్పందం ద్వారా ఆయన కెన్యా ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. అయితే 2010లో కెన్యా కొత్త రాజ్యాంగం ప్రకారం ఆయన ప్రధానమంత్రి పదవి రద్దు చేశారు. ఆయన 1997, 2007, 2013, 2017, 2022ల్లో ఐదుసార్లు కెన్యా అధ్యక్ష పదవికి పోటీ పడ్డారు. చివరి 4 ఎన్నికల్లోనూ తాను మోసపోయినట్లు ప్రకటించారు. రైలా ఒడింగా మరణవార్త తెలుసుకుని ప్రధాని మోదీ తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. తన ప్రియ మిత్రుడు కెన్యా మాజీ ప్రధాని రైలా ఒడింగా మరణవార్త విని తాను చాలా బాధపడినట్లు ఎక్స్‌లో ఒక పోస్ట్ చేశారు. రైలా ఒడింగా ఒక గొప్ప రాజనీతిజ్ఞుడని మన దేశానికి ప్రియమైన మిత్రుడని కొనియాడారు. తాను గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పటి నుంచి ఆయనతో పరిచయం ఉందని.. భారతదేశం అన్నా.. భారత సంస్కృతి, విలువలు, ప్రాచీన జ్ఞానంపై ఆయనకు ప్రత్యేక అభిమానం ఉందని ప్రధాని మోదీ తెలిపారు. ఆయుర్వేద చికిత్సతో తన కుమార్తె జబ్బు నయం కావడంతో ఆయన ఆయుర్వేదం, సాంప్రదాయ వైద్యంపై ఇష్టం పెంచుకున్నారని తెలిపారు. ఈ విషాద సమయంలో ఆయన కుటుంబ సభ్యులకు, మిత్రులకు, కెన్యా ప్రజలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నానని మోదీ ట్వీట్ చేశారు.

# సమితి మానవ హక్కుల మండలికి ఏడోసారి భారత్ ఎన్నిక

### 2006నుంచి క్రమం తప్పకుండా యుఎన్‌హెచ్‌ఆర్‌సిలో భారత్ ప్రాతినిధ్యం



**న్యూయార్కు, అక్టోబరు 15:** ఐక్యరాజ్యసమితి మానవహక్కుల మండలికి వరుసగా ఏడోసారి కూడా భారత్ ఎన్నికయింది. 2026–28 కాలానికిగాను భారత్ హెచ్‌ఆర్‌సి మండలిలో కొనసాగుతుంది. సమితిలో శాశ్వత రాయబారి పర్వతనేని హరీష్ స్పందిస్తూ భారత్‌కు అనూహ్యంగా మద్దతు పలికినందుకు ధన్యవాదాలు తెలిపారు. మానవ హక్కుల పరిరక్షణకు భారత్ చేస్తున్న కృషి, ప్రాథమిక స్వేచ్ఛకు చూపించే చొరవ ఈ ఎన్నికరుజువుచేసిందని హరీష్ అన్నారు. మా పదవీకాలంలో లక్ష్యాల సాధనకు అవిరళ కృషిచేస్తామన్నరు. ఐక్యరాజ్యసమితి మానవహక్కుల మండలలో 47 మంది సభ్యుల ఉంటారు. ఐక్యరాజ్యసమితి సర్వప్రతినిధుల సభ మూడేళ్ల కాలానికిగాను భౌగోళిక నిబంధనల ఆధారంగా ఎన్నుకుంటుంది. ఐదు ప్రాంతీయ గ్రూపుల ఆధారంగా ఈ ఎన్నిక ఉంటుంది. ఆఫ్రికా దేశాలకు 13, ఆసియా పసిఫిక్ దేశాలకు 13, తూర్పు ఐరోపా దేశాలకు ఆరు, లాటిన్ అమెరికా, కరీబియన్ దేశాలకు ఎనిమిది, పశ్చిమయూరోప్ ఇతర దేశాలకు ఏడు స్థానాలుంటాయి. భారత్ మానవహక్కుల మండలిలో 2024నుంచి కొనసాగుతోంది. అయితే ఒక్కఏడాదిమాత్రమే గ్యాప్ తీసుకుంది. 2011నుంచి 2018వరకూ తిరిగి 2025లో కూడా హక్కుల మండలిలోభారత్ ప్రాతినిధ్యం ఉంది. 2006లో భారత్ 190సభ్యదేశాల్లో 173 ఓట్ల మెజార్టీతో ఎన్నికయింది. 2006నుంచి అప్రతిహతంగా ఎన్నికవుతూ వచ్చిన భారత్‌కు అన్నిదేశాలమద్దతుంది. అంగోలా, చిలీ, ఈక్వెడార్, ఈజిప్టు, ఎస్తోనియా, ఇరాక్, ఇటలీ, మారిషస్; పాకిస్తాన్, సాల్వేనియా, దక్షిణాఫ్రికా, యుకె, వియత్నాం దేశాలు కూడా 2026 జనవరినుంచి ప్రారంభం అయ్యే పదవీకాలానికి సమితి మానవహక్కుల మండలిలో కొనసాగుతాయి.

## మహాభారత్ కర్ణుడు పంకజ్ ధీర్ కన్నుమూత



**న్యూఢిల్లీ, అక్టోబరు 15:** బీఆర్ చోప్రా తీసిన మహాభారత్ సీరియల్‌లో కర్ణుడి పాత్ర పోషించిన ప్రఖ్యాత నటుడు, టీవీ స్టార్ పంకజ్ ధీర్ ఇక లేరు. ఆయన వయసు 68 ఏళ్లు. క్యాన్సర్‌తో పంకజ్ బాధపడుతున్నట్లు తెలిసింది. ఫ్యాంటసీ డ్రామా చంద్రకాంతలో శివదత్తు చక్రవర్తి పాత్రను ఆయన పోషించారు. క్యాన్సర్ వల్ల బుధవారం ఉదయం ఆయన మృతిచెందినట్లు తెలిపారు. గత కొన్ని నెలల నుంచి ఆయన చికిత్స తీసుకుంటున్నట్లు ప్రొడ్యూసర్ అశోక్ పండిట్ తెలిపారు. మధ్యాహ్నం పంకజ్ ధీర్‌కు అంత్యక్రియలు నిర్వహించారు. పంకజ్ ధీర్‌ది పంజాబ్. 1980 దశకంలో ఆయన నటుడిగా కెరీర్ స్టార్ట్ చేశారు. చాలా వరకు సినిమాల్లో చిన్న చిన్న పాత్రలు పోషించేవారు.

అయితే దూరదర్శన్ టీవీలో 1988లో ప్రసారం అయిన మహాభారత్ సీరియల్‌లో కర్ణుడి పాత్రను ఆయన పోషిం చారు. ఆ సీరియల్ తర్వాత ఆయన పాపులార్టీ చాలా పెరిగిపోయింది. ఆ తర్వాత సడక్, సనమ్ బెవఫా, ఆశిక్ అవారా లాంటి చిత్రాల్లో నటించాడు. 1994 నుంచి 1996 వరకు చంద్రకాంత టీవీ సీరియల్‌లో నటించారు.

## సంక్షిప్తంగా..

### కేదార్‌నాథ్ యాత్రికుల కోసం అదాని రోప్‌వే ప్రాజెక్టు

**అహ్మదాబాద్, అక్టోబరు 15:** కేదార్‌నాథ్ ధామ్ దర్శనానికి వెళ్లే భక్తుల సౌలభ్యం కోసం అదానీ గ్రూప్ ఒక భారీ రోప్‌వే నిర్మాణాన్ని చేపడుతోందని ఆ సంస్థ ఛైర్మన్ గౌతమ్ అదానీ బుధవారం ప్రకటించారు. ఈ రోప్‌వే అందుబాటులోకి వస్తే.. కష్టతరమైన పుణ్యక్షేత్ర యాత్ర మరింత సులభంగా, సురక్షితంగా మారుతుందని ఆయన తెలిపారు. సోన్‌ప్రయాగ్ నుంచి కేదార్‌నాథ్‌ను కలుపుతూ నిర్మించనున్న ఈ రోప్‌వే ప్రాజెక్టుకు మొత్తం రూ. 4,081 కోట్ల పెట్టుబడి అవసరమవుతుందని అంచనా వేశారు. ప్రస్తుతం 9 గంటలపాటు కష్టపడి చేయాల్సిన కాలి నడక ప్రయాణ సమయాన్ని ఈ రోప్ వే కేవలం 36 నిమిషాలకు తగ్గిస్తుంది.



మొత్తంగా ఇది 12.9 కిలో మీటర్ల దూరం ఉండగా.. అరగంటలోనే అక్కడకు చేరుకోవచ్చు. కేదార్‌నాథ్ ధామ్‌కు వెళ్లే కఠినమైన అధిరోహణ ఇప్పుడు సులభమవుతుంది. భక్తుల పుణ్యయాత్రను మరింత సరళంగా, సురక్షితంగా మార్చడానికి అదానీ గ్రూప్ ఈ రోప్‌వేను నిర్మిస్తోందని గౌతమ్ అదానీ వెల్లడించారు.

### రహస్య సమాచారం కాజేసిన విదేశాంగ నిపుణుడి అరెస్టు

**వాషింగ్టన్, అక్టోబర్ 15:** అమెరికా ప్రభుత్వానికి సలహాదారుడిగా పనిచేసిన భారత మూలాలున్న విదేశాంగ నిపుణుడు ఆష్లే టెల్లీస్ అరెస్ట్ అయ్యారు. అమెరికాకు చెందిన రహస్య సమాచారాన్ని తన దగ్గరే దాచుకున్నారని, అలాగే చైనా అధికారులతో సీక్రెట్ మీటింగ్‌లు జరిపినట్లు ఆరోపణలతో కేసు నమోదు చేసినట్లు అమెరికా ప్రాసిక్యూటర్లు తెలిపారు. ఈ క్రమంలోనే అమెరికా అధికారులు టెల్లీస్‌ను అరెస్ట్ చేసినట్లు వార్తలొచ్చాయి. యూఎస్ న్యాయవాది లిండ్సే హాలిగన్ ఆష్లేపై ఉన్న ఆరోపణలును గురించి వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాలు ప్రకారం, 64 ఏళ్ల ఆష్లే టెల్లిస్ రెండు దశాబ్దాలుగా అమెరికా ప్రభుత్వంలో సలహాదారుడిగా సేవలదించారు. 2001 నుంచి డిపార్ట్‌మెంట్ ఆఫ్ వార్‌లో కాంట్రాక్టర్‌గా పనిచేశారు.



# చైనాను కట్టడిచేయాలంటే భారత్ సాయపడాల్సిందే

### అమెరికా ఆర్థిక మంత్రి స్కాట్ బెసెంట్

**వాషింగ్టన్, అక్టోబరు 15:** ప్రపంచంలోనే అరుదైన ఖనిజాల విషయంలో చైనా పోకడను అమెరికా తప్పుబట్టింది. చైనాలో దొరికే ఈ అరుదైన ఖనిజాలపై అక్కడి ప్రభుత్వం కట్టడిచేస్తోందని, తద్వారా ప్రపంచ దేశాలపై ఆధిపత్యం చెలాయించేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించింది. ఈ ధోరణిని అమెరికా సహించబోదని ఆ దేశ ఆర్థిక మంత్రి స్కాట్ బెసెంట్ స్పష్టం చేశారు. ఈ విషయంలో చైనాను ఎదుర్కోవాలంటే తమకు భారత్ సాయం కావాల్సిందేనని ఆయన పేర్కొన్నారు. రష్యా నుంచి చమురు దిగుమతుల వ్యవహారంలో భారత్ పై అమెరికా భారీగా పన్నులు విధించిన విషయం తెలిసిందే. అయితే, చైనా విషయంలో మాత్రం భారత్ తమకు సాహాయం చేయాలని అమెరికా కోరడం గమనార్హం. అమెరికా ఆర్థిక మంత్రి స్కాట్ బెసెంట్ ఇటీవల ఫాక్స్ న్యూస్ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ ప్రపంచంలో మరెక్కడా లభించని అరుదైన ఖనిజాల ఎగుమతిపై చైనా ఇటీవల నియంత్రణ విధించిందని చెప్పారు. విదేశీ కంపెనీలు వాటిని దిగుమతి చేసుకోవాలంటే చైనా ప్రభుత్వ అనుమతి తీసుకోవాలనే షరతు విధించిందన్నారు. ఇది ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు ప్రత్యక్ష సవాలేనని బీజింగ్‌పై ఆయన విమర్శలు గుప్పించారు. ఇది చైనాకు, ప్రపంచ దేశాలకు మధ్య నెలకొన్న పోటీ అని ప్రపంచ పంపిణీ వ్యవస్థలపై చైనా గురిపెట్టిందని ఆయన మండిపడ్డారు. బీజింగ్ దూకుడును అమెరికా అడ్డుకుంటుందన్నారు. ఇందుకోసం భారత్, ఐరోపా దేశాల మద్దతు కావాలని వెల్లడించారు. అమెరికా ప్రపంచ శాంతిని కోరుకుంటుంటే.. చైనా ఆర్థిక యుద్ధం చేస్తోందని స్కాట్ బెసెంట్ దుయ్యబట్టారు.

### త్వరలో వందేభారత్ 4.0: రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్

న్యూఢిల్లీ, అక్టోబర్ 15: భారతదేశపు సెమీ హై స్పీడ్ రైళ్ల జాబితాలో తర్వాత వర్షన్ రానుంది. వందేభారత్ 4.0ను అభివృద్ధి చేయనున్నట్లు రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ ప్రకటించారు. ఎగుమతి గిరాకీలకు అనుగుణంగా దాని రూపకల్పన ఉంటుందని వెల్లడించారు. రైళ్ల ఆధునిక సాంకేతికత విషయంలో దేశాన్ని గ్లోబల్ సప్లయిర్‌గా మార్చే దిశగా ఇది కీలక అడుగు కానుందని వెల్లడించారు. సిఐఐ ఇంటర్నేషనల్ రైల్ కాన్ఫరెన్స్‌లో కేంద్ర మంత్రి మాట్లాడారు. మోడీ ప్రభుత్వం రైల్వేల అభివృద్ధిపై బలంగా దృష్టి సారించిందని వెల్లడించారు. 11 ఏళ్లలో 35,000 కిలోమీటర్ల మేర రైల్వే ట్రాక్‌ల నిర్మాణం జరిగిందని చెప్పారు. జపాన్ బుల్లెట్ రైల్ నెట్‌వర్క్ మాదిరిగానే హైస్పీడ్ ప్యాసింజర్ రైల్ కారిడార్‌ను అభివృద్ధి చేయాలని ప్రభుత్వం యోచిస్తున్నట్లు చెప్పారు. గరిష్టంగా గంటకు 350 కిలోమీటర్ల వేగంతో రైలు ప్రయాణించేలా వాటి డిజైన్ ఉంటుందని తెలిపారు.

## 50 యేళ్లనాటి హత్యాయత్నం కేసు నిందితుడు అరెస్ట్!

**ముంబయి, అక్టోబరు 15:** యాభై ఏళ్లుగా పోలీసుల కళ్లుగప్పి తిరుగుతున్న ఓ నిందితుడిని ముంబై పోలీసులు అరెస్ట్ చేశారు. 48 ఏళ్ల క్రితం నాటి హత్యాయత్నం కేసులో నిందితుడిగా ఉన్న వ్యక్తి, ఇప్పుడు 71 ఏళ్ల వయసులో పోలీసులకు చిక్కడం సంచలనం సృష్టిస్తోంది. ఈ సుదీర్ఘ వేటకు ఒక పాత రోడ్డు ప్రమాదం కేసు కీలకంగా మారింది. 1977లో ముంబైలోని కొలాబా ప్రాంతంలో చంద్రశేఖర్ మధుకర్ కాలేకర్ అనే 23 ఏళ్ల యువకుడు తన ప్రియురాలిపై కత్తితో దాడి చేశాడు. ఆమె మరొకరితో సన్నిహితంగా ఉంటోందనే అనుమానంతో ఈ దారుణానికి పాల్పడ్డాడు. ఆ సమయంలో పోలీసులు అతడిని అరెస్ట్ చేయగా, కొద్దిరోజులకే బెయిల్‌పై బయటకు వచ్చాడు. ఆ తర్వాత కోర్టు విచారణకు హాజరుకాకుండా అదృశ్యమయ్యాడు. అప్పటి నుంచి అతడి కోసం పోలీసులు గాలిస్తూనే ఉన్నారు. ఎన్ని వారెంట్లు జారీ చేసినా ఆచూకీ లభించకపోవడంతో అతడిని పరారీలో ఉన్న నేరస్థుడిగా ప్రకటించారు. దాదాపు 48 ఏళ్లుగా మూలనపడిన ఈ కేసును ఆరు నెలల క్రితం కొలాబా పోలీసులు మళ్లీ తెరిచారు. కాలేకర్ పాత చిరునామా అయిన లాల్‌బాగ్‌లోని హాజీ కాసమ్ చాల్‌కు వెళ్లి చూడగా, ఆ ప్రాంతం పూర్తిగా మారిపోయి కొత్త భవనం వెలసింది. ఓటర్ల జాబితాతో పాటు ఇతర ప్రభుత్వ రికార్డులను జల్లెడ పట్టినా ప్రయోజనం లేకపోయింది. ఈ క్రమంలో రవాణా శాఖ, కోర్టు రికార్డులను పరిశీలిస్తున్న పోలీసులకు ఒక కీలక ఆధారం లభించింది. రత్నగిరి జిల్లాలోని దాపోలి పోలీస్ స్టేషన్‌లో 2015లో కాలేకర్‌పై రోడ్డుపై జరిగిన గొడవకు సంబంధించి ఒక కేసు నమోదైనట్లు గుర్తించారు. ఆ కేసులో ఉన్న చిరునామా ఆధారంగా పోలీసులు సోమవారం రాత్రి దాపోలిలోని అతడి ఇంటికి చేరుకున్నారు. 48 ఏళ్ల తర్వాత తమ ఇంటి తలుపు తట్టిన పోలీసులను చూసి కాలేకర్ నిర్ఘాంతపోయాడు. "అసలు ఆ పాత కేసు గురించే దాదాపు మరిచిపోయానన్నారు.

### ఇళయరాజా స్టూడియో, రాయబార కార్యాలయాలకు బాంబు బెదిరింపులు

**చెన్నై, అక్టోబర్ 15:** తమిళనాడులో మరోసారి బాంబు బెదిరింపులు వస్తున్న సంగతి తెలిసిందే. తాజాగా చెన్నైలోని పలు విదేశీ రాయబార కార్యాలయాలతో పాటు ప్రముఖ మ్యూజిక్ డైరెక్టర్ ఇళయరాజా స్టూడియోకు ఈ తరహా బెదిరింపులు వచ్చాయి. దీంతో అప్రమత్తమైన పోలీసులు దర్యాప్తు చేపట్టి ఆయా ప్రాంతాల్లో తనిఖీలు చేశారు. చెన్నైలోని అమెరికా, రష్యా, ఇంగ్లాడ్, థాయిలాండ్, శ్రీలంక, సింగపూర్ కార్యాలయాలకు గుర్తుతెలియని వ్యక్తుల నుంచి ఈ మెయిల్స్ వచ్చాయి. బాంబు పేలుళ్ల జరగనున్నట్లు ఆ సందేశాల సారాంశం. దీంతో పోలీసులు ఆయా కార్యాలయాల వద్ద ముమ్మరంగా సోదాలు నిర్వహిస్తున్నారు. ఇక,



చెన్నై టి.నగర్‌లోని ఇళయరాజా స్టూడియోకు బాంబు బెదిరింపు వచ్చింది. డిజిపి ఆఫీసుతో పాటు ఇళయరాజాకు మెయిల్ ద్వారా ఈ బెదిరింపులు వచ్చినట్లు తెలుస్తోంది. సమాచారమందుకున్న పోలీసులు వెంటనే బాంబ్ స్క్వాడ్‌తో స్టూడియోకు చేరుకుని తనిఖీలు చేపట్టారు. అయితే అక్కడ ఎలాంటి పేలుడు పదార్థాలు లభించలేదు.

# దీపావళి రోజు ఢిల్లీలో గ్రీన్‌క్రాకర్స్‌కు సుప్రీం అనుమతి

**న్యూఢిల్లీ, అక్టోబరు 15:** దీపావళి పండుగ సమీపిస్తున్న వేళ, దేశ రాజధాని ఢిల్లీలో టపాసుల వినియోగంపై సుప్రీంకోర్టు కీలకమైన ఆదేశాలు జారీ చేసింది. పర్యావరణ హితమైన గ్రీన్ క్రాకర్స్‌ను పరిమితంగా కాల్చుకునేందుకు అనుమతినిస్తూ, ఈ నెల 18 నుంచి 21 వరకు నాలుగు రోజుల పాటు వెసులుబాటు కల్పించింది. అయితే, ఢిల్లీ ఎన్‌సీఆర్ పరిధిలోకి బయటి ప్రాంతాల నుంచి టపాసులను తీసుకురావడాన్ని పూర్తిగా నిషేధించింది. ఈ సందర్భంగా సర్వోన్నత న్యాయస్థానం కీలక వ్యాఖ్యలు చేసింది. "బయటి నుంచి అక్రమంగా తరలించే టపాసుల వల్లే పర్యావరణానికి ఎక్కువ నష్టం వాటిల్లుతోంది. మనం పర్యావరణంతో రాజీ పడకుండా, సంయమనంతో కూడిన సమతుల్య విధానాన్ని అనుసరించాలి" అని భారత ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం అభిప్రాయపడింది. తక్కువ ముడిసరుకులతో, ధూళిని తగ్గించేలా తక్కువ ఉద్గారాలను వెలువరించే వాటిని "గ్రీన్ క్రాకర్స్"గా పరిగణిస్తారు. ప్రస్తుతం తాము ఇచ్చిన ఆదేశాలు కేవలం తాత్కాలిక చర్య మాత్రమేనని కోర్టు స్పష్టం చేసింది. నిర్దేశించిన నాలుగు రోజుల్లో ఢిల్లీ ఎన్‌సీఆర్ ప్రాంతంలోని వాయు నాణ్యత సూచీని నిరంతరం పర్యవేక్షించాలని కాలుష్య నియంత్రణ మండలి అధికారులను ఆదేశించింది. దీనిపై సమగ్ర నివేదికను తమకు సమర్పించాలని సూచించింది. ఈ నివేదిక ఆధారంగా భవిష్యత్తులో తదుపరి నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది. ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్, జస్టిస్ వినోద్ చంద్రన్‌తో కూడిన ధర్మాసనం ఈ కీలక తీర్పును వెలువరించింది. ఈ తీర్పు ప్రకారం దీపావళి సంబరాల్లో ప్రజలు గ్రీన్ క్రాకర్స్‌ను కాల్చుకోవచ్చు. అయితే ఈ అనుమతి కొన్ని కఠినమైన షరతులకు లోబడి మాత్రమే ఉంటుంది. గ్రీన్ క్రాకర్స్ అమ్మకాలకు అక్టోబర్ 18వ తేదీ నుంచి 21వ తేదీ వరకు మాత్రమే.

### పాస్‌పోర్టుల జాబితాలో పడిపోయిన యుఎస్ ర్యాంకు!

**న్యూఢిల్లీ, అక్టోబరు 15:** అగ్రరాజ్యం అమెరికాకు షాక్ తగిలింది. ప్రపంచంలో అత్యంత శక్తివంతమైన పాస్‌పోర్ట్‌ల జాబితా నుంచి పడిపోయింది. 20 సంవత్సరాల తర్వాత తొలిసారిగా యూఎస్ పాస్‌పోర్ట్ టాప్10 నుంచి దిగజారింది. హెన్లీ పాస్‌పోర్ట్ ఇండెక్స్ ఆధారంగా విడుదలైన తాజా ర్యాంకింగ్స్‌లో అమెరికా 12వ స్థానానికి పడిపోయింది. ప్రస్తుతం, మలేషియాతో కలిసి యూఎస్ 12వ స్థానంలో నిలిచింది. అమెరికా పాస్‌పోర్ట్ హోల్డర్లు ఇప్పుడు కేవలం 180 దేశాలకు మాత్రమే వీసా లేకుండా ప్రయాణం చేసే అవకాశం ఉంటుంది. ఇక, ఈ జాబితాలో సింగపూర్ అగ్రస్థానంలో నిలిచింది.


కారు డిక్కీలో లభ్యమైన ఎర్రచందనం దుంగలు

## రూ.14 లక్షల విలువైన ఎర్రచందనం దుంగలు స్వాధీనం

**చిత్తూరు, అక్టోబర్ 15 ప్రభాతవార్త:** చిత్తూరు జిల్లా బంగారుపాళ్యం మండలం చిత్తూరు-బెంగళూరు రహదారిలో కాటప్పగారిపల్లి వద్ద బుధవారం జరిగిన ఓ రోడ్డు ప్రమాదంలో ప్రమాదానికి గురైన కారు నుండి 14 లక్షల రూపాయల విలువైన ఎర్రచందనం దుంగలు లభ్యమయ్యాయి. వేగంగా వచ్చిన కారు ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనంను ఢీకొని అదుపు తప్పి రోడ్డు ప్రక్కన వున్న ముళ్ళ చెట్లలో దూరింది. కారులో ప్రయాణిస్తున్న దుండగులు అక్కడి నుండి పరారీ అయ్యారు. ప్రమాదం జరిగిన విషయంను స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో సంఘటనా స్థలంకు చేరుకున్న పోలీసులు ద్విచక్రవాహనంలో గాయపడిన వ్యక్తిని చికిత్స నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ క్రమంలో ప్రమాదానికి గురైన కారును పరిశీలించిన పోలీసులకు కారు డిక్కీలో 9 ఎర్రచందనం దుంగలు బయటపడ్డాయి. దీంతో ఎర్రచందనం స్మగ్లర్లు పలమనేరు వైపు నుండి చిత్తూరు వైపుకు కారులో ఎర్రచందనం దుంగలను స్మగ్లింగ్ చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. కారులో పట్టుబడ్డ 9 ఎర్రచందనం దుంగల విలు 14 లక్షల రూపాయలు వుంటుందని పోలీసులు నిరారించారు. బంగారుపాళ్యం ఎస్ఐ ప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## అత్యంత ప్రతిష్టాత్మకమైన గూగుల్ డేటా సెంటర్ రాష్ట్రానికి రావడం అభినందనీయం : మంత్రి కొల్లు రవీంద్ర



**విజయవాడ.అక్టోబరు 15,ప్రభాత వార్తప్రతినిధి:** ఏపీకి అత్యంత ప్రతిష్టాత్మకమైన గూగుల్ డేటా సెంటర్ రావడం పట్ల లోకేష్, చంద్రబాబులను అభినందించాలని రాష్ట్ర ఎక్సైజ్ శాఖా మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. సముద్రంలో నుంచి ఒక డేటా కేబుల్ రాబోతోంది.. పదేళ్ళలోపే ఏపీ స్వరూపమే మారబోతోంది. రాష్ట్రానికి అద్భుతమైన అభివృద్ధి రాబోతోంది.. మాజీమంత్రి అమర్నాథ్ కు వీటిపై మాట్లాడే అర్హత ఉందా ? అని రవీంద్ర ప్రశ్నించారు. నవంబర్ 15న కూడా ఇన్వెస్ట్మెంట్ సమ్మిట్ విశాఖలో జరగబోతోంది. 64 లక్షల మందికి పెన్షన్లు ఇస్తున్నాం.. రాష్ట్రంలో అస్థిరత తీసుకు రావాలని చూస్తున్నారు. పాస్టర్ ప్రవీణ్ మరణడాన్ని మతాల మధ్య చిచ్చుగా చేయాలని చూశారని మంత్రి రవీంద్ర చెప్పుకొచ్చారు. వైఎస్సార్ సిపి నేతలు కులాల్ని మతాలని రెచ్చగొట్టాలని చూస్తున్నారని అని మంత్రి కొల్లు రవీంద్ర వ్యాఖ్యానించారు. గోరంట్ల మాధవ్ కు మాట్లాడే అర్హత ఉందా? కియా మోటార్స్ ను ఏపీకి రాకుండా చేశారు. చాలా ఇండస్ట్రీస్ పక్క రాష్ట్రాలకు వెళ్ళిపోయాయంటే గోరంట్ల మాధవ్ కారణం కాదా ? అని ఆయన ప్రశ్నించారు. బందరులో ఉన్న వైన్ షాపులన్నీ పేర్ని నాని మను షులవే.. అన్ని షాపుల ముందూ డివైజ్ పెడుతున్నాం.. సామాన్యుడు కూడా ఆ డివైజ్ లలో చెక్ చేసుకోవచ్చు.. సహజ మరణాలను కూడా లిక్కర్ మరణాలుగా చూపించాలని చూస్తున్నారు.. ప్రజలను భయాందోళనలకు గురి చేయాలని చూస్తే మీ ప్రయత్నాలు సాగవు.

## పోర్టులు, రైల్వేల కనెక్టివిటీ ద్వారా సంపద సృష్టి

### - ప్రధాని పర్యటన విజయవంతం చేయాలి : సిఎం చంద్రబాబు



**విజయవాడ,అక్టోబరు 15,పభాతవార్త ప్రతినిధి:** ప్రధాని నరేంద్ర మోడీ పర్యటనను విజయవంతం చేయాలని పార్టీ నేతలకు ఏపీ సిఎం చంద్రబాబు సూచించారు. ఈ పర్యటనపై ఆయన టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. 'బడుల్ ఇంజిన్ సర్కార్ విధానాలతో రాష్ట్రానికి అనేక ప్రయోజనాలున్నాయి. ప్రధాని శ్రీశైలం,కర్నూలు పర్యటనలను విజయవంతం చేద్దాం. కేంద్రం సహకారంతో రాష్ట్రానికి పెద్ద ఎత్తున లాభం చేకూరుతోంది. గూగుల్ ఏఐ డేటా హబ్ ఏర్పాటుకు మంగళవారం ఒప్పందం చేసుకున్నాం. ఈ హబ్ రావడంలో ప్రధాని,కేంద్ర మంత్రుతల చొరవ ఉంది. గూగుల్ రావడానికి మంత్రి నారా లోకేష్ ప్రధాన పాత్ర పోషించారు. అధికారం లోకి రాగానే గూగుల్ ప్రతినిధులను సంప్రదించారు.15 బిలియన్ డాలర్ల పెట్టుబడి పెట్టేందుకు ఆ సంస్థ ముందుకొచ్చింది. దేశం లోనే ఇది అతి పెద్ద విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి. గత పాలకులు చేసిన విధ్వంసంతో రాష్ట్రం తీవ్రంగా నష్టపోయింది. వారి తప్పులను సరిచేయడానికే చాలా సమయం పట్టింది. యోగాంధ్ర,అమరావతి రీస్టార్ట్ కార్యక్రమాలను విజయవంతం చేశాం.ఇప్పుడు ప్రధాని మోడీ పాల్గొనే 'సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్' విజయవంతం చేద్దాం. రాయలసీమకు పెద్దఎత్తున పరిశ్రమలు తీసుకొస్తున్నాం. గత పాలకులు సీమ లోని సాగునీటి ప్రాజెక్టులను పట్టించుకోలేదు. తిరుపతి,శ్రీశైలం,గండికోటను పర్యాటకంగా అభివృద్ధి చేస్తున్నాం. హెల్తీ,వెల్తీ,హ్యాపీ ఏపీ సాధనే లక్ష్యంగా అంతా పనిచేయాలి' అని చంద్రబాబు దిశా నిర్దేశం చేశారు. విభజనతో ఎదుర్కొన్న ఇబ్బందుల కంటే గత పాలకులు చేసిన విధ్వంసంతో రాష్ట్రం తీవ్రంగా నష్టపోయిందని చంద్రబాబు ధ్వజమెత్తారు. పాలనాపరంగా అనేక తప్పులు చేశారని వాటిని సరిచేయడానికే చాలా సమయం పట్టిందన్నారు. యోగాంధ్ర, అమరావతి రీస్టార్ట్ లాంటి కార్యక్రమాలను విజయవంతం చేశామన్నారు. గురువారం సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ కార్యక్రమాన్ని కూడా విజయవంతం చేద్దామని పిలుపునిచ్చారు. జీఎస్టీ 2.0 సంస్కరణలతో ఒక్కో కుటుంబానికి రూ.15 వేలు ఆదా అవుతుందని వెల్లడించారు. నెక్స్ జెన్ సంస్కరణలపై నెల రోజులుగా విస్తృత ప్రచార కార్యక్రమం నిర్వహిస్తున్నామని చెప్పారు. రాయలసీమకు పెద్ద ఎత్తున పరిశ్రమలు తీసుకొస్తున్నామని, సీమ జిల్లాలు ఉద్యావన పంటలకు కేంద్రంగా మారాయని సీఎం చంద్రబాబు వివరించారు. రాష్ట్రంలో పోర్టులు, రైల్వేల కనెక్టివిటీ ద్వారా సంపద సృష్టి జరుగుతుందన్నారు. గత పాలకులు సీమలోని సాగునీటి ప్రాజెక్టులకు కనీసం రూ. 2 వేల కోట్లు కూడా ఖర్చు చేయలేదని ధ్వజమెత్తారు. రాయలసీమ టూరిజం డెస్టినేషన్గా మారుస్తామని స్పష్టం చేశారు. తిరుపతి, శ్రీశైలం, గండికోట లాంటి ప్రాంతాలను పర్యాటకంగా అభివృద్ధి చేస్తున్నామని వెల్లడించారు. హెల్తీ, వెల్తీ, హ్యాపీ ఏపీ సాధనే లక్ష్యంగా మనం అంతా పని చేయాలని పిలుపునిచ్చారు.ఏపీలో గూగుల్ ఏఐ డేటా హబ్ ఏర్పాటు చేసేందుకు దిల్లీలో మంగళవారం ఆ సంస్థతో ఒప్పందం చేసుకున్నామని ఇది చారిత్రాత్మక నిర్ణయమన్నారు.

## కాపు, బలిజ, తెలగ కులాల విద్యార్థుల సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళతా

### - కాపు కార్పొరేషన్ చైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు

**సచివాలయం,అక్టోబర్ 15,ప్రభాతవార్త :** విదేశీ విద్యాపథకం కింద అరు హై ఉన్నత విద్య అభ్యసించేందుకు విదేశాలకు వెళ్ళి కాపు,బలిజ,తెలగ,ఒంటరి కులాలకు చెందిన విద్యార్థిని,విద్యార్థుల తల్లిదండ్రులు బుధవారం తాడేపల్లిలోని కాపు కార్పొరేషన్ కార్యాలయంలో కార్పొరేషన్ చైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు ని కలసి తమ సమస్యను వివరించారు.అనంతరం చైర్మన్తో వారు మాట్లాడుతూ విదేశాల్లో ఉన్నత విద్య అభ్యసిస్తున్న అర్హులైన తమ పిల్లలకు విడుదల చేయాల్సిన విదేశీ విద్య ఉపకార వేతనాలను వెంటనే విడుదల చేయాలని,తమ తరపున ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లి బకాయి నిధులను విడుదల చేయాల్సిందిగా చైర్మన్కి అర్జీలు అందించారు.ఈ సందర్భంగా చైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు,విద్యార్థిని విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతూ ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళి త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేసా_నన్నారు.

## ఆలయాన్ని దేవాదాయశాఖ అధీనంలోకి తీసుకోవాలి

### - తిరుపతిలో ప్రసన్నవెంకటేశ్వరస్వామి ఆలయం నిర్మాణం వివాదం



**తిరుపతి,అక్టోబర్ 15ప్రభాతవార్తప్రతినిధి:** భగవంతునిపై విశ్వాసం..బలమైన ఆకాంక్షతో తిరుపతి నగరంలోని ఏఐఆర్ బైపాస్మార్గంలో దూరదర్శన్కేంద్రం సమీపంలో గతంలో నిర్మించిన లక్ష్మీపద్మావతిసమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని దేవాదాయశాఖ ,టిటిడి అధీనంలోకి తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు. ఇటీవల ఈ ఆలయం జీర్ణోద్ధారణ,కుంభాబిషేకం కార్యక్రమం చేపడుతున్నందున ఆలయంపై పలువురు రాద్ధాంతం చేయడంతో బుధవారం సాయంత్రం జనసేనపార్టీ తిరుపతి ఇన్ఛార్జి కిరణ్రాయల్, కిశోర్తో కలసి ఆలయాన్ని సందర్శించారు. 2016వ సంవత్సరంలో అర్బన్ తాశీల్దార్గా పనిచేసిన అధికారి దేవునిపై భక్తి విశ్వాసాలతో ప్రభుత్వస్థలంలో ఆలయాన్ని నిర్మించారు. ఆ ఆలయాన్ని ఇప్పుడు జీర్ణోద్ధారణ పనులు జరుగుతున్నాయి. వివాదాస్పదంగా మారడంతో వస్తున్న విమర్శలతో ఆలయాన్ని సందర్శించారు. అక్కడ అర్చకులతో మాట్లాడి ఆలయం చాలా అద్భు తంగా నిర్మించారని, తాశీ ల్దార్గా ఎవరు బాధ్యతలు చేపడితే వాళ్ళే ఆలయ నిర్వహణ చూస్తార న్నారు. అయితే హిందూ యేత రులు వస్తే ఆలయం పరిస్థితి ఏంటనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. దీనిపై టిటిడికిగానీ, దేవాదాయశాఖగానీ ఆధీనంలోకి తీసుకోవాలని జిల్లా కలెక్టర్ను కలసి విన్నవించనున్నామన్నారు. అంతేగాక సిఎం,డిసిఎం దృష్టికి తీసుకెళ్ళి శ్రీవేంకటేశ్వరస్వామి భక్తులు, హిందువుల మనోభావాలు దెబ్బతినకుండా ఆలయాన్ని నిర్వహించేలా చూడాలని కోరుతామని కిరన్రాయల్ తెలిపారు. ఆలయ నిర్వహణ వ్యక్తుల కన్నా భక్తులకే ప్రాధాన్యత అన్నారు.

## సీమ రైల్వేలో మరో రెండు సెక్షన్లలో ఆటోమేటిక్ సిగ్నలింగ్ వ్యవస్థ

**గుంతకల్లు రైల్వే, అక్టోబర్ 15, ప్రభాత వార్త:** రైల్వే మంత్రిత్వశాఖ ప్రతిష్టాత్మకంగా అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో చేపట్టిన ఆటోమేటిక్ సిగ్నల్ (ఎ బి ఎస్) వ్యవస్థను రాయలసీమలోని దక్షి ణ మధ్య రైల్వే గుంతకల్లు డివిజన్ పరిధిలో మరో రెండు కీలక సెక్షన్ లలో తెచ్చేందుకు సంబంధిత ఉన్నతాధికారులు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. సుమారు 750 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో 536.57 కిలోమీటర్ల రైలుమార్గాన్ని అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఆటోమేటిక్ సిగ్నలింగ్ వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నట్లు రైల్వే అధికార వర్గాలు తెలిపాయి. భద్రత,సమయపాలనలను మెరుగు పరిచే చర్యల్లో భాగంగా భారతీయ రైల్వేలోనే అత్యధిక కిలోమీటర్లను ఆటోమేటిక్ సిగ్నల్ వ్యవస్థను ఏర్పాటు చేస్తోంది. దక్షి ణ మధ్య రైల్వే జోన్ పరిధిలో ఈరైళ్ళ నిర్వహణలో ఎలాంటి అవరోధం,ఆలస్యం కలుగకుండా ఆటోమేటిక్ బ్లాక్ సిగ్నల్ వ్యవస్థను డబ్లింగ్ రైలు (అప్ అండ్ డౌన్) రైలు మార్గాలను ఏకకాలంలో పూర్తి చేసేందుకు అధికార యంత్రాంగం ప్రణాళిక సిద్ధం చేసింది. గుంతకల్లు డివిజన్ లో రేణిగుంటగుంతకల్లువాడి మార్గంలో పనులను ప్రారంభించిన విషయం పాఠకులకు విధితమే. తాజాగా చెన్నైముంబైచెన్నై ప్రధాన రైలు మార్గంలోని వాడిగుంతకల్లువాడి సెక్షన్, సైదాపూర్లింగేరియాద్గీర్ సెక్షన్ లో 23.4 కిలోమీటర్ కిలోమీటర్లలో ఆటోమేటిక్ సిగ్నల్ వ్యవస్థను అందుబాటులో తీసుకోరానుంది. ఇందుకు సంబంధించిన నాన్ఇంటర్లాంకింగ్ సాంకేతిక పనులను బుధవారం చేపట్టి అదేరోజు పూర్తిచేసి ఆటోమేటిక్ బ్లాక్ సిగ్నలింగ్ వ్యవస్థను అందుబాటులో తీసుకోరానున్నట్లు రైల్వే వర్గాలు తెలిపాయి.తద్వారా రైళ్ళనిర్వహణకు ఎలాంటి అంతరాయం లేకుండా రైళ్ళను సమర్థవంతంగా నడిపేందుకు మార్గంసుగమం అయింది.

## గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థి హఠాత్తుగా మృతి



**మక్కువ (పార్వతీపురం మన్యం జిల్లా) అక్టోబర్ 15 ప్రభాతవార్త:** ఎర్ర సామంతవలస గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఆరవ తరగతి చదువుతున్న విద్యార్థి తాడంగి చిన్నారి బుధవారం ఉదయం మృతి చెందాడు. బాలుడికి అనారోగ్యంగా ఉందని పాఠశాల సిబ్బంది ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సంబరలో వైద్యం చేయించి పనసభద్ర పంచాయతీ మూలవలస గ్రామానికి చెందిన తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చి ఇంటికి పంపించేశారు. తల్లిదండ్రులు పార్వతీపురం ఏరియా ఆసుపత్రికి తరలించి అక్కడ నుంచి విజయనగరం ఆసుపత్రికి తరలించి వైద్యం అందించినప్పటికీ, పరిస్థితి విషమించడంతో విశాఖ కేజీహెచ్కు తరలిస్తుండగా విద్యార్థి మృతి చెందాడు. బాలుడు మృతి చెందడంతో తల్లిదండ్రులు తాడంగి ముదిరి తల్లి కాంతమ్మ మృతదేహం వద్ద రోధించారు. విద్యార్థి మరణంతో మూలవలస గ్రామం విషాదఛాయలు అలుముకున్నాయి.



## ఆర్మీ మేజర్కు నివాళులర్పించిన గుంటూరు కలెక్టర్, ప్రజాప్రతినిధులు

**గుంటూరు క్రైమ్,అక్టోబర్ 15,ప్రభాతవార్త :** రాజస్థాన్లోని సైనిక స్థావరంలో యుద్ధ విన్యాసాలు చేస్తు గుంటూరు సంగడిగుంటకు చెందిన తేజ్ భరద్వాజ్ మరణించారు.ఈ సందర్భంగా బుధవారం మేజర్ భరద్వాజ్ అంత్యక్రియలు పూర్తి అధికార లాంఛనాలతో జరిగాయి.కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా పుష్పగుచ్ఛం సమర్పించి ఘనంగా నివాళులర్పించారు. అంత్యక్రియల్లో జిల్లా కలెక్టర్తోపాటు స్థానిక ఎమ్మెల్యేలు మహ్మద్ నసీర్,గళ్ళా మాధవి,జిఎంసి కమీషనర్ పులి శ్రీనివాసులు పాల్గొన్నారు.

## సోషల్ మీడియాలో అసత్యాలు ప్రచారం చేస్తే కఠిన చర్యలు

### డిజిపి హరీష్కుమార్ గుప్తా హెచ్చరిక

**విజయవాడ,అక్టోబరు 15,ప్రభాతవార్తప్రతినిధి:** సోషల్ మీడియాలో వ్యక్తులు, వ్యవస్థల ప్రతిష్టకు భంగం కలిగించేలా, దురుద్దేశాలను ఆపాదిస్తూ, అసత్యాలను ప్రచారం చేస్తే డీజీపీ హరీష్ కుమార్ గుప్తా తీవ్రంగా స్పందిస్తామని డీజీపీ హరీష్ కుమార్ గుప్తా హెచ్చరించారు. ప్రజలను తప్పుదోవ పట్టించేలా, అనుచిత, విద్వేషపూరిత పోస్టులు పెడితే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేసారు.ఈ మేరకు డీజీపీ కార్యాలయం నుంచి ఒక ప్రకటన విడుదల చేసారు. రాష్ట్రంలో శాంతి భద్రతలకు భంగం కలిగించేలా... సోషల్ మీడియా వేదికలను దుర్వినియోగం చేస్తున్న కొంతమందిని ఇప్పటికే గుర్తించినట్లు తెలిపారు. సోషల్ మీడియాను బాధ్యతగా వినియోగించుకోవాలి. మతం, వర్గ, ప్రాంతీయ భావాలను రెచ్చగొట్టే విధంగా పోస్టులు, వీడియోలు లేదా వ్యాఖ్యలు చేస్తే చట్టపరమైన చర్యలు అనివార్యం అని డీజీపీ స్పష్టం చేశారు. అటువంటి పోస్టులు పెట్టిన వారిని గుర్తించి పోలీసులు కఠినంగా వ్యవహరిస్తారన్నారు. తప్పుడు వార్తలు దుష్ప్రచారం చేసినా కూడా అది నేరమేనని హెచ్చరించారు. అలాగే సోషల్ మీడియా పోస్టుల ద్వారా సమాజంలో ఉద్రిక్తతలు రేపే ప్రయత్నం చేసే వారిపై పలు సెక్షన్ల క్రింద క్రిమినల్ కేసులు నమోదు అవుతాయని తెలిపారు.

## పొగాకు కంపెనీల ఆఫర్లకు దూరంగా ఉండాలి: వైద్య, ఆరోగ్యశాఖ

**విజయవాడ,అక్టోబరు 15,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రభుత్వ శాఖలకు వైద్య ఆరోగ్య శాఖ పిలుపు పొగాకు ఉత్పత్తిదారులు, కంపెనీల చిహ్నాలు, ప్రచారం ప్రభుత్వ శాఖల్లో లేకుండా చూడాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ కోరింది. సదరు సంస్థ భాగస్వామ్యంతో క్రీడలు కానీ, సాంస్కృతిక, ఇతర ఎటువంటి కార్యకలాపాలను నిర్వహించొద్దని స్పష్టంచేసింది. పొగాకు వాడకం తగ్గింపు చర్యల్లో భాగంగా పొగాకు ఉత్పత్తిదారులు, కంపెనీలతో స్పాన్సర్ షిప్, ఒప్పందాలు చేసుకోకూడదని, ఇతర నియంత్రణ చర్యలు పాటించాలని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ప్రత్యేకంగా మార్గదర్శకాలు జారీ చేసింది. వీటిపై ప్రభుత్వ శాఖల అధికారులకు అవగాహన కల్పించే నిమిత్తం విజయవాడలో బుధవారం ప్రత్యేక కార్యశాలను(వర్క్ షాప్ను) వైద్య ఆరోగ్య శాఖ నిర్వహించింది. విజయవాడలోని బెంజి సర్కిల్లోని ఓ హోటలులో జరిగిన ఈ కార్య శాలకు పోలీసు, పంచాయతీ రాజ్, పర్యాటక, మహిళా శిశు, గిరిజన సంక్షేమ శాఖ, పాఠశాల, ఇంటర్, కళాశాల, సాంకేతిక విద్య శాఖలకు చెందిన అధికారులు హాజరయ్యారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ ఓ) రూపొందించిన ఎఫ్ సీటీసీ (ఫ్రేమ్ వర్క్ కన్వెన్షన్ ఆన్ టూబాకో కంట్రోల్) ఆర్టికల్ 5.3 అమలు గురించి ఈ కార్యశాలలో కేంద్ర ప్రభుత్వంతో కలిసి పనిచేస్తున్న వైటల్ స్ట్రాటజీస్ సంస్థ ముఖ్య ప్రతినిధులు డాక్టర్ అమిత్ యాదవ్ ఉన్నారు.

## విజయవాడ మెట్రో రైల్ టెండర్ల గడువు పెంపు

**విజయవాడ,అక్టోబరు 15,ప్రభాతవార్తప్రతినిధి:** విజయవాడ మెట్రో ప్రాజెక్టులో రూ.4,150 కోట్ల సివిల్ పనులకు సంబంధించి టెండర్లు వేసేందుకు మరోసారి గడువు పొడిగించారు. వివిధ సంస్థల నుంచి వచ్చిన విజ్ఞప్తిపై ఈ నెల 24 వరకు గడువు పెంచాలమని ఏపీ మెట్రో రైల్ కార్పొరేషన్ ఎండీ రామకృష్ణారెడ్డి తెలిపారు. 'మెట్రో రైల్ ప్రాజెక్ట్ పనుల కోసం ముందు నిర్ణయించిన ప్రకారం మంగళవారం బిడ్లు తెరవాలి. ఎక్కువ సంస్థలు టెండర్లు వేయడం ద్వారా పోటీ పెరుగుతుందన్న ఉద్దేశ్యంతో గడువు మరో 10 రోజులు పెంచాం'అని ఎండీ వివరించారు. మెట్రో రైల్ పనులకు సంబంధించి టెండర్ల గడువు పెంచడం ఇది రెటండో సారి. మొదటి టెండర్ నోటిఫికేషన్ ప్రకారం గత నెల 18న బిడ్లు తెరవాలి. గుత్తగా కాకుండా పనులు విడదీసి టెండర్లు పిలవాలన్న సంస్థల వినతి.

# తిరుమల సమాచారం

## వెంకన్న సేవలో విద్యావల్లభతీర్థస్వామి



**తిరుమల,అక్టోబర్ 15ప్రభాత వార్తప్రతినిధి:** కలియుగప్రత్యక్షదైవం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని బుధవారం ఉదయం ఉడిపి కణియూరుమఠం పీఠాధిపతి విద్యావల్లభతీర్థస్వామి శిష్యులతో కలసి దర్శించుకున్నారు. ఆలయ మహాద్వారం వద్ద టిటిడి ఇఒ అనిల్కుమార్సింఘాల్, బొక్కసం ఇన్ఛార్జి గురురాజారావు, అర్చకులు ఇస్తికఫాల్తో స్వాగతం పలికారు. ఆలయంలోనికిచేరుకున్న విద్యావల్లభతీర్థస్వామి తొలుత ధ్వజస్తంభానికి నమస్కరించారు. ఆనందనిలయంలో శ్రీవారిని దర్శించుకున్నారు. వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. ఇఒ సింఘాల్ అర్చకులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## 22నుండి కపిలతీర్థంలో కార్తీకమాస పూజలు



**తిరుమల,అక్టోబర్ 15ప్రభాతవార్తప్రతినిధి:** టిటిడికి అనుబంధంగా ఉన్న తిరు పతి లోని శైవాలయం కపిలేశ్వరస్వామి ఆలయంలో 22వతేదీ నుండి నవంబర్ 20వతేదీ వరకు నెలరోజులు కార్తీకమాస విశేష పూజ మహోత్సవాలు జరగనున్నాయి. 22వతేదీ హోమమహోత్సవాలకు అంకురార్పణ జరుగుతుంది. 22,23తేదీల్లో గణపతిహోమం, 24న సుబ్రమణ్యస్వామి హోమం, 27న దక్షిణామూర్తిస్వామి హోమం, 28న నవగ్రహహోమం, 29న కాలభైరవస్వామి హోమం, 30న కామాక్షి అమ్మవారి హోమం ఇలా నవంబర్ 20వతేదీ వరకు పలు రకాల హోమాలు నిర్వహిస్తారు. నవంబర్ 20వతేదీ చండికేశ్వరస్వామి హోమం,

త్రిశూలస్నానం, పంచమూర్తుల తిరువీధి ఉత్సవం ఉంటాయి. 500 రూపాయలు చెల్లించి గృహస్థభక్తులు ఒకరోజు హోమంలో పాల్గొనవచ్చునని టిటిడి తెలిపింది. గృహస్థులకు ఒక ఉత్తరీయం, ఒక రవిక, అన్నప్రసాదం అందజేస్తారు. భక్తులు సంప్రదాయ వస్త్రధారణలో హాజరుకావాలి. కార్తీకమాస హోమమహోత్సవాలకు విశేష ఆదరణ ఉంటుంది.

## అందరికి శ్రీవారి ఆశీస్సులుండాలి : ప్రముఖులు



**తిరుమల,అక్టోబర్ 15ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగప్రత్యక్షదైవమ్ శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సులు ప్రజలందరిపై కలగాలని పలువురు ప్రముఖులు ఆకాంక్షించారు. బుధవారం ఉదయం తమిళనాడు రాష్ట్ర ఎమ్మెల్యేలు కె.రాధాకృష్ణన్, కదంబూరురాజు, ఎమ్మెల్యే కన్నాలక్ష్మీనారాయణ, హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టీస్ గోపాలకృష్ణారెడ్డి, ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఈశ్వరరావు, పుదుచ్చేరి ప్రభుత్వ విఫ్ ఆర్ముగం వేర్వేరుగా విఐపి బ్రేక్లో శ్రీవారిని దర్శించుకున్నారు. దేవదేవుని దర్శనంతో అన్నీ శుభాలు కలుగుతాయని విశ్వాసం వ్యక్తం చేశారు. వీరికి టిటిడి ఆలయ అధికారులు స్వాగతం పలికి స్వామివారి దర్శనం చేయించారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. టిటిడి ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## తిరుమలలో తప్పిపోయిన మహిళ

### - కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో వెలుగులోకి



**తిరుమల,అక్టోబర్ 15ప్రభాతవార్తప్రతినిధి:** ఏడుకొండల వేంకటేశ్వరస్వామి దర్శనార్థం గతనెలలో తిరుమలకు వచ్చిన ఓ భక్తబృందంలో ఓ మహిళ తప్పిపోయిన ఉదంతం ఆలస్యంగా కుటుంబసభ్యులు ఫిర్యాదుతో వెలుగుచూసింది. తిరుమల వన్టౌన్ సిఐ విజయకుమార్, స్టేషన్ రైటర్,ఏఎస్ఐ మోహన్నాయుడు వివరాలు తెలిపారు. అన్నమయ్యజిల్లా టి.సుండుపల్లిమండలం మదిలేడుకు చెందిన బుక్కె సోమ లమ్మ('59)భర్తతో కలసి గతనెల 2వతేదీ తిరుమలకు వచ్చారు. పదిరోజులు తిరుమలలోనే ఉండి సెప్టెంబర్ 12వతేదీ శ్రీవారి దర్శనం చేసుకున్నారు. అదేరోజు సాయంత్రం 4గంటలకు లడ్డూకౌంటర్కెళ్ళే మార్గంలో అధిక రద్దీతో ఆమె తప్పిపోయింది. తిరుమల అంతటా తిరుపతిలో వెదికినా ఆచూకీ తెలియలేదు. ఆ తరువాత కుటుంబంతో కలసి స్వగ్రామం వెళ్లారు. బంధువులు, కుటుంబసభ్యుల ఇళ్ళలో వెదికినా ఫలితం లేకపోయింది.ఇప్పటివరకుఆమె ఆచూకీ తెలియలేకపోవడంతో బుధవారం తిరుమలకు చేరుకుని వన్టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తిరుమల సిఐ విజయకుమార్ కేసు నమోదు చేశారు. మహిళ ఆచూకీతెలిస్తే 0877-2289027,9440796769, 9440796771 నంబర్లకు సమాచారం అందించాలని కోరారు.

## రోడ్డుప్రమాదంలో ముగ్గురు మృతి, ఒకరికి గాయాలు

**కలిగిరి (నెల్లూరు), అక్టోబర్ 15, ప్రభాతవార్త :** కలిగిరి మండలం తెల్లపాడు క్రాస్రోడ్డువద్ద, కొండాపురం కలిగిరి రోడ్డుపై బుదవారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఒకేకుటుంబానికి చెందిన నలుగురిలో ,ముగ్గురు మృతి చెందగా ఓబాలిక గాయాలతో బయట పడింది. పోలీసులు, ప్రత్యక్ష సాక్షులు కథనం మేరకు కలిగిరి మండలం తూర్పు దూబగుంటకు చెందిన చవలమూడి బాబు కుటుంబసభ్యులు పనిమీద కలిగిరివచ్చి తిరుగు ప్రయాణంలో రోడ్డు ప్రమాదం జరిగింది. కలిగిరినుండి మృతుడుకుటుబం దూబగుంటకు భార్య ఇద్దరు పిల్లలతో బైక్పై వెళ్తుండగా మార్గమద్యంలో రోడ్డుప్రమాదం జరిగింది. ఎదురుగా వస్తున్న బోర్లు వేసే లారీని తప్పించే ప్రకమంలో రోడ్డుకిందకు దిగారని, బైక్ను అదుపుచేసుకోలేక రోడ్డుపై పడడంతో ఎదురుగా వస్తున్న లారీ వీరిపైకి ఎక్కింది. ఈ ప్రమాదంలో మృతుడు చవలమూడి బాబు(27) మమత(22)కూతురు చవలమూడిదుర్గ(10) మృతిచెందగా మరోకూతురు మేఘన గాయాలతో బయటపడింది. గాయాలపాలైన బాలికను వైద్య నిమిత్తం వింజమూరు, మెరుగైన వైద్యంకోసం ఆత్మకూరు తరలించారు. బోర్లువేసే లారీ ఎదురుగా రావడంతో లారీని తప్పించే క్రమంలో రోడ్డుకిందకు బైక్ దిగిందని ఆక్రమంలోనే బైక్పైనుండి మృతుడు, బార్యఇద్దరు పిల్లలు రోడ్డుమీద పడ్డారు. ఎదురుగా వస్తున్నలారీ కిందపడ్డవారిపైకి దూసుకెళ్లడంతో ముగ్గురు చనిపోగా ఒక బాలికమాత్రం గాయాలతో బయట పడింది. కేసునమోదుచేసి ప్రమాదానికి కారణమైన లారీని అదుపులోకి తీసుకున్నామనిఉదయగిరి సిఐ వెంకట్రావు తెలిపారు.కాగా మృతుడు బేల్దారి పని చేసుకుంటూయ మహబూబ్నగర్లో ఉన్నాడని గ్రామంలో బంధువుల వివాహానికి హాజరయ్యేందుకు దుబగుంటకు వచ్చిన వీరు కలిగిరికి పనిమీద వచ్చితిరుగు ప్రయాణంలో మృత్యువాత పడ్డారు. ఈ ప్రమాదం జరగడంతో గ్రామంలో విషాదచాయలు నెలకొన్నాయి.ఒకేకుటుం బానికి చెందిన ముగ్గురు చనిపోవడం, ఓబాలికమాత్రం గాయాలతో పయటపడింది. ఈవార్త తెలిసిన కుటుంబ సభ్యులు బోరునవిలపిస్తున్నారు. ప్రమాదం జరిగిన ప్రదేశంలో రోడ్డుపనులు జరుగుతున్నాయి. ఎదురుగా వస్తున్న లారీని తప్పిచబోయిబైక్ను కంట్రోలు చేసుకోలేక రోడ్డుపైన పడడంతో ఈ ప్రమాదం సంభవించిందని ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు.

## రాష్ట్రంలో విద్యుత్ సంఘాల సమ్మె వాయిదా

**విజయవాడ, అక్టోబరు 15,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీలో విద్యుత్ సంఘాల సమ్మె వాయిదా పడింది. సీఎస్ విజయానంద్, విద్యుత్ సీఎండీలో నిన్న విద్యుత్ సంఘాల నేతలు చర్చలో పాల్గొన్నారు. కొన్ని సమస్యలు పరిష్కారమయ్యాయని, మరికొన్ని పెండింగ్లో ఉన్నాయని జేఏసీ నేత కృష్ణయ్య తెలిపారు. ప్రధాని మోదీ పర్యటన కారణంగా సమ్మెను రెండు రోజులు వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. ఈ నెల 17న మధ్యాహ్నం 3 గంటలకు తిరిగి చర్చలకు హాజరై, ఆ తర్వాత సమ్మెపై తుది నిర్ణయం తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు.



తూర్పుగోదావరి, కాకినాడ
డా.బి.ఆర్ అంబేడ్కర్ కోనసీమ

తెలుగు జాతీయ దినపత్రిక
వార్త




# బీచ్ ఫెస్టివల్ పై సమీక్షించిన ఎమ్మెల్యే



**కోనసీమ బ్యూరో , అక్టోబర్ 15 ( ప్రభాతవార్త ) :** జనవరి నెలలో ఎస్. యానం బీచ్ లో నిర్వహించే సంక్రాంతి బీచ్ ఫెస్టివల్ కార్యక్రమానికి సంబంధించి సమీక్ష సమావేశం బుధవారం ఎస్ యానం బీచ్ ఆవరణలో ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు అధ్యక్షతన జరిగింది. రాష్ట్ర నలుమూలల నుండి సంక్రాంతి పండుగ సందర్భంగా అధిక సంఖ్యలో ప్రజలు ఈ ఉత్సవాలకు హాజరవుతారని, వీటికి తగిన ఏర్పాట్లు చేయడం జరుగుతు ఒదని ఎమ్మెల్యే అన్నారు. గ్రామ ప్రజలంతా సహకరించి సంక్రాంతి సంబరాలను విజయవంతం చేయాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ మహేష్ రావిరాల హాజరై బీచ్ ఫెస్టివల్ కు సంబంధించిన ఏర్పాట్లు చర్చించారు. ఈ కార్యక్రమంలో అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, ఆర్డీఓ మాధవి, రాష్ట్ర అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ లంకె భీమరాజు, అమలాపురం మార్కెట్ కమిటీ చైర్మన్ అధికారి జయవెంకటలక్ష్మి, బాబ్జి, జిల్లా తెలుగు మహిళా అధ్యక్షురాలు విజయలక్ష్మి, పలచోళ్ల పద్మనాభం, దంగేటి చిట్టిబాబు, అయితాబత్తుల రాజశేఖర్, ఇసుకపట్ల రఘుబాబు, పొలమూరి ధర్మపాల్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ ఉమా కుక్కుటేశ్వర స్వామి దర్శనం భక్తులకు శుభప్రదం



**పిఠాపురం , అక్టోబర్ 15 ( ప్రభాతవార్త ) :** పిఠాపురం పట్టణమందు పాదగయ క్షేత్రముగా పురాణ ప్రసిద్ధిగాంచి శ్రీ ఉమా కుక్కుటేశ్వర స్వామిగా భక్తులచే నిరంతరం పూజలు అందుకుంటున్న ఈ క్షేత్రం విశిష్టత, తద్వారా ఈ క్షేత్రాన్ని దర్శించుకోవాలని భారతదేశ నలుమూల నుండి ఎందరెందరో ఈ క్షేత్రం యొక్క మహిమ ఎంతో పవిత్రమైనదని దర్శించుకోవడానికి వస్తూ అలాగే ఎందరో రాజకీయ ప్రముఖులు ,ఆధ్యాత్మిక తత్వ పరులు స్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహిస్తున్నారు. సాంప్రదాయాలను పాటిస్తూ నిరంతరం వచ్చు భక్తులకుఎటువంటి అసౌకర్య ముల కలుగకుండ తగు జాగ్రత్తలు తీసుకోవడానికి సరైన ప్రణాళిక తో కొత్తదనముతో భక్తులకు సకల సౌకర్యాలు, స్వామి అమ్మవార్ల దర్శనానికి క్యూలైన్లు ఏర్పాట్లు, వచ్చే కార్తీక మాసంకి మహిళలు ఎక్కువగా పూజలు నిర్వహించుకోవడానికి తగిన ఏర్పాట్లు పరివేక్షణ చేస్తూ ఇప్పటినుండే తగు చర్యలను ఆలయ ఈవో జగన్మోహన్ చేపట్టారు.

# ఆరోగ్యవంతమైన సమాజం కోసం కృషి చేయాలి : ఎమ్మెల్యే గిడ్డి

## 8వ రాష్ట్రీయ పోషణ మాసం - 2025 ముగింపు కార్యక్రమం

**అంబాజీపేట ( పి గన్నవరం ), అక్టోబర్ 15 ( ప్రభాతవార్త ) :** ఆరోగ్యవంతమైన సమాజకోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, ఆరోగ్య సమాజ నిర్మాణంలో ఐసిడిఎస్ సిబ్బంది, ఆశా వర్కర్ల కృషి ఎంతో గొప్పదని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. పి.గన్నవరం ఐసిడిఎస్ కార్యాల యంలో ఐసిడిఎస్ సిపిడివో వై. విజయశ్రీ అధ్యక్షతన బుధవారం నిర్వహించిన 8వ రాష్ట్రీయ పోషణ మాసం - 2025 ముగింపు కార్యక్రమంలో ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భ ంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు గర్భిణీలు, చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటు న్నాయన్నారు. మహిళలు, గర్భిణీలు, చిన్నారుల ఆరోగ్య సంరక్షణలో పోషకాహారం



ప్రాముఖ్యతను వివరించారు. ప్రతి కుటుంబం ఆరోగ్యవంతంగా ఉండేందుకు సమాజంలో పోషణపై అవగాహన పెంపొందించడం అత్యంత అవసర మన్నారు. అనంతరం ఐసిడిఎస్ సిపిడిఓ వై.విజయశ్రీ ఆధ్వర్యంలో గర్భిణీలకు శ్రీమంతం నిర్వహించగా,చిన్నారులకు అన్నప్రాశన కార్యక్రమం నిర్వహించారు. ఐసిడిఎస్ సిపిడిఓ విజయశ్రీ మాట్లాడుతూ 8వ రాష్ట్రయ పోషణ మాసం-2025లో భాగంగా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 17 సెప్టెంబర్ నుండి ఈ నెల 16 వరకు సుపోషిత్ భారత్-సక్షం భారత్ లో భాగంగా జన ఆందోళన పోషకార భద్రత, ఆరోగ్యకరమైన జీవనశైలి వంటి కార్యక్రమాలపై అవగాహన కార్యక్రమాలను నిర్వహించామన్నారు.

ఈ సందర్భంగా పి.గన్నవరం నియోజకవర్గంలోని నాలుగు మండలాల అంగనవాడి టీచర్లు ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాల్స్ ను ఎమ్మెల్యే పరిశీలించారు. అనంతరం 8వ రాష్ట్రీయ పోషణ మాసం-2025 ప్రతిజ్ఞను చేశారు.

ఈ కార్యక్రమంలో ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, సర్పంచి బొండాడ నాగమణి, ఏఎంసీ చైర్మన్లు పెనుమాల లక్ష్మి, చిట్టూరి శ్రీనివాస్, రాష్ట్ర ఇరిగేషన్ డైరెక్టర్ శిరిగినీడి వెంకటేశ్వరరావు, నియోజవర్గ టిడిపి కో-కన్వీనర్ దాసరి వీర వెంకట సత్యనారాయణ, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డొక్కా నాథ్ బాబు, సాధనాల శ్రీ వెంకటేశ్వరరావు, వైపాల తాతాజీ,వాసంశెట్టి కుమార్, ఆదిమూలం సూరయ్యకాపు,శేరు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# విద్యా బాల మందిర్ లో అబ్దుల్ కలామ్ జయంతి వేడుకలు

**కొత్తపేట , అక్టోబర్ 15 ( ప్రభాతవార్త ) :** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట మండలం కొత్తపేట విద్యాబాల మందిర్ హై స్కూల్లో భారత మాజీ 11వ రాష్ట్రపతి అబ్దుల్ కలాం 94వ జన్మదినోత్సవం సందర్భంగా ఆయన చిత్రపటానికి పాఠశాల కరస్పాండెంట్ రామోజీ అనురాధ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆమె మాట్లాడుతూ ఏపీజే అబ్దుల్ కలాం అని ప్రముఖంగా పిలవబడే డాక్టర్ అవుల్ ఫకీర్ జైనులబ్దిన్ అబ్దుల్ కలాం అక్టోబర్ 15, 1931న తమిళనాడులోని రామేశ్వరంలో జన్మించారు. ఆయన భారత దేశపు ప్రముఖ క్షిపణి శాస్త్రవేత్త మరియు 11వ భారత రాష్ట్రపతిగా సేవలందించి జూలై 27, 2017 న మరణించారని తెలిపారు. మిస్సైల్ మ్యాన్ ఆఫ్ ఇండియా గా పిలవబడే అబ్దుల్ కలాం విద్యార్థులకు స్ఫూర్తిదాయకునిగా నిలిచారని, ఆయన విద్యా రంగంలో ప్రశంసనీయమైన కృషి చేశారని, ఆ



మహనీయుని గౌరవార్థం ప్రతి సంవత్సరం అక్టోబర్ 15వ తేదీ ప్రపంచ విద్యార్థుల దినోత్సవం గా జరుపుకుంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు నూక పెయి శివరత్నం, సుధాకర్, హుస్సేన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని ఆయనకు ఘన నివాళులర్పించారు

# ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ట



**శంకవరం , అక్టోబర్ 15 ( ప్రభాతవార్త )** మండలంలోని కత్తిపూడి లో ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. సామిల్ వీధిలో బుధవారం ఉదయం వేద పండితులు అచ్యుత శర్మ దివేదుల కాశీ చేతుల మీదుగా ఓరుగంటి రాధాకృష్ణ దంపతులు చేతుల మీదుగా విగ్నేశ్వర పూజ మండపారాధన దీక్షా ధర్మం నవగ్రహ ఆవాహనం శాంతి హెూమం నిర్వహించారు. అనంతరం గ్రామస్తులు భక్తుల రామనామ జపం మధ్య స్వామి వారి విగ్రహాన్ని ప్రతిష్టించారు . విగ్రహాన్ని రాష్ట్ర రోడ్డు డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ వెన్న శివ, కేలంగి జనార్ధన్ గాబు శివ ఓరుగంటి శివ దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామస్తులు ఆలయావరణలో భారీ అన్నదానం చేపట్టారు ఈ కార్యక్రమంలో గౌతు అర్జిబాబు కాలింగ్ నూకరాజు జిలకర చంద్రావు నాయుడు సూరన్న, వరహాలు, నాగేశ్వరావు, కంద గోవిందు, ఎలమంచిలి బాబ్జి గ్రామస్తులు భక్తులు పాల్గొన్నారు

# సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యంగా పౌష్టికాహార మాసోత్సవాలు : ఎమ్మెల్యే సత్య ప్రభ

**శంకవరం , అక్టోబర్ 15 ( ప్రభాతవార్త )** బాలికలు కిషోర్ బాలికలు గర్భిణీల సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యంగా మాసోత్సవాలు నిర్వహించడం జరుగుతుందని ప్రత్తిపాడు శాసన సభ్యురాలు వరుపుల సత్యప్రభ పేర్కొన్నారు. శంఖవరం మండలం కత్తిపూడి వర్తక సంఘం కళ్యాణమండపంలో ఐసిడిఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో పౌష్టికాహార మాసోత్సవాలు మరియు అంతర్జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన పోటీలలో విజేతలకు బహుమతి అందజేశారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే సత్యప్రభ మాట్లాడుతూ పౌష్టికాహారం బాలింతలు, గర్భిణీ స్త్రీలకు అత్యంత అవసరమని తెలిపారు. మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబం సంతోషంగా ఉంటుంది అన్నారు. పౌష్టికాహారం ప్రాముఖ్యతను పురుషులూ అర్థం చేసుకోవాలని, వారు కుటుంబ ఆరోగ్యంలో కీలక పాత్ర పోషిస్తారని చెప్పారు. ఊబకాయం మరియు రక్తహీనత వంటి సమస్యలు పెరుగుతున్న నేపథ్యంలో సరైన ఆహారపు అలవాట్లు అలవరచుకోవాలని సూచించారు. సాంకేతిక యుగంలో ఫాస్ట్ఫుడ్ కల్చర్ పిల్లల ఆరోగ్యాన్ని దెబ్బతీస్తుందని, సంప్రదాయ బలవర్ధక ఆహారానికి ప్రాధాన్యం ఇవ్వాలని పిలుపునిచ్చారు. అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా నియోజక వర్గ స్థాయిలో జరిగిన వ్యాస రచన , ఆటలపోటీలలో విజేతలకు ఎమ్మెల్యే బహు



మతులు ప్రధానం చేశారు .. ఆటలు , వ్యాస రచన వంటి పోటీల ద్వారా బాలికల్లో ఆత్మవిశ్వాసం పెరుగుతుందని ఆమె అన్నారు. ప్రతీ బాలిక ఉన్నత విద్య అభ్యసించి, ఉన్నత స్థాయికి ఎదగాలని ఈ సందర్భంగా ఆమె కోరారు. అనంతరం జిల్లా పిడి సిహెచ్ లక్ష్మి జనసేన సమన్వయకర్త మేడిశెట్టి సూర్యకిరణ్ పర్వత సురేష్ తదితరులు ప్రసంగించారు అంగన్వాడి సిబ్బంది ప్రదర్శించిన పౌష్టికాహార స్టాల్ ను సందర్శించారు ఈ కార్యక్రమంలో యాళ్ల జగదీష్ రాష్ట్ర రోడ్డు డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ వెన్న శివ ఖాదీ బందారు డైరెక్టర్ కొమ్ములు రౌతులపూడి ఎంపీపీ రాజ్యలక్ష్మి బద్ది రామారావు కీర్తి సుభాష్ ఈగల దేవుళ్ళు గాబు కృష్ణమూర్తి ఆత్మ కమిటీ వైస్ చైర్మన్ కరణం సుబ్రహ్మణ్యం జనసేన పార్టీ మండల అధ్యక్షులు గాబుసుభాష్ ఉపాధ్యక్షులు తలపంటీ బుజ్జి, ప్రత్తిపాడు సిడిపిఓ పద్మావతి శంఖవరం సిడిపిఓ వెంకటలక్ష్మి అంగన్వాడి సూపర్వైజర్లు అంగన్వాడి సిబ్బంది కూటమి నేతలు పాల్గొన్నారు

# పాత వంతెనపై ప్రమాదాలు ఆగవు ..కొత్త వంతెన నిర్మాణం జరగదు



**యు.కొత్తపల్లి , అక్టోబర్ 15 ( ప్రభాతవార్త )** ప్రమాదకర మలుపులో ప్రమాదాలు జరిగి ప్రాణం పోయినా నివారణ చర్యలు మాత్రం శూన్యం. ప్రమాదకరమైన ఈ మలుపులో పాత బ్రిడ్జి స్థానంలో నూతన వంతెన నిర్మాణం చర్చలకే పరిమితమైందే తప్ప కార్యరూపం దాల్చులేదు. గత పదేళ్లకు పైగా ఈ బ్రిడ్జి నిర్మాణానికి అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారనడంలో సందేహం లేదు. కొత్తపల్లి నుండి పండూరు రోడ్డులో కొమరగిరి సమీపంలో ప్రమాదకర మలుపులో వంతెన ఉంది. ఈ వంతెన అతి ప్రమాదకరంగా ఉన్నా దాని స్థానంలో నూతన వంతెనకు ప్రతిపాదనలు పంపించడం జరిగిందని అధికారులు చెప్పడం పరిపాటిగా మారింది. నిత్యం ఈ వంతెన పై రక్షణ గోడలు కూడా లేవు. నిత్యం విద్యార్థుల బస్సులు, అర్టీసీ బస్సు ప్రయాణం సాగిస్తాయి. దీంతో ఎటువంటి ప్రమాదం సంభవిస్తుందోనని తల్లిదండ్రులు, ప్రయాణికులు భయపడుతున్నారు. ఈ వంతెన విషయమై మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగిన ప్రతీ సారి చర్చకు వస్తుందనే తప్ప బ్రిడ్జి నిర్మాణానికి నోచుకోలేదు. ఇదే వంతెనపై నుండి పడి గతంలో ప్రయాణీకుడు మృతిచెందగా, రోడ్డు రోలర్ కాలువలో పడిపోయింది. కాలేజీ విద్యార్థుల బస్సు కూడా ప్రమాదపుటంచున నిలబడింది. డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించడంతో పెను ప్రమాదం తప్పింది. ఇన్ని ప్రమాదాలు జరుగుతున్నా ప్రజాప్రతినిధులు గానీ, అధికారులు గానీ పట్టించుకోవడం లేదని స్థానికులు, ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. వంతెన నిర్మాణం ఇదుగో అదుగో అంటూ ఎప్పటికప్పుడు వాయిదాల వేయడం తప్ప నిర్మాణం జరగడం లేదని స్థానికలు వాపోతున్నారు.

# కోనసీమలో దారుణం

**- ఇద్దరు పిల్లలను చంపి తండ్రి ఉరేసుకుని ఆత్మహత్య**

**కోనసీమ బ్యూరో , అక్టోబర్ 15 ( ప్రభాతవార్త ) :** అంబేద్కర్ కోనసీమ జిల్లా, ఆలమూరు మండలం,మడికి శివారులోని చిలకపాడు గ్రామంలో బుధవారం రాత్రి హృదయ విదారక ఘటన చోటుచేసుకుంది.

స్థానికంగా సెలూన్ షాప్ నిర్వహిస్తున్న పావులూరి కామరాజు అలియాస్ చంటి (36) తన ఇద్దరు చిన్నారులను విషం తాగించి, అనంతరం ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం చంటి భార్య నాగదేవి ఐదేళ్ల క్రితం ఆత్మహత్య చేసుకుంది. ఆ ఘటనపై అప్పటినుంచి కోర్టులో కేసు నడుస్తూ ఉండగా, ఇటీవలే రాజీ కుదిరిందని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఏమైందో తెలియదు కానీ, బుధవారం రాత్రి అయిదవ తరగతి చదువుతున్న కుమారుడు అభిరామ్ (11), ఒకటవ తరగతి చదువుతున్న త్రినాథ్ గౌతమ్ (8) లకు పురుగుమందు తాగించి, అనంతరం ఫ్యాన్కు ఉరివేసుకుని చంటి ప్రాణాలు తీసుకున్నాడు. ఈ ఘటనకు సంబంధించి చంటి ఓ వీడియో రికార్డు చేసినట్లు సమాచారం. విషయం తెలిసిన వెంటనే రావులపాలెం రూరల్ సీఐ సి.హెచ్. విద్యాసాగర్, ఆలమూరు ఎస్సై జి. నరేష్ సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


# అబ్దుల్ కలాం జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలి : హెచ్ఎం సాయిరామ్

**అంబాజీపేట , అక్టోబర్ 15 ( ప్రభాతవార్త ) :** ప్రతి విద్యార్థి ఏపీజే అబ్దుల్ కలాం జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకొని ఉన్నత శిఖరాలు అధిరోహించేలా కృషి చేయాలని హెచ్ఎం కడలి సాయి రామ్ అన్నారు. అంబాజీపేట జెడ్పీ హైస్కూల్లో అబ్దుల్ కలాం జయంతిని బుధవారం నిర్వహించారు. తొలుత అబ్దుల్ కలాం చిత్రపటానికి పలువురు పూల మాలలు వేసి నివాళ్లర్పించారు. భారత క్షిపని పితామహుడు, భారత రత్న, రాష్ట్రపతిగా దేశ పురో భివృద్ధికి



పాటుపడి చిరస్మరణీయుడుగా చైతన్యం నింపిన మహ నీయుడు అబ్దుల్ కలాం ప్రజలు హృదయాలలో ఎప్పటికీ పదిలంగా ఉంటార న్నారు. డాక్టర్ అబ్దుల్ కలాం దేశానికి చేసిన సేవలను పలువురు ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో స్టాఫ్ సెక్రటరీ రామలింగేశ్వరరావు, ఉపాధ్యాయులు బెహరా మూర్తి, రాంబాబు,సత్తిబాబు, అరుణజ్యోతి,పూర్ణిమ, అంజిబాబు,పీడీ కుంపట్ల ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

# సామాన్య కుటుంబం నుంచి శాస్త్రవేత్తగా ఎదిగిన కలామ్



**మామిడికుదురు , అక్టోబర్ 15 ( ప్రభాతవార్త ) :** భారత మాజీ రాష్ట్రపతి భారతరత్న డాక్టర్ ఎపిజె అబ్దుల్ కలామ్ సామాన్య కుటుంబంలో జన్మించి గొప్ప శాస్త్రవేత్తగా ఎదిగిన స్ఫూర్తి ప్రదాత అని పాశర్లపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కెవిఎస్ నాగోజీరావు కొనియాడారు.అబ్దుల్ కలామ్ జయంతిని బుధవారం పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. కలామ్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.కలావ్ సాధించిన విజయాలు,ఆయన జీవన ప్రస్థానం అతని గొప్పతనాన్ని జీవశాస్త్ర ఉపాధ్యాయుడు నూరువేను శ్రీనివాసరావు విద్యార్థులకు వివరించారు.

అదే విధంగా నగరం ప్రధాన ప్రాథమిక పాఠశాలలో హెచ్.ఎం. భావిశెట్టి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో కలామ్ చిత్రపటానికి ఉపాధ్యాయులు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు.

# పాడి రైతులకు సొసైటీ ద్వారా దాణా పంపిణీ చేయాలి



**మామిడికుదురు , అక్టోబర్ 15 ( ప్రభాతవార్త ) :** పాడి రైతులకు రాయితీ పై అందించే పశువుల దాణా సదరు సొసైటీ ద్వారా పంపిణీ చేయాలని మామిడికుదురు పీఏసిఎస్ చైర్మన్ ఈలి శ్రీనివాస్ కోరారు.ఈ మేరకు బుధవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా జాయింట్ కలెక్టర్ టి.నిశాంతిని వారి కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందించానన్నారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఆమె పంపిణీకి తగు చర్యలు తీసుకొనవలసిందిగా పశు సంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ ను ఆదేశించడం జరిగిందని శ్రీనివాస్ తెలిపారు.

# కుటుంబ సమేతంగా ఆలయాలను సందర్శించండి

**మామిడికుదురు,అక్టోబర్ 15 ( ప్రభాతవార్త )** హిందువులు దేశంకోసం పోరాడుతున్నారని, మనం నిర్మించుకున్న దేవాలయాలను శక్తి కేంద్రాలుగా మార్చాలన్న కార్యాచరణకు ప్రతీ ఒక్కరూ మద్దతుగా నిలవాలని విజయవాడ ప్రాంత సహ సంయోజక్ తులసీ సూర్యప్రకాష్ పిలుపు నిచ్చారు. అప్పనపల్లి శ్రీబాల బాలాజీ సన్నిధిలో బుధవారం సమరసత సేవా ఫౌండేషన్ ఆది జాంభవ సమావేశం జరిగింది.మన దేవాలయాలను మనం సంరక్షించుకునేందుకు కుటుంబ సమేతంగా దేవాలయాలను సందర్శించాలన్నారు.ప్రతి ఒక్క హిందువు దీనిపై




ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.ఈ సమావేశం లో జిల్లా కన్వీనర్ వాకాడ శ్రీనివాసరావు,పరియోజన ప్రముఖ్ కముజు వెంకటశివసుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

# రాజమహేంద్రవరంలో తెలుగు వర్సిటీ

## ఏలూరులో అంబేద్కర్ ఓపెన్ వర్సిటీ

● తాత్కాలిక భవనాలలో ఏర్పాటు యోచన ● ఈ ఏడాది నుంచే అడ్మిషన్లకు చర్యలు

● రాష్ట్ర ప్రభుత్వం ముమ్మర కసరత్తు ● ప్రత్యేక అధికారుల నియామకానికి ప్రతిపాదనలు

**విజయవాడ, అక్టోబరు 15 ప్రభాతవార్త ప్రతినిధి:** ఎట్టకేలకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పొట్టి శ్రీరాములు తెలుగు, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయాలు ప్రత్యేకంగా ఏర్పడనున్నాయి. ఈ ఏడాది నుంచే ప్రారంభించేందుకు ఏపీ ప్రభుత్వ ఉన్నత విద్యాశాఖ చర్యలు చేపట్టింది. ఉమ్మడి ఏపీలో ఏర్పాటైన ఈ రెండు విశ్వవిద్యాలయాలు హైదరా బాద్‌లో ఉన్నాయి. ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టం ప్రకారం గత సంవత్సరం జూన్ 2 నాటికి 10 ఏళ్లు పూర్తయినందున అవి ఏపీలో సేవలను నిలిపివేశాయి. దీంతో రాష్ట్రంలో కొత్తగా తెలుగు విశ్వవిద్యాలయాన్ని రాజమహేంద్రవరంలో, అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యా లయాన్ని ఏలూరు జిల్లాలో ఏర్పాటు చేసేందుకు ప్లాన్ చేస్తున్నారు.

ఇందుకోసం ఏలూరు జిల్లాలో రెండుచోట్ల భూములను పరిశీలించిన కలెక్టర్ ప్రభుత్వానికి నివేదిక పంపారు. వీటిల్లో ఒకటి ఎంపిక చేయనున్నారు. భవనాల నిర్మాణం పూర్తయ్యే వరకు అంబేద్కర్ వర్సిటీని తాత్కాలికంగా ఎక్కడో, చోట ఏర్పాటు చేసి, ప్రవేశాలు నిర్వహిస్తారు. తెలుగు విశ్వవిద్యాలయానికి శ్రీశైలం, కూచిపూడి, రాజమహేంద్రవరంలో పీఠాలు ఉన్నాయి. గత ఏడాది ప్రవేశాలు నిర్వహించనందున ఇప్పుడు రెండో ఏడాది విద్యార్థులు మాత్రమే ఉన్నారు. రాజమహేంద్రవరంలో భవనాలను ఆధునికీకరించి విశ్వవిద్యాయాల కార్యకలాపాలు ప్రారంభిస్తారు. విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేసేందుకు ప్రారంభ బడ్జెట్ కింద రూ.20 కోట్లు, జీత భత్యాలు, మౌలిక సదుపాయాల కల్పనకు మరో రూ.30 కోట్లు అవసరం కావొచ్చని ఇటీవల




అధికారులు ప్రతిపాదించారు. ప్రస్తుతం హైదరాబాద్ వర్సిటీలో 22 విభాగాలు, 40 కోర్సులు ఉన్నాయి. వీటన్నింటినీ ఇక్కడ ప్రారంభించాలంటే 72 బోధన పోస్టులు, 115 బోధనేతర పోస్టులు అవసరమవుతాయి. మొదట డిమాండ్ ఉన్న కోర్సులను ప్రారంభిస్తారు.

**తాత్కాలిక భవనాల్లో అంబేద్కర్ వర్సిటీ:**

అంబేద్కర్ విశ్వవిద్యాలయం తరఫున ఏపీలో 76 దూరవిద్య కేంద్రాలున్నాయి. డిప్లొమో, డిగ్రీ, పీజీ కోర్సుల్లో కలిపి ఏటా 16 వేల మంది వరకు ప్రవేశాలు పొందుతారు. ఫీజుల రూపంలోనే విశ్వవిద్యాలయాలకు ఏపీ నుంచి రూ.21 కోట్ల ఆదాయం వస్తోంది. ఏపీ స్టడీ కేంద్రాల్లో పనిచేస్తున్న సిబ్బందికి జీతాల కింద ప్రభుత్వం ప్రతి సంవత్సరం రూ.5.40 కోట్లు చెల్లిస్తోంది. రాష్ట్రంలో కొత్తగా వర్సిటీ ఏర్పాటు చేస్తే బోధన 50, బోధనేతర పోస్టులు 68 వరకు అవసరమవుతాయి. అద్దె భవనంలో దీన్ని ఏర్పాటు చేసి, వీటిని నిర్వహించేందుకు రూ.63.85 కోట్లకు పైగా కావాలని ఇటీవల అధికారులు ప్రతిపాదించారు.

**ఈ ఏడాది నుంచే ప్రవేశాలు:**

తెలుగు, అంబేద్కర్ వర్సిటీల్లో గత ఏడాది ఎలాంటి ప్రవేశాలు చేపట్టలేదు. ఈ విద్యా సంవత్సరం నుంచి ప్రవేశాలు నిర్వహిస్తారు. అంబేద్కర్ సార్వత్రిక వర్సిటీ ఏపీలోని స్టడీ కేంద్రాల్లో పనిచేస్తున్న సిబ్బందికి 10 నెలలుగా జీతాలు పెండింగ్‌లో ఉన్నాయి. గతంలో ఏపీ నుంచి జీతాల బిల్లు పంపిస్తే విశ్వవిద్యాలయాలు ఆమోదించిన తరువాతే చెల్లింపులు చేసేవారు. ఇకపై ఈ పరిస్థితులు ఉండవంటున్నారు. ఇప్పటికే ప్రత్యేక అధికారులను నియమించాలని నిర్ణయించింది. తెలుగు వర్సిటీకి మునిరత్నం నాయుడు, అంబేద్కర్ వర్సిటీకి ఉన్నత విద్యా మండలి వైస్ ఛైర్మన్ విజయభాస్కర్‌ను ప్రత్యేక అధికారులుగా నియమించేందుకు ప్రభుత్వం దగ్గర ప్రతిపాదనలు ఉన్నట్లు సమాచారం. ఈ విశ్వవిద్యాలయాల వ్యవస్థ గాడిలో పడాలంటే ప్రత్యేకాధికారులుగా వారినే నియమించాలనే ఆలోచనలో ఉన్నత విద్యాశాఖాధికారులు ఉన్నారంటున్నారు.



## రైల్వే స్క్వాడ్ తనిఖీలు

### ఒక్కరోజే రూ.37.06 లక్షలు వసూలు

**గుంతకల్లు రైల్వే, అక్టోబరు 15 ప్రభాతవార్త:** రాయలసీమ రైల్వే డివిజన్‌లో టిక్కెట్ లేకుండా ప్రయాణిస్తున్న వారిపై ప్రత్యేక ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు సోదాలు నిర్వహిస్తున్నారు. ప్రస్తుత పండుగల సీజన్‌లో నిర్వహించిన ఆకస్మిక తనిఖీలలో టిక్కెట్‌లు తీసుకోకుండా ప్రయాణిస్తున్న వారి నుండి ఒకేరోజున రికార్డు స్థాయిలో రూ.37.06 లక్షలు వసూలు చేసి సరికొత్త రికార్డును గుంతకల్లు రైల్వే డివిజన్ నెలకొల్పింది. దక్షిణ మధ్య రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ కమర్షియల్ మేనేజర్ ఇతి పాండే, డిఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా, సీనియర్ డిసిఎం మనోజ్ ఆదేశాలమేరకు డిసిఎం శ్రీకాంత్ రెడ్డి, ఏసిఎం ధనుంజయ్ కుమార్ సింగ్ అధ్వర్యంలో ప్రత్యేక స్క్వాడ్ బృందాలు మంగళవారం రైల్వే డివిజన్ వ్యాప్తంగా ఏకకాలంలో ఆకస్మిక తనిఖీలను నిర్వహించాయి. యాత్రికులు టిక్కెట్ తీసుకోకుండా/ సరైన టిక్కెట్ లేకుండా రైళ్ళలో ప్రయాణిస్తున్న వారి నుండి గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈ దాడులలో మంగళవారం సాయంత్రానికి రూ.28 లక్షలు వసూలు చేయగా, నిర్ణీత గడువు అర్ధరాత్రి 12:00 గంటల సమయానికి నమోదైన మొత్తం 5,343 కేసుల నుండి మొత్తం రూ.37.06 లక్షలు వసూలు చేయడం విశేషం.



ఉదయపూర్‌లో లేక్‌లో పర్యటిస్తున్న మంత్రి దుర్గేష్

## ఉదయపూర్‌లో మంత్రి దుర్గేష్

### - కృత్రిమ మంచినీటి సరస్సు లేక్ పిచోలా, మాన్సూన్ ప్యాలెస్ సందర్శన

**విజయవాడ, అక్టోబరు 15 ప్రభాతవార్త ప్రతినిధి:** ఏపీ పర్యాటక శాఖ మంత్రి మంత్రి కందుల దుర్గేష్ ఉదయపూర్‌లో పర్యటించారు. అక్కడి పర్యాటక ప్రాంతాలను సందర్శించారు. సరస్సుల నగరం ఉదయపూర్ అద్భుతంగా ఉందని ప్రశంసించిన మంత్రి దుర్గేష్, ఇక్కడ పర్యాటక ప్రాంతాల్లో అవలంబిస్తున్న విధానాలు ఏపీలో అమలు చేస్తే బాగుంటుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ అధ్యక్షతన జరిగిన కాన్ఫరెన్స్‌కు హాజరై, సమావేశం ముగిసిన అనంతరం ఉదయపూర్‌లోని ప్రఖ్యాత పర్యాటక ప్రాంతాలను మంత్రి కందుల దుర్గేష్ దర్శించారు. ఈ సందర్భంగా బోట్‌లో వెళ్లి కృత్రిమ మంచినీటి సరస్సు లేక్ పిచోలాను సందర్శించారు. అక్కడే ఉన్న జగ్ నివాస్, జగ్ మందిర్‌లను దర్శించారు. అక్కడి కోట చారిత్రక వైభవాన్ని స్థానిక గైడ్స్ ద్వారా తెలుసుకున్నారు. అనంతరం ఉదయపూర్ మాన్సూన్ ప్యాలెస్‌ను సందర్శించి కలియ తిరిగారు. అక్కడ చారిత్రక విశేషాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ భారతదేశంలోని అత్యంత అందమైన నగరాల్లో సరస్సుల నగరంగా పేరుగాంచిన ఉదయపూర్ ఒకటని కొనియాడారు. పెద్ద రాజభవనాలు, ప్రశాంతమైన సరస్సులు, చారిత్రక కోటలు ఇక్కడి వైభవాన్ని ప్రతిబింబిస్తున్నాయన్నారు. ఈ పర్యాటక పర్యటన అనంతరం ఆంధ్రప్రదేశ్‌లోని పర్యాటక ప్రాంతాల్లో ఇక్కడ అవలంబిస్తున్న విధానాలు అమలు చేస్తే బాగుంటుందని అపించిందన్నారు.

## పొట్టి శ్రీరాములు విగ్రహ నమూనాలు సిఎం పరిశీలన

**విజయవాడ, అక్టోబరు 15 ప్రభాతవార్త ప్రతినిధి:** రాజధాని అమరావతిలో 58 అడుగుల ఎత్తులో నిర్మించనున్న అమరజీవి పొట్టిశ్రీరాములు విగ్రహ నమూనాలను ముఖ్యమంత్రి చంద్రబాబు పరిశీలించారు. బుధవారం సచి వాలయంలో ఏర్పాటు చేసిన ఈ నమూనాలను సీఎం పరిశీలించారు. రాజధాని ప్రాంతంలోని శాఖమూరు లో 6.8 ఎకరాల్లో ప్రభుత్వం పొట్టిశ్రీరాములు స్మృతి వనాన్ని ఏర్పాటు చేస్తోంది. ఈ స్మృతి వనానికి గత నెల 3వ తేదీన మంత్రి నారా లోకేష్ శంకుస్థాపన చేశారు. వచ్చే ఏడాది మార్చి 16న పొట్టి శ్రీరాములు 125వ జయంతి నాటికి ఈ స్మృతివనంలో 58 అడుగుల విగ్రహాన్ని ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నేపథ్యంలో విగ్రహ డిజైన్లను ముఖ్యమంత్రి చంద్రబాబు పరిశీలించారు. ఈ సందర్భంగా విగ్రహానికి స్టాచ్యూ ఆఫ్ సాక్రిఫైస్ గా నామకరణం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్య వైశ్య కార్పొరేషన్ ఛైర్మన్ పారేపల్లి డూండీ రాకేష్, తదితరులు పాల్గొన్నారు.







## తమ్ముని చావుచూసి ఆగిన అక్క గుండె

### - మరణంలోనూ వీడని అక్కాతమ్ముళ్ళ బంధం

**చౌడేపల్లి, అక్టోబరు 15 ప్రభాతవార్త:** అన్నింటికంటే పేగు బంధాన్ని ఉత్తమమైనది. నలుగురు ఆడపిల్లలకు ఒకడే మగబిడ్డని చిన్నతనం నుంచి తమ్ముణ్ని అల్లారు ముద్దుగా చూసిందా సోదరి... అలాంటి తమ్ముడు ఆకస్మికంగా మృతి చెందిన విషయాన్ని జీర్ణించుకోలేక పోయిందా అక్క... మృతదేహాన్ని చూసిన వెంటనే గుండె పగిలి అక్కడే ప్రాణాలు విడిచింది. ఈ విషాదకరమైన సంఘటన చిత్తూరు జిల్లా చౌడేపల్లి మండలం పెద్దయల్లకుంట్ల పంచాయతీ చెడుగుట్లపల్లిలో చోటు చేసుకొంది. గ్రామంలోని ఓబులప్ప, గుంటెమ్మలకు నలుగురు ఆడపిల్లలు, ఒక మగ పిల్లడు జన్మించారు. వారిలో గంగరాజు(45) చివరి వాడు. కాగా జయమ్మ(55) అందరికంటే పెద్దావిడ. తల్లిదండ్రులు మరణించడంతో అందరి బాధ్యతలను జయమ్మ మరికొందరు అక్కాచెల్లెళ్ళు చూసుకొంటూ వచ్చారు. ముఖ్యంగా గంగరాజు అంటే చిన్నతనం నుంచి వారందరికీ మమకారం ఎక్కువగా వుండేది. ఈక్రమంలో గంగరాజు క్యాన్సర్ బారిన పడ్డాడు. వ్యాధి తీవ్రత అధికం కావడంతో మరణించాడు. దీంతో సోమల మండలం సోమాదిగుట్టపల్లిలో వున్న జయమ్మ సోదరుడి మరణవార్త విని వెంటనే అమ్మగారిళ్ళు చెడుగుట్లపల్లికి చేరుకొంది. గంగరాజు మృతదేహాన్ని చూసి రోదిస్తూ కుప్పకూలి పడిపోయింది. గుర్తించిన బంధువులు ఆమెను స్థానిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. మార్గమధ్యలోనే జయమ్మ మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఒకే పేగును తెంచుకొని పుట్టిన బంధం చావులోనూ వీడలేదని గ్రామస్తులు, బంధువులు దుఃఖసాగరంలో మునిగిపోయారు. కాగా జయమ్మ మృతదేహానికి సోమాదిగుట్టపల్లిలో అంత్య క్రియలు నిర్వహించారు.

## అమ్మ కమ్మనైనా పాట ఇక ఆమె నోట విన్పించదు

● రావు బాలసరస్వతి కన్నుమూత ● సినీ, రాజకీయ ప్రముఖులు సంతాపం

● తొలి గ్రామఫోన్ రికార్డు పాడింది ఆవిడే... తొలి ప్లేబ్యాక్ సింగర్ ఆవిడే...

తొలిసారిగా లలిత సంగీతాన్ని ప్రారంభించింది కూడా ఆవిడే

**విజయవాడ, అక్టోబరు 15 ప్రభాతవార్త ప్రతినిధి:** "కమ్మనైన అమ్మ పాట ఎంత ముధురమో....' ఈ గీతం విన్నప్పుడల్లా రావు బాల బాలసరస్వతి గుర్తు కొస్తారు. నిజానికి ఈ పాట అమ్మ పాడలేదు. అయినా అమ్మ పాటను తలుచుకుంటే బాలసరస్వతి(అమ్మ) గుర్తు కొస్తారు. తీవ్ర అడ్డంకులు, ఆంక్షలు నడుమ దుఃఖాన్ని దిగమింగుకుని అమ్మ పాడిన ప్రతి పాట హృదయరంజకమే. ఆల్‌ఇండియా రేడియోలో రావు బాలసరస్వతి పాడిన పాటలకున్న ప్రాచుర్యం చలనచిత్ర గీతాలకు రాలేదు. తెలుగు చలన చిత్ర పరిశ్రమలో తొలి మహిళా సింగర్ రావు బాలసరస్వతి దేవి (97) బుధవారం ఉదయం హైదరాబాద్‌లో తుదిశ్వాస విడిచారు. వృద్ధాప్య సమస్యలతోపాటుగా అనారోగ్యంతో ఆమె గత కొంతకాలంగా ఇబ్బందులు పడుతున్నారు. 1928లో పుట్టిన ఆమె ఆరేళ్ల వయస్సు నుంచే పాటలు పాడటం మొదలు పెట్టారు. మొదటగా రేడియోలో ఆకాశవాణి కార్యక్రమంతో తెలుగువారికి పరిచయమయ్యారు.

**గుంటూరులో బాల్యం..**

మద్రాస్‌లో పుట్టిన బాల సరస్వతి, 1934 నాటికి అంటే తన ఐదవ ఏట గుంటూరుకి చేరుకున్నారు. అక్కడ వీరికి రత్న మహల్ అనే సినిమా థియేటర్ వుండేది. 1936 నాటికి ఆ థియేటర్‌ని నాటకరంగ స్థలంగా మార్చారు. అక్కడే సరస్వతి కుటుంబం పలు నాటకాలు ప్రదర్శించే వారు. ఆ నాటకాల్లో పాటల సన్నివేశాలు వచ్చినప్పుడు సరస్వతి ఆలపించే వారు. గుంటూరులోనే కర్నాటక సంగీతం సాధన చేశారు. కర్నాటక సంగీతంలో ప్రావీణ్యుడైన తండ్రి చొరవతో బొంబాయిలో హిందూస్తానీ సంగీతం కూడా నేర్చుకున్నారు. ఆరో ఏట ఒకసారి నాటకంలో పాటలు పాడుతున్న సరస్వతి గానాన్ని, హెచ్ఎంవి కంపెనీ గ్రామఫోన్‌లో రికార్డు చేసింది. ఆకాశవాణి కేంద్రాలు మద్రాసు, విజయవాడ స్టేషన్ల కోసం ప్రారంభగీతం పాడిన రికార్డు కూడా ఆమెదే. చిన్న వయసులో పాటలు పాడుతున్న ఈమెని బాల సరస్వతి అని పిలిచేవారు.

**సినిమాల్లో...**

సతీ అనసూయ (1936) సినిమాలో తొలిసారి సరస్వతి పాట పాడారు. తెలుగుతో పాటు తమిళ, కన్నడ, హిందీ భాషల్లోనూ అనేక పాటలు ఆలపించారు. దాదాపు రెండువేలకి పైగా పాటలు పాడిన గొప్ప చరిత్ర ఆమెది. తెలుగులో తొలి నేపథ్య గాయని రికార్డు కూడా తనదే. భక్త ధ్రువ, ఇల్లాలు, రాధిక వంటి పలు తెలుగు చిత్రాలతో పాటు తమిళ సినిమాల్లోనూ ఆమె నటించారు. 1944 నాటికి తిరిగి మద్రాసు చేరుకున్న బాలసరస్వతికి కోలంక రాజావారితో వివాహం చేశారు. పెళ్లి తరువాత కూడా తన పాటల ప్రవాహానికి అడ్డురానని మాట ఇచ్చిన భర్త ఆ తరువాత ఆమెపై నిర్బంధం పెట్టారు. సరస్వతి పాడిన హిట్‌సాంగ్స్ గురించి ప్రస్తావిస్తూ తన ఫొటోతో ఓ పత్రికలో అచ్చయ్యింది. ఆ రోజుల్లో అది అవమానంగా భావించిన రాజావారు ఆమె ఇక పాటలు పాడకూడదని షరతు పెట్టారు. పెళ్లి తర్వాత సినిమాల్లో పాడటం మానేశారు. కానీ గొంతు సవరించుకోవడం ఆపలేదు. పుట్టింటికి వచ్చినప్పుడల్లా పాటలు పాడేవారు. ప్రసిద్ధ సంగీత దర్శకులు ఎస్. రాజేశ్వరరావుతో కలిసి ఎన్నో లలిత గీతాలు పాడారు. దేవులపల్లి కృష్ణశాస్త్రి, బసవరాజు అప్పారావు, ఆరుద్ర, ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి, బాలాంత్రపు రజనీకాంతారావు రచించిన ఎన్నో గేయాలు రేడియోలో పాడారు. సినారె తెలుగులోకి అనువదించిన మీరాభజన్ గీతాలను ఆలపించారు. కొన్ని లలిత గీతాలను ఎంచుకుని స్వీయ సంగీత దర్శకత్వం వహించి రాధా మాధవం సీడీ విడుదల చేశారు. అలా చివరి వరకు పాడుతూనే ఉన్నారు.

ఫస్ట్ రికార్డు పాడేటప్పటికి రావు బాలసరస్వతి వయస్సు కేవలం ఆరేళ్ళు. ఆ వయసులో దక్షిణాదిన పాడిన మొదటి గాయని సరస్వతి. ఇదొక్కటే కాదు, ఎన్నో ఘనతలు ఆమె సొంతం. తొలి గ్రామఫోన్ రికార్డు పాడింది ఆవిడే. తొలి ప్లేబ్యాక్ సింగర్ ఆవిడే. తొలిసారిగా లలిత సంగీతాన్ని ప్రారంభించింది కూడా ఆవిడే. ఇవన్నీ పదిహేనేళ్ళ వయస్సు లోపే సాధించారు.

బాలసరస్వతి మృతికి తెలుగు సినీ పరిశ్రమకు చెందిన పలువురు పెద్దలు, ప్రముఖులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆమె మృతిపట్ల తెలుగు చిత్రసీమ సంతాపం వ్యక్తం చేసింది. సిఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్, నేపథ్య గాయకులు నాగూరు బాబు, ఉపద్రష్ట సునీత, గీతామాధురి, మండలి బుద్ధప్రసాద్, గుమ్మడి గోపాలకృష్ణ తదితరులు సంతాపం వ్యక్తం చేసారు.

## అమరావతిలో రాజభవన్ నిర్మాణం

### రూ.212 కోట్లు మంజూరు

**విజయవాడ, అక్టోబరు 15 ప్రభాతవార్త ప్రతినిధి:** అమరావతిలో రాజ్‌భవన్ నిర్మాణానికి రూ.212.22 కోట్లు మంజూరుచేస్తూ మున్సిపల్ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నెల 8న జరిగిన సీఆర్డీఏ 53వ అథారిటీ సమావేశంలో ఆ మేరకు నిర్ణయం తీసుకున్నారు. అనంతరం సిఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన మంత్రి మండలి సమావేశంలోను ఈ అంశంపై ఆమోదం లభించింది,. గవర్నర్ రెసిడెన్స్ కాంప్లెక్స్ లో గవర్నర్ నివాస సముదాయం, సమావేశ మందిరం, గవర్నర్ కార్యాలయం, రెండు అతిథి గృహాలు, ఆరు ఆఫీసు క్వార్టర్ల నిర్మాణాలు చేపట్టనున్నారు. రాజ్‌భవన్‌ను కుడా నిర్దిష్ట కాలవ్యవధిలో పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది.

## కోనసీమలో దారుణం

### ఇద్దరు పిల్లలను చంపి తండ్రి ఆత్మహత్య

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో, అక్టోబరు 15 ప్రభాతవార్త:** అంబేద్కర్ కోనసీమ జిల్లా, ఆలమూరు మండలం, మడికి శివారులోని చిలకపాడు గ్రామంలో బుధవారం రాత్రి హృదయ విదారక ఘటన చోటుచేసుకుంది. స్థానికంగా సెలూన్ షాప్ నిర్వహిస్తున్న పావులూరి కామరాజు అలియాస్ చంటి (36) తన ఇద్దరు చిన్నారులను విషం తాగించి, అనంతరం ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం చంటి భార్య నాగదేవి ఐదేళ్ల క్రితం ఆత్మహత్య చేసుకుంది. ఆ ఘటనపై అప్పటినుంచి కోర్టులో కేసు నడుస్తుండగా, ఇటీవలే రాజీ కుదిరిందని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఏమైందో తెలియదు కానీ, బుధవారం రాత్రి అయిదవ తరగతి చదువుతున్న కుమారుడు అభిరామ్ (11), ఒకటవ తరగతి చదువుతున్న త్రినాథ్ గౌతమ్ (8)లకు పురుగుమందు తాగించి, అనంతరం ఫ్యాన్‌కు ఉరివేసుకుని చంటి ప్రాణాలు తీసుకున్నాడు. ఈ ఘటనకు సంబంధించి చంటి ఓ వీడియో రికార్డు చేసినట్లు సమాచారం. విషయం తెలిసిన వెంటనే రావులపాలెం రూరల్ సిఐ సి.హెచ్. విద్యాసాగర్, ఆలమూరు ఎస్సై జి.నరేష్ సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## స్కూళ్లల్లో 23 నుంచి ఆధార్ క్యాంపులు

**విజయవాడ, అక్టోబరు 15 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లో గ్రామ, వార్డు సచివాలయాల ఆధ్వర్యంలో ఈ నెల 23 నుంచి 30 వరకు రాష్ట్రంలోని పాఠశాలల్లో ప్రత్యేక ఆధార్ క్యాంపులు నిర్వహించనున్నారు. ఈ మేరకు గ్రామ, వార్డు సచివాలయాల శాఖ డైరెక్టర్ కలెక్టర్లకు ఆదేశాలిచ్చారు. 5 నుంచి 15 సంవత్సరాల మధ్య వయసు గల 8,88,923 మందితో పాటు 15 ఏళ్ల పైబడిన వారు మరో 7.6 లక్షల మంది తప్పనిసరిగా తమ ఆధార్ బయోమెట్రిక్ వివరాలను అప్డేట్ చేసుకోవాల్సి ఉందన్నారు. వారి కోసం పాఠశాలల్లో క్యాంపులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.



## రైతు సంక్షేమ పాలన

### - కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి

**విడవలూరు (నెల్లూరు), అక్టోబరు 15 ప్రభాతవార్త:** రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నాయకత్వంలో రైతు సంక్షేమ పాలన జరుగుతుందని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పేర్కొన్నారు. స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో యూరియా కార్డుల పంపిణి కార్యక్రమానికి విడవలూరు మండల కేంద్రానికి విచ్చేసిన ఎమ్మెల్యేకి రైతులు ఆత్మీయ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ప్రశాంతిరెడ్డి మాట్లాడుతూ కోవూరు నియోజకవర్గంలో యూరియా నిల్వలు పుష్కలంగా ఉన్నాయని రైతులు ఆందోళన చెందవద్దని భరోసా యిచ్చారు. ప్రతి ఎకరాకు 3 బస్తాల చొప్పున యూరియా అందచేస్తామని హామీ యిచ్చారు. యూరియా అక్రమంగా నిల్వ చేసి కృత్రిమ కొరత సృష్టిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు జారి చేశారు. బ్లాక్ మార్కెట్ నియంత్రించి రైతులకు పారదర్శకంగా యూరియా అందచేసే కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం యూరియా కార్డులు పంపిణీకి శ్రీకారం చుట్టామన్నారు. యూరియా కొరత గురించి ప్రతిపక్షం పనికట్టుకొని దుష్ప్రచారాన్ని రైతులు నమ్మవద్దన్నారు.

## ఐద్వా రాష్ట్ర కార్యదర్శిగా సావిత్రి ఏకగ్రీవ ఎన్నిక

**అనంతపురం, అక్టోబరు 15 ప్రభాతవార్త బ్యూరో:** మహిళా సమస్యలపై సమస్యల పోరాటాల నిర్వహించిన మహిళా నాయకురాలు సావిత్రి ఐద్వా రాష్ట్ర కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతపురానికి చెందిన సావిత్రి రాష్ట్ర కార్యదర్శి పదవికి ఎంపిక కావడం పట్ల మహిళలు హార్షం వ్యక్తం చేస్తున్నారు. అనంతపురం ఎంకేఎం ఫంక్షన్ హాల్‌లో బుధవారం నిర్వహించిన ఐద్వా 16వ రాష్ట్ర మహాసభలు సందర్భంగా 57 మందితో నూతన రాష్ట్ర కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికయింది. కరువు జిల్లా అనంతపురం నుండి నూతన రాష్ట్ర కార్యదర్శిగా సావిత్రి ఎన్నికైన శుభ సందర్భంగా మహిళా నాయకులు, ప్రజా సంఘాల నాయకులు ఉద్యమ అభినందనలు తెలియజేశారు.



## దుర్గమ్మవారి ఆలయంలో ఆధ్యాత్మికతకు ప్రాధాన్యం

**ఇంద్రకీలాద్రి, అక్టోబరు 15 ప్రభాతవార్త:** దుర్గమ్మవారిని దర్శించుకోవటానికి వచ్చే భక్తులకు ఆధ్మాత్మిక వాతావరణ వెల్లివిరిసేలా చర్యలు తీసుకుంటున్నామని ఇఓ వికె శీనా నాయక్ తెలిపారు. బుధవారం ఆయన ఆలయ ప్రాంగణ మంతా పర్యటించారు. ఈ సందర్భంగా రాజగోపురం వద్ద వున్న ప్రథమ వైద్య కేంద్రం అభివృద్ధికి చర్యలు తీసుకో వాలని అధికారులకు ఆదేశాలిచ్చారు. అలాగే యాగశాల వద్ద అన్ని రకాల పూజాదికాలు నిర్వహించడానికి తగు చర్యలు తీసుకున్నామని వెల్లడించారు. రాబోయే కార్తీక మాసానికి సంబంధించిన పూజలన్నీ లక్షకుంకుమార్చన సహా పూజామండపంలో నిర్వహిస్తామన్నారు. భక్తులు కొబ్బరికాయలు కొట్టే చోటును శ్రీ మల్లేశ్వర స్వామివార్ల ఆలయం వద్దకు మార్పు చేశామన్నారు. ప్రస్తుతం



కొబ్బరికాయలు కొట్టేచోట కొంత దుర్వాసన వస్తున్నట్లు భక్తులు అసౌకర్యానికి గురవుతున్నట్లు చేసిన సూచనలప్రకారం ఈ మార్పు చేశామన్నారు. శ్రీ మల్లేశ్వర స్వామివార్ల ఆలయం మరింత సుందరంగా తీర్చిదిద్దటానికి ఇఓ పలు సూచనలు చేశారు. మరింత ఆధ్యాత్మిక శోభలీనేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఇంజనీరింగ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. దుర్గమ్మవారి ఆలయంలోజరిగే నిత్యాన్నదాన పథకానికి విజయవాడకు చెందిన జి మంగపతి దంపతులు రూ.1,01,116ల విరాళాన్ని బుధవారం అందించారు. దాతలకు దుర్గమ్మవారి దర్శన ఏర్పాట్లు చేసిన అనంతరం దుర్గమ్మవారి ప్రసాదాలు, జ్ఞాపిక, శేషవస్త్రం అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలందించారు.

## ఎసిబికి పట్టుబడ్డ ఆడిటింగ్ సిబ్బంది

**అనంతపురం, అక్టోబరు 15 ప్రభాతవార్త బ్యూరో:** పెన్షనర్ నుంచి లంచం తీసు కుంటూ ఆడిటింగ్ సిబ్బంది ఎసిబికి పట్టు బడ్డారు. అనంతపురం జిల్లా పరిషత్ ప్రాంగ ణంలో ఆడిటింగ్ విభాగంలో సీనియర్ ఆడిటర్ లక్ష్మినారాయణ, అటెండర్ నూర్‌లు బుధ వారం ఎసిబి అధికారులకు పట్టు బడ్డారు. ఎసిబి డిఎస్పీ సోమన్న తెలిపిన వివరాల మేరకు.. నగరంలోని రాజేంద్ర మున్సిపల్ హైస్కూల్‌లో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న శ్రీనివాసులు మే 31న రిటైర్డ్ అయ్యారు. తన పెన్షన్ ఫైల్ జడ్పి ప్రాంగణంలోని ఆడిటింగ్ విభాగానికి చేరగా ఫైల్ క్లియర్ చేసేందుకు సీనియర్ ఆడిటర్ లక్ష్మినారాయణ రూ.10 వేలు డిమాండ్ చేశారు. తన ఆరోగ్య పరిస్థితిని వివరించినా లక్ష్మినారాయణ డబ్బు ఇస్తేనే



పని జరుగు తుందంటూ డిమాండ్ చేసి చివరకు రూ.8 వేలు చెల్లించాలన్నారు. దీంతో బాధితుడు శ్రీనివాసులు లంచం ఇచ్చేందుకు ఇష్టపడక, తమను సంప్ర దించారన్నారు. మధ్యవర్తుల సమక్షంలో బుధవారం సాయంత్రం బాధితుడు శ్రీనివాసులు లక్ష్మినారాయణకు డబ్బు ఇచ్చేందుకు వెళ్లగా అటెండర్ నూర్‌కు ఇవ్వాలని సూచించాన్నారు. అటెండర్ నూర్ తీసుకుని సీనియర్ ఆడిటర్ లక్ష్మినారా యణకు అందజేస్తుండగా రెడ్ హ్యాండెడ్‌గా ఇద్దరిని పట్టుకున్నా మన్నారు. నిందితులను విచారణ అనంతరం ఎసిబి కోర్టుకు హాజరు పరుస్తామని ఆయన పేర్కొన్నారు. దాడుల్లో ఎసిబి ఎస్ఐలు హమిద్‌ఖాన్, జయమ్మ తోపాటు సిబ్బంది పాల్గొన్నారు.

# శ్రామికుల ఈ కేవైసీ త్వరితగతిన పూర్తి చేయాలి : ఏపీడి జగదాంబ



**రౌతులపూడి , అక్టోబర్ 15 ( ప్రభాతవార్త ) :**
మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం లో పనిచేస్తున్న శ్రామికుల ఈ కేవైసీ త్వరితగతిన పూర్తి చేయాలని కత్తిపూడి క్లస్టర్ ఏపీ డి జగదాంబ పేర్కొన్నారు. బుధవారం మండలంలో ఎంపీడీఓ జి శివరామకృష్ణయ్య అధ్యక్షతన ఏపీవో, టి ఏ లు, ఎఫ్ఏలు, సి ఓ లతో ఏపిడి సమీక్షా సమావేశం నిర్వహిం చారు. ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ మండలంలోమొత్తం 24000 ఉపాధి శ్రామికులకు గాను 14000 మందికి ఈ కేవైసీ పూర్తి చేయడం జరిగిందన్నారు. ప్లానింగ్ ప్రాసెస్ 2026-27 విషయమై సమీక్షించారు. గ్రామ సభల్లో వచ్చే ఆర్థిక సంవత్సరం సంబం ధించి ఉపాధి శ్రామికులకు పని కల్పించుటకు అవసరమైన పనులు గుర్తించి గ్రామసభ ఆమోదం తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో ఏపీవో బడే కాంచన పాల్గొన్నారు.

# క్యాట్ లెవెల్ వన్ పరీక్షలో మోరంపూడి శ్రీ చైతన్య విద్యార్థుల ప్రతిభ



**ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా బ్యూరో , అక్టోబర్ 15 ( ప్రభాతవార్త ) :**
ఇటీవల ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన నాలెడ్జ్ అసెస్మెంట్ టెస్ట్ ఒలంపియాడ్ లో స్థానిక శ్రీ చైతన్య విద్యార్థులు మ్యాథ్స్ ,ఫిజిక్స్, కెమిస్ట్రీ లలో 156 మంది ప్రతిభ కనబరిచారని ప్రిన్సిపల్ సి హెచ్ సౌజన్య తెలిపారు. ప్రతిభ కనపరిచిన విద్యార్థులను, ప్రిన్సిపాల్ ను, ఉపాధ్యాయ బృందాన్ని ఎగ్జిక్యూటివ్ ఎ జి ఎం సురేష్ అభినందించారు. రాజమండ్రి ప్రాంతీయ అధికారి ఉదయ్ శంకర్ విద్యార్థు లకు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.
ఉదయ్ శంకర్ మాట్లాడుతూ రాజమండ్రి సిటీ రీజియన్ లో అత్యధికంగా 450 పైన విద్యార్థులు ఉత్తీర్ణత చెందారని మరి ఏ ఇతర విద్యాసంస్థ లకు అందనంత రీతిలో ప్రతిభను కనబరిచారని తెలియజేస్తూ ఈ విజయానికి ఐపీఎల్, సి బ్యాచ్, టెక్నో వంటి ప్రతిష్టాత్మక ప్రోగ్రామ్స్ వల్లనే సాధ్యమైందని హర్షం వ్యక్తపరిచారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్ కిరణ్ పాండే ఇన్చార్జులు,ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

# ఉపాధి హామీ పనులకు ప్రణాళికలు



**సీతానగరం , అక్టోబర్ 15 ( ప్రభాతవార్త ) :**
మండలంలోని ముగ్గళ్ళ పంచాయతీలో ఎంపిడిఓ యం.భారతి ఆధ్వర్యంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం 2026-2027 సంవత్సరానికి ఉపాధి శ్రామికులకు వంద రోజులు పని కల్పించుటకు బుధవారం పనులు గుర్తింపు గ్రామసభ నిర్వహించారు. గ్రామసభలో ఉపాధి హామీ పనుల వివరాలను వివరించి, మొత్తం 26 కాలువ పనులు, రెండు చెరువులు, రెండు ఫారం ఫాండ్లు, మూడు సోక్ పిట్లు, ఐదు కంపోస్ట్ పిట్లు, రెండు పుంత రోడ్ల నిర్మాణంతో సహా పలు అభివృద్ధి పనులను గుర్తించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న , తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా ఉండేశ్వరపురం గ్రామపంచాయతీలో ఏపివో సత్యవతి ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. ఈ సభలో తొమ్మిది కాలువ పనులు, ఒక చెరువు గట్టుపై మొక్కల పెంపకం, 33 సోక్ పిట్లు, 15 కంపోస్ట్ పిట్లు, రెండు పుంత రోడ్ల నిర్మాణం, మ్యాజిక్ డ్రైన్ వంటి ముఖ్యమైన పనులను గుర్తించారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ సిబ్బంది, ఉపాధి శ్రామికులు, తదితరులు పాల్గొన్నారు.

# సిఐటియు మండల నూతన కార్యవర్గం ఎన్నిక



**కోటనందూరు ( రౌతులపూడి ), అక్టోబర్ 15 ( ప్రభాతవార్త ) :**
కోటనందూరు మండల సిఐటియు నూతన కార్యవర్గం ప్రెసిడెంట్ గా ముక్కుడుపల్లి బాబురావు, సెక్రటరీగా షేక్ పద్మ సిఐటియు అనుబంధ కార్మిక సంఘాలు వీరి అభ్యర్థత్వాన్ని ఆమోదించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి ఆశ మధ్యాహ్నం భోజన పథకం కార్మికులు ట్రాన్స్పోర్ట్ భవనిర్మాణం కార్మికులు జీడి పిక్కల కార్మికులు స్కూలు ఆయాలు పంచాయతీ కార్మికులు ఏకగ్రీవంగా తీర్మానించారు.ఈ కార్యక్రమం లో కోటనందూరు అంగన్వాడి సెక్టర్ లీడర్స్ రవణమ్మ పద్మ లీల లోవ కుమారి శ్రీదేవి,ఆశారంగం మండల అధ్యక్షులు మరియారత్నం, వెంకటలక్ష్మి సత్యవతి దేవుడమ్మ అమ్మోజి అప్పల నరస వెంకటలక్ష్మి బొజ్జ నూకరాజు. లోవరాజు ట్రాన్స్పోర్ట్ రంగ రూపీ బాయ్ , విజ్జుం సత్తిబాబు శేఖర్ ముసలయ్య మరినీయ, తదితరులు పాల్గొన్నారు.

# అంగరంగ వైభవంగా వాడపల్లి బ్రహ్మోత్సవాలు

## - శ్రీకృష్ణ అలంకరణలో సూర్యప్రభ వాహన పై శ్రీనివాసుడు



**ఆత్రేయపురం , అక్టోబర్ 15 ( ప్రభాతవార్త ) :**
ఎదువారాల వెంకన్నగా ప్రసిద్ధి చెందిన కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి వారి 13వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆరవ రోజు బుధవారం స్వామివారు శ్రీకృష్ణ పరమాత్మ అలంకారంలో సూర్యప్రభ వాహనంపై మాడవీధుల్లో ఊరేగారు. ఉదయం సుప్రభాత సేవతో మొదలైన కార్యక్రమాలు నవనీత హారతి, విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, పారమాత్మ ఉపనిషత్ పూర్వక అష్టోత్తర శతకలశాభిషేకం, ప్రధాన హెూమములు, దిగ్దేవతా బలిహరణ, బ్రహ్మశ్రీ ఖండవల్లి రాజేశ్వర వరప్రసాదచార్యులు బ్రహ్మత్వంలో అర్చకులు నేతృత్వంలో శాస్త్రోక్తంగా నిర్వహించారు. శ్రీ స్వామివారికి అమ్మవారికి ఆలయ చైర్మన్ ముదునూరి వెంకటరాజు శ్రావణి దంపతులు, ఆలయ ఉప కమిషనర్ కార్యనిర్వాహణాధికారి నల్లం సూర్య చక్రధరరావు కనకదుర్గ, దంపతులు, పట్టు వస్త్రాలు సమర్పిం చారు. శ్రీకృష్ణ పరమాత్మ అలంకారంలో సూర్యప్రభ వాహనంపై తిరుమాడ వీధుల్లో విహరించారు.వేలాది మంది భక్తులు స్వామీ వారి సేవను తిలకించారు. వివిధ సంస్కృతి కార్యక్రమాలు సన్నాయి వాయిద్యాలు వివిధ కళాకారుల నృత్యా ప్రదర్శనలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. నీరాజన మంత్రపుష్పాలు, శ్రీ స్వామి వారిని దర్శనం దర్శించుకున్న అనంతరం తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.



# శ్రీవారి బ్రహ్మోత్సవాలకు జననీరాజనం

## మోహినీ అలంకరణలో చంద్రప్రభ వాహనం పై మాడ వీదుల్లో విహరించిన శ్రీవారు



**ఆత్రేయపురం , అక్టోబర్ 15 ( ప్రభాతవార్త ) :**
కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి వారి 13వ వార్షిక బ్రహ్మోత్సవాలు అశేష భక్తజనం నడుమ అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. ఆరవ రోజు బుధవారం సాయంత్రం స్వామివారు చంద్ర ప్రభ వాహనం పై ఊరేగి భక్తులకు కనువిందు చేశారు. సాయంత్రం స్వస్తి వచనము,ప్రధాన హెూమములు, నవగ్రహ హెూమములు,శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర మూల మంత్ర పూర్వక శ్రీ వేంకటేశ్వర హెూమము, దిగ్దేవతా బలిహరణ,నీరాజన మంత్రపుష్పములు,తీర్థ ప్రసాద వితరణ జరిపారు. అనంతరం మోహినీఅలంకరణలో చంద్రప్రభ వాహనంపై స్వామివారు పుర వీథుల్లో ఊరేగారు. స్వామివారి సేవలో ఆలయ చైర్మన్ ముదునూరి వెంకటరాజు, డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధర రావు దంపతులు పాల్గొన్నారు.ఈ బ్రహ్మోత్సవాలు తిలకించడానికి వేలాది మంది భక్తులు తరలి రావడంతో ఆలయ పరిసరాలు కిక్కిరిసి పోయాయి. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా దేవస్థానం అధికారులు తగు ఏర్పాట్లు చేసారు. ఈ కార్యక్రమం లో ముదునూరి రామభద్రరాజు,ఏవుగంటి వెంకటేష్,సూపెరడెంట్ పులపర్తి రాంబాబు, టెంపుల్ ఇన్స్పెక్టర్ వై. శ్రీనివాస్, నందిశ్వరుడు, వర్మ, దేవస్థానం సిబ్బంది అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.





# మందుబాబులకు అడ్డాగా ప్రభుత్వ అసంపూర్తి భవనాలు



**రౌతులపూడి , అక్టోబర్ 15 (ప్రభాతవార్త)**
ప్రభుత్వ అసంపూర్తి భవనాలు మందుబాబులకు అడ్డాగా మారాయి. ప్రభుత్వం లక్షల రూపాయలు హెచ్చించి నిర్మించ దలచిన భవనాలు పూర్తి కాకపోవడంతో ఆయా భవనాలు మందుబాబులకు నిలయంగా ఉన్నాయి. గత ప్రభుత్వంలో గ్రామ సచివాలయాలు, వెల్నెస్ సెంటర్లు, రైతు భరోసా కేంద్రాలు నిర్మాణాలను చేపట్టారు. కొన్ని గ్రామాల్లో పూర్తికాగా, మరికొన్ని గ్రామాల్లో ఆయా భవనాలు పూర్తి కాలేదు. దీంతో మందు బాబులు మద్యం సేవించి అక్కడే పోగుచేసిన కాళీ సీసాలు మండలంలోని బలరాం పురం వెల్నెస్ సెంటర్ అసంపూర్తి భవనములో కనపడుతున్నాయి. మందుబాబులు బహిరంగంగా మద్యం సేవిస్తు న్నారు అనడానికి ఇవి నిదర్శనం గా ఉన్నాయి. అసంపూర్తి భవనాలను పూర్తి చేసి సేవలకు అందుబాటులోకి తేవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

## ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయం వైపు అడుగులు వేయాలి : కలెక్టర్ కీర్తి చేకూరి



**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో , అక్టోబర్ 15 ( ప్రభాతవార్త ) :**
జిల్లాలో ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయ విధానాలను అవలంబించి, ఖర్చులను తగ్గించుకోవాలని జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి పిలుపునిచ్చారు. బుధవారం సాయంత్రం కొవ్వూరు మండలం దొమ్మేరు గ్రామంలో రైతు నీరుకొండ సత్యనారాయణ నిర్వహిస్తున్న ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని స్వయంగా పరిశీలించి, అక్కడ అమలు చేస్తున్న ప్రకృతి వ్యవసాయ పద్ధతులను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ, ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో 12 ఎకరాల్లో చెరకు, బొప్పాయి, అరటి, పసుపు, కంద, డ్రాగన్ ఫ్రూట్, జామ మొక్కలను సాగు చేయడం అభినందనీయమని, పలువురికి ఆదర్శం అని తెలిపారు. జిల్లాలో మొత్తం 43 వేల ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం జరుగుతోందని, అందులో 2300 మంది రైతులు పూర్తిస్థాయిలో ప్రకృతి పద్ధతులను అనుసరిస్తున్నారని చెప్పారు. అలాగే 18 డ్రోన్ల టెక్నాలజీ ద్వారా 7800 మంది రైతులు 10600 ఎకరాల్లో కషాయాలు వాడుతూ పురుగుమందుల వినియోగాన్ని తగ్గిస్తున్నారని కలెక్టర్ పేర్కొన్నారు. ఆవుపేడ, మూత్రం ద్వారా జీవామృతం తయారీ, ముల్చింగ్, లింగాకర్షణ బుట్టల వాడకం వంటి ప్రకృతి పద్ధతులపై కలెక్టర్ రైతులతో చర్చించారు. ఈ సందర్శనం చాలా సంతృప్తికరంగా ఉందని తెలిపారు. ఏక్కడైనా సంస్కరణలు తొలి అడుగుతో సాధ్యం అవుతుందని, ఆ దిశలో కృషి చెయ్యడం అభినంద నీయం అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి ఎస్. మాధవరావు, జిల్లా ఉద్యాన అధికారి ఎన్. మల్లికార్జున రావు, హెచ్.ఓ. డి. సుధీర్ కుమార్ (కొవ్వూరు), ఏపిసిఎన్ఎఫ్ డీపీఎం బి.తాతారావు, అదనపు డీపీఎం మహబూబ్ వలి, వ్యవసాయ శాఖ ఏడి చింతల శ్రీనివాస్, ఏఓ ఎ. గంగాధర్, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

# అమలాపురం తహసిల్దార్ కార్యాలయంలో ఏసీబీకి చిక్కిన తాసిల్దార్ ప్రసాద్

## - రూ 50,000లు రైతు నుండి తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్గా పట్టివేత
## - కార్యాలయంలో అదనంగా ఉన్న రూ 5,84,500లు స్వాధీనం



**అమలాపురం ( కోనసీమ బ్యూరో ), అక్టోబర్ 15 ( ప్రభాతవార్త ) :**
అమలాపురం తాసిల్దార్ కార్యాలయంపై బుధవారం రాజమండ్రి ఏసీబీ అధికారులు దాడి చేశారు. ఈ దాడిలో 50 వేల రూపాయల లంచం తీసుకున్న తాసిల్దార్ అశోక్ ప్రసాద్, డేటా ఎంట్రీ ఆపరేటర్ రామును అదుపులోకి తీసుకున్నారు. దీనికి సంబంధించి ఎసిబి డిఎస్పి ఎం కిషోర్ కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రాజమండ్రి మండలం, రాజవోలు గ్రామానికి చెందిన గంధం దుర్గ కొండలరావు తండ్రి సత్యనారాయణ 15 సెంట్లు భూమి ని అమలాపురంలో1995లో కొన్నారు. ప్రస్తుతం సత్యనారాయణ అనారోగ్యంగా ఉండడంతో ఆ భూమిని అమ్మడానికి తాసిల్దార్ కార్యాలయంలో ఎఫ్ లైనుకు కొండలరావు దరఖాస్తు చేశారు. దీనిపై తాసిల్దార్ ప్రసాద్ లక్ష రూపాయలు లంచం డిమాండ్ చేశారు. డేటా ఎంట్రీ ఆపరేటర్ రాము 50 వేల రూపాయలు ఇవ్వడానికి సెటిల్ చేశారు. దీంతో రైతు రాజమండ్రి ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. బుధవారం తాసిల్దార్ కార్యాలయంలో రాము ద్వారా తహసీల్ధార్ అశోక్ ప్రసాద్ 50వేల నగదు తీసుకుంటుండగా రెడ్ హాండెడ్ గా ఎసిబి అధికారులు పట్టుకున్నారు. దీంతో పాటు తహసీల్దారు టేబుల్లో అనధికారికంగా ఉన్న రూ.5,84,500 స్వాధీనం చేసుకున్నారు. మొత్తం రూ.6,34,500లు ఎసిబి అధికారులు స్వాధీనం చేసుకున్నారు.
వీరిపై కేసు నమోదు చేసి రాజమండ్రి ఏసీబీ కార్యాలయానికి తరలించారు. గురువారం ఏసీబీ కోర్టులో హాజరు పరుస్తామన్నారు. రామును ఆఫీసులో ఉంచి, తాసిల్దార్ ప్రసాద్ ను ఇంటికి తరలించి విచారిస్తున్నారు. ప్రభుత్వ అధికారులు ఎవరైనా లంచం డిమాండ్ చేస్తే ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేయవచ్చునని డిఎస్పి పేర్కొన్నారు. ఎసిబి దాడులలో డిఎస్పీ ఎం. కిషోర్ కుమార్, సిఐలు వై.సతీష్, ఎన్.వి.బాస్కరరావు పాల్గొన్నారు.

# టిజే నగరం వైసిపి సర్పంచ్ అభ్యర్థిగా సుర్ల రాజు




**కోటనందూరు ( రౌతులపూడి ), అక్టోబర్ 15 ( ప్రభాతవార్త ) :**
కోటనందూరు మండలం, టి జే నగరం గ్రామ వైసిపి సర్పంచ్ అభ్యర్థిగా సుర్ల రాజు ను ఎంపిక చేశారు. కోటనందూరు మండల వైసిపి కార్యకర్తల సమావేశంలో రాష్ట్ర అధికార ప్రతినిధి లాలం బాబ్జి ప్రకటించగా గ్రామ సర్పంచ్ సుర్ల రాంబాబు మిగిలిన గ్రామ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఏకగ్రీవంగా ఆమోదించి అభినందనలు తెలియజేసి తమ మద్దతును ప్రకటించారు. సుర్ల లోవ వెంకట సత్యనారాయణ అనే రాజు ఎంఎస్సీ బీఈడీ వరకు చదువుకున్నారు. నేవీలో ఉద్యోగం వచ్చిన రాజకీయాలపై ఉన్న ఆసక్తితో 2003వ సంవత్సరంలో దివంగత వైయస్ రాజశేఖర్ రెడ్డి పాదయాత్రలో రాజకీయాల్లోకి ప్రవేశించారు. విద్యను అభ్యసిస్తున్న సమయంలోనే బిఈడి కాలేజీ ప్రెసిడెంట్ గా చేశారు. కాంగ్రెస్ పార్టీలో 2008 నుండి 2013 వరకు మండల యువజన కాంగ్రెస్ ప్రెసిడెంట్ గా పనిచేశారు. రాష్ట్ర విభజన అనంతరము వైసిపి పార్టీలో జాయిన్ అయ్యి దాడిశెట్టి రాజాకు విధేయుడుగా రాజకీయాల్లో చురుకైన పాత్ర పోషిస్తున్నారు. వైసీపీ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత మండల వ్యవసాయ సలహా మండల చైర్మన్ గా నామినేటెడ్ పదవి వరించింది. ప్రస్తుతం వైసిపి జిల్లా జాయింట్ సెక్రటరీగా పనిచేస్తున్నారు, గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా గ్రామ ప్రజల ఆమోదంతో నిర్ణయించారు. ఈ సందర్భంగా సుర్ల రాజు మాట్లాడుతూ మా గ్రామ ప్రజలందరూ ఏకగ్రీవంగా నన్ను ఎంపిక చేసినందుకు కృతజ్ఞతలు తెలియజేస్తూ ఈ అవకాశం కల్పించిన మాజీ మంత్రి జిల్లా వైసీపీ అధ్యక్షుడు దాడిశెట్టి రాజాకు మండల నాయకులకు కృతజ్ఞతలు తెలియజేస్తూ, గ్రామ ప్రజలందరూ సమిష్టి కృషితో సర్పంచిగా గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు గొర్లి రామచంద్రరావు, ఎంపీపీ లగుడు శ్రీనివాస్, సీనియర్ నాయకులు నల్లమిల్లి గోవిందు, వేములరాజబాబు, లెక్కల భాస్కర్, తుని నియోజకవర్గ వాణిజ్య విభాగం అధ్యక్షుడు వెలగా వెంకటకృష్ణాజి, మండల వైస్ ప్రెసిడెంట్ కొరుప్రోలు రమణమ్మ కృష్ణ, కోటనందూరు సర్పంచ్ గరిసింగు శివలక్ష్మి దొరబాబు, కో ఆప్షన్ సభ్యుడు జిగటాల కోట సత్తిబాబు, కురందాసు రాము, టి జే నగరం గ్రామ పెద్దలు సుర్ల శ్రీను, అల్లు కాశీ నాయుడు, మాజీ ఎంపీటీసీ శెట్టి రాజులనాయుడు, సుర్ల నాగ రమణ, పంచాయతీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# పాల దిగుబడిని పెంచే దిశగా చర్యలు

**కోనసీమ బ్యూరో , అక్టోబర్ 15 ( ప్రభాతవార్త ) :**
పాడి పరిశ్రమ అభివృద్ధికి పోషక విలువలు కలిగిన ప్రోటీన్ టోటల్ మిక్సర్ రేషన్ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల ద్వారా అందించేందుకు చర్యలు చేపడుతున్నట్లు జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ వెల్లడించారు. స్థాని కలెక్టరేట్ నందు జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారులు జిల్లా సహకార శాఖ సిబ్బందితో సంయుక్తం గా సమావేశం నిర్వహించి పాల దిగుబడిని పెంచే దిశ గా మిక్స్ దానా సరఫ రాకై కార్యాచరణ పై సమీక్షించా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోనసీమ జి ల్లాలో పాడి పరిశ్రమ అభి వృద్ధికై ప్రాథమిక వ్యవసా య సహకార పరపతి సంఘాల ద్వారా మిశ్రమ దానాను లాభాపేక్ష లేకుండా రైతులకు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు

Print and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at 11-37, Morampudi, Rajamahendravaram-533 103. Phone : 2469407, 2469408.
RNI No.64863/96,“Editor : *Damerla Sai Baba, *Responsible for s election of News-under the PRB Act. Regd.: No.H/SD/337/09-11 Air Surcharge: Delhi : 40Ps



सत्यमेव जयते
భారత ప్రభుత్వం



# వృద్ధి. అవకాశం. శ్రేయస్సు.
# ఆంధ్ర ముందుంది

## ₹13,400 కోట్లకు పైగా విలువైన అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవం & జాతికి అంకితం





## శ్రీ నరేంద్ర మోదీ

గౌ॥ ప్రధానమంత్రి
వారి అమృత హస్తాల మీదుగా

**గురువారం, 16 అక్టోబర్, 2025 మధ్యాహ్నం 12:00 గంటల నుండి**
**రాగ మయూరి గ్రీన్ హిల్స్, నన్నూరు, కర్నూలు, ఆంధ్రప్రదేశ్**

### శంకుస్థాపన

- కర్నూలు-III పిఎస్ వద్ద పునరుత్పాదక విద్యుత్ ప్రాజెక్టుల సమీకరణ కోసం ట్రాన్స్‌మిషన్ వ్యవస్థ బలోపేతం
- జాతీయ పారిశ్రామిక కారిడార్ అభివృద్ధి కార్యక్రమం కింద ఓర్వకల్ పారిశ్రామిక ప్రాంతం
- జాతీయ పారిశ్రామిక కారిడార్ అభివృద్ధి కార్యక్రమం కింద కొప్పర్తి పారిశ్రామిక ప్రాంతం
- NH-516C లోని సబ్బవరం నుండి షీలానగర్ సెక్షన్ వరకు 6 లేన్ల యాక్సెస్ కంట్రోల్డ్ గ్రీన్‌ఫీల్డ్ హైవే
- రెండు రైల్వే ప్రాజెక్టులు - కొత్తవలస మరియు విజయనగరం మధ్య 4వ రైలు మార్గం & పెందుర్తి మరియు సింహాచలం నార్త్ మధ్య రైలు ఫ్లైఓవర్ మార్గం

### ప్రారంభోత్సవం

- NH-71 లోని పీలేరు నుండి కాలురు సెక్షన్ (భాక్రపేట వరకు) నాలుగు లేన్లతో సహా ఆరు రోడ్లు & హైవేల ప్రాజెక్టులు
- కృష్ణా జిల్లా నిమ్మలూరు గ్రామంలో అడ్వాన్స్‌డ్ నైట్ విజన్ ప్రొడక్ట్స్ ఫ్యాక్టరీ
- చిత్తూరులో LPG బాట్లింగ్ ప్లాంట్

### జాతికి అంకితం

- శ్రీకాకుళం - అంగుల్ సహజ వాయువు పైప్ లైన్
- కొత్తవలస - బొడ్డవర సెక్షన్ & షిమిలిగూడ - గోరాపూర్ సెక్షన్ మధ్య రైలు మార్గాన్ని డబ్లింగ్ చేయడం

### ప్రయోజనాలు

- కర్నూలు నుంచి జాతీయ గ్రిడ్‌కు పునరుత్పాదక విద్యుత్తు సరఫరా, అనుసంధానం.
- రాయలసీమ ప్రాంతంలో కొప్పర్తి మరియు ఓర్వకల్లు వద్ద పారిశ్రామిక ప్రాంతాల అభివృద్ధి ద్వారా భారీ ఉపాధి కల్పన.
- విశాఖపట్నం, ఎస్ ఆర్ పురం, డి జి పేట, సి ఎస్ పురం, గుడివాడ, మరియు ఎన్. గుండ్లపల్లి పట్టణాలలో వివిధ రోడ్లు & హైవేలు ప్రాజెక్టుల ద్వారా రద్దీ తగ్గింది.
- ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు మరియు తెలంగాణల మధ్య వేగవంతమైన మరియు సులభతరమైన అంతర్‌రాష్ట్ర ప్రయాణం.
- తిరుపతి మరియు శ్రీ కాళహస్తి వంటి ప్రధాన పుణ్యస్థానాలకు మెరుగైన రాకపోకలు.
- కొత్తవలస - విజయనగరం మార్గంలో 4వ లైన్ ద్వారా విజయనగరం జిల్లాతో మరింత సౌకర్యవంతమైన రైలు అనుసంధానత వల్ల వాణిజ్య కేంద్రాలు, స్థానిక వ్యాపారానికి ఊతం.
- పెందుర్తి - సింహాచలం నార్త్ - దువ్వాడ రైలు కారిడార్ ద్వారా ఆర్థిక వృద్ధిని మరియు వేగవంతమైన రవాణాను పెంచడం.
- ఆంధ్రప్రదేశ్ లోని శ్రీకాకుళం జిల్లాలో గృహాలు, పరిశ్రమలు, వాణిజ్య యూనిట్లు, ఆటోమొబైల్ రంగాలు మరియు CNG స్టేషన్లకు పర్యావరణ అనుకూలమైన, తక్కువ ఖర్చుతో కూడుకున్న సహజ వాయువు సరఫరా.
- చిత్తూరులోని LPG బాట్లింగ్ ప్లాంట్ ద్వారా తక్కువ ధరలో అందుబాటులో ఉండనున్న గ్యాస్, దాదాపు 7.2 లక్షల మంది వినియోగదారులకు సేవలందించనున్న బాట్లింగ్ ప్లాంట్.

### వీరి సమక్షంలో

**శ్రీ ఎస్. అబ్దుల్ నజీర్**
గవర్నర్, ఆంధ్రప్రదేశ్

**శ్రీ నారా చంద్రబాబు నాయుడు**
ముఖ్యమంత్రి, ఆంధ్రప్రదేశ్

**శ్రీ కింజరపు రామ్మోహన్ నాయుడు**
కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి

**డా. చంద్రశేఖర్ పెమ్మసాని**
కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ సహాయ మంత్రి

**శ్రీ భూపతి రాజు శ్రీనివాస వర్మ**
భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖ సహాయ మంత్రి

**శ్రీ కొణిదల పవన్ కళ్యాణ్**
ఉప ముఖ్యమంత్రి, ఆంధ్రప్రదేశ్

**శ్రీ బి.సి. జనార్ధన్ రెడ్డి**
రోడ్లు మరియు భవనాలు, మౌలిక సదుపాయాలు మరియు పెట్టుబడుల మంత్రి, ఆంధ్రప్రదేశ్

**శ్రీ గొట్టిపాటి రవి కుమార్**
విద్యుత్ శాఖ మంత్రి, ఆంధ్రప్రదేశ్

**శ్రీ టి. జి. భరత్**
పరిశ్రమలు & వాణిజ్య శాఖ, ఆహార ప్రాసెసింగ్ మంత్రి, ఆంధ్రప్రదేశ్ & ఎమ్మెల్యే, కర్నూలు

**శ్రీ బస్తిపాటి నాగరాజు పంచలింగాల**
పార్లమెంట్ సభ్యులు, కర్నూలు

DD NEWS ఈ కార్యక్రమాన్ని DD న్యూస్ ప్రత్యక్ష ప్రసారంలో చూడండి.